

ఈఎన్‌సీ చీఫ్ స్టాఫ్ ఆఫీసర్‌గా మనోజ్ ఝా



విశాఖపట్నం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): తూర్పు నౌకాదళం చీఫ్ స్టాఫ్ ఆఫీసర్ (ఆపరేషన్లు)గా రియర్ అడ్మిరల్ మనోజ్ ఝా బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన 1995 జనవరి ఒకటిన నేవీలో చేరారు. తుపాకులు పేల్చడంలో నేర్పరి. యుద్ధ నౌకలు చెన్నై, కమోర్తా, విరాట్‌లలో వివిధ హోదాలలో పనిచేశారు. ఢిల్లీలోని నేవీ హెడ్ క్వార్టర్‌లో పనిచేస్తూ విశాఖకు వచ్చారు.

దుకాణం తెరిచారు!

బాణసంచా షాపు రూ.1.2 లక్షలు

- వ్యాపారులకు అమ్మకం
- అసోసియేషన్ పేరుతో ఇంజనీరింగ్ కళాశాల గ్రౌండ్ కోసం ఏయూకు దరఖాస్తు
- ఇంకా అనుమతులు రాకుండానే దుకాణాల ఏర్పాటు పనులు ప్రారంభం
- పోలీస్, జీవీఎంసీ, అగ్నిమాపక శాఖలకు సమాచారం కరువు
- చక్రం తిప్పుతున్న ప్రజా ప్రతినిధి అనుచరులు



ఏయూ ఇంజనీరింగ్ కళాశాల మైదానంలో బాణసంచా దుకాణాలకు ఏర్పాట్లు

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

దీపావళి నేపథ్యంలో బాణసంచా దుకాణాల ఏర్పాటు పేరుతో కొందరు దందా ప్రారంభించేశారు. బాణసంచా వ్యాపారుల సంఘాన్ని ముందుంచి నగరానికి చెందిన ఓ ప్రజా ప్రతినిధి అనుచరులు ఇద్దరు చక్రం తిప్పుతున్నారు. ఏయూ ఇంజనీరింగ్ కళాశాల మైదానంతోపాటు ఎంవీపీ కాలనీలోని ఏఎస్ రాజా మైదానంలో దుకాణాలను తామే ఏర్పాటు చేసి, అనుమతులు కూడా తెస్తామని హామీ ఇస్తున్నారు. ఒక్కో దుకాణానికి రూ.1.2 లక్షలు ధర నిర్ణయించారు. జీవీఎంసీ, పోలీస్, అగ్నిమాపక శాఖల నుంచి అనుమతులు వచ్చిన తర్వాత నిబంధనల ప్రకారం దుకాణాలను ఏర్పాటుచేయాల్సి ఉన్నాసరే, అవేవీ పట్టించుకోకుండా పనులు ప్రారంభించేశారు.

దీపావళికి నగరంలో బాణసంచా విక్రయాలు భారీగా జరుగుతాయి. దీంతో కొంతమంది పండగ రెండు రోజులు దుకాణం పెట్టి ఎంతో కొంత సంపాదించుకుంటారు. గత పదేళ్లుగా ఏయూ ఇంజనీరింగ్ కళాశాల మైదానంలోనే బాణసంచా వ్యాపారులు దుకాణాలు ఏర్పాటుచేసుకుని విక్రయాలు సాగిస్తున్నారు. వైసీపీ హయాంలో బాణసంచా దుకాణాల ఏర్పాటులో ఆ పార్టీ నేతలు జోక్యం చేసుకోవడం ప్రారంభించారు. దుకాణాల ఏర్పాటుకోసం నాలుగు రోజులు లీజుకు ఇవ్వాలంటూ బాణసంచా వ్యాపారుల సంఘం పేరుతో ఏయూ వీసీకి లేఖ రాయించి, ఆ తర్వాత పోలీస్, జీవీఎంసీ, ఏపీఈపీడీసీఎల్, అగ్నిమాపక శాఖల నుంచి కూడా పర్మిషన్స్ తీసుకుని స్వయంగా ఏయూ ఇంజనీరింగ్ మైదానంలో దుకాణాలు ఏర్పాటుచేసి, వాటిని వ్యాపారులకు విక్రయించి సొమ్ము చేసుకున్నారు. ఈ ఏడాది దీపావళి నేపథ్యంలో ఏయూ హెలీపాడ్ మైదానంలో దుకాణాల ఏర్పాటుకు అనుమతివ్వాలంటూ 'స్టార్స్ ఫైర్ మర్చంట్ వెల్ఫేర్ అసోసియేషన్' పేరుతో ఒకరు గత నెల 26న జీవీఎంసీ కమిషనర్‌కు లేఖ రాశారు. దీనిపై స్పష్టత కోరుతూ జీవీఎంసీ కమిషనర్ కేతన్‌గార్గ్ ఈనెల ఏడున ఏయూ వీసీకి లేఖ పంపించారు. ఏయూ అధికారులు దీనిపై ఎలాంటి నిర్ణయం తీసుకోకముందే ఏయూ హెలీపాడ్ మైదానంలో సోమవారం నుంచే దుకాణాలు ఏర్పాటు పనులు ప్రారంభించేశారు. వాస్తవానికి దుకాణాల ఏర్పాటుకు ఏయూ మైదానం లీజుకు ఇచ్చేందుకు అంగీకరిస్తే, దుకాణం పెట్టాలనుకునే వ్యక్తి స్వయంగా నిర్ణీత రుసుం చెల్లించి జీవీఎంసీకి, పోలీస్ కమిషనర్‌కు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. ఆయా దరఖాస్తులను జీవీఎంసీ టౌన్‌ప్లానింగ్ అధికారులు పరిశీలించి లేదంటే నేరుగా పోలీస్ కమిషనర్‌కు దరఖాస్తు చేసుకుంటే అక్కడి నుంచి జీవీఎంసీకి, అగ్నిమాపక శాఖ, ఈపీడీసీఎల్ అధికారులకు పంపించి వారి నుంచి ఎన్‌ఓసీ వచ్చిన తర్వాత అనుమతి జారీచేస్తారు. అప్పుడు అగ్నిమాపక శాఖ నిబంధనలకు అనుగుణంగా దుకాణాలను ఏర్పాటుచేసుకోవాల్సి ఉంటుంది. కానీ ఏయూ అధికారులు మైదానం లీజుకు ఇవ్వకముందే దుకాణాల ఏర్పాటు పనులు జరిగిపోతుండడంతో కలెక్టర్ ఎంఎన్ హరేంధిరప్రసాద్ ...మిగతా 8వ పేజీలో

నడిరోడ్డుపై వివాహిత హత్య

ఎదురింట్లో ఉండే వ్యక్తి ఘాతుకం

- విచక్షణ కోల్పోయి పదునైన ఆయుధంతో పీక కోసిన నిందితుడు



కుమారులిద్దరితో శ్రావణ సంధ్యారాణి (ఫైల్)

విశాఖపట్నం/అక్కయ్యపాలెం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి):

నగరంలో పట్టపగలు నడిరోడ్డుపై ఒక వివాహిత హత్యకు గురైంది. ఆమె నివాసానికి ఎదురు ఇంట్లో ఉండే వ్యక్తే పదునైన ఆయుధంతో గొంతు కోసి హత్య చేశాడు. అందరూ చూస్తుండగానే హత్య జరగడంతో ఆ ప్రాంతంలో తీవ్రకలకలం రేపింది. అక్కయ్యపాలెం నందగిరి నగర్‌లో బుధవారం సాయంత్రం జరిగిన ఈ ఘటనకు సంబంధించి నాలుగో పట్టణ పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. శ్రావణ సంధ్యారాణి అలియాస్ సోనూ (32) నందగిరి నగర్‌లో అద్దె ఇంట్లో ఉంటుంది. సోనూకు ఎనిమిదేళ్ల వయస్సు గల ఇద్దరు (కవలలు) కుమారులు ఉన్నారు. ఇద్దరూ మానసిక వైకల్యంతో పుట్టడంతో శ్రావణ సంధ్యారాణి భర్త ఆమెను, పిల్లలను వదిలేసి వెళ్లిపోయాడు. దీనిపై ప్రస్తుతం ఇద్దరి మధ్య కోర్టులో కేసు నడుస్తోంది. శ్రావణ సంధ్యారాణి తండ్రి విశ్వేశ్వరరావు పోలీస్ శాఖలో హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేసి ఉద్యోగ విరమణ చేసిన తర్వాత మృతి చెందగా, తల్లి కూడా కొన్నాళ్ల క్రితం మృతిచెందారు. శ్రావణ సంధ్యారాణి ఒక కుమారుడిని హాస్టల్‌లో చేర్పించగా, మరొక కుమారుడు ఆమెతోనే ఉంటున్నాడు. ఇదిలావుండగా శ్రావణ సంధ్యారాణికి, ఆమె ఎదురింట్లో ఉంటున్న కార్పెంటర్ కండిపల్లి శ్రీనివాసరావు(36)కు కొద్దిరోజులుగా గొడవ జరుగుతోంది. బుధవారం మధ్యాహ్నం కూడా ఇద్దరి మధ్య ...మిగతా 8వ పేజీలో

15 నెలలు.. 8,54,913 ఈ-చలాన్‌లు

రూ.46.4 కోట్లు జరిమానా విధింపు

- 3,44,421 చలానాలు క్లియరెన్స్
- రూ.13.39 కోట్లు వసూలు
- విశాఖ పోలీసుల రికార్డు
- దుకాణాలు, రైతుబజార్ల వద్ద పార్కింగ్
- చేసిన వారికి ఈ-చలాన్‌లా జారీపై విమర్శలు



చలాన్లు తనిఖీ చేస్తున్న పోలీసులు

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

ట్రాఫిక్ ఈ-చలాన్‌ల జారీలో నగర పోలీసులు రికార్డు సృష్టించారు. గత 15 నెలల కాలంలో ఏకంగా 8,54,913 ఈ-చలాన్‌లు జారీచేసి, రూ.46.4 కోట్లు జరిమానా విధించారు. రాష్ట్రంలోని ఇతర నగరాలు, జిల్లాలతో పోల్చితే ఇదే అత్యధికం కావడం విశేషం.

నగరంలో దాదాపు 12 లక్షల వాహనాలు ఉన్నాయి. రోడ్లు ఇరుకుగా ఉండడంతో నిత్యం ట్రాఫిక్ జామ్ అవుతూ ఉంటుంది. రద్దీ వేళల్లో అయితే ప్రధాన జంక్షన్ల వద్ద గ్రీన్ సిగ్నల్ కోసం ఐదు నుంచి 15 నిమిషాలు వేచి ఉండాల్సి వస్తోంది. ఈ క్రమంలో కొందరు సిగ్నల్ జంపింగ్‌లకు పాల్పడడం, మరికొందరు నిర్లక్ష్యంగా వాహనాలను నడపడం వల్ల రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. ప్రతి రెండు రోజులకు సగటున ముగ్గురు ప్రాణాలు కోల్పోతున్నారు. రోడ్డు ప్రమాదాలకు అడ్డుకట్టపడాలంటే వాహనచోదకులంతా విధిగా ట్రాఫిక్ నిబంధనలతో పాటు రహదారి భద్రత చర్యలను పాటించేలా చూడాలని ప్రభుత్వం ఆదేశించింది. దీంతో ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించే వారికి ఈ-చలాన్‌లు జారీ చేయడం ప్రారంభించారు. గత పదేళ్లుగా ఈ-చలాన్‌ల జారీ జరుగుతోంది. అయితే పోలీసులు స్పెషల్‌డ్రైవ్ పేరుతో కొంతకాలంపాటు తనిఖీలు చేసి ఈ-చలాన్‌లు జారీచేసి తర్వాత మిన్నకుండిపోయేవారు. జారీచేసిన ఈ-చలాన్‌లను క్లియర్ చేయడంపై కూడా పెద్దగా శ్రద్ధపెట్టేవారు కాదు. దీంతో వాహన చోదకులు కూడా ఈ-చలాన్‌లను సీరియస్‌గా తీసుకునేవారుకాదు. గత ఏడాది జూలైలో సీపీగా శంఖబ్రతబాగ్చి బాధ్యతలు చేపట్టిన తర్వాత ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించే వారి పట్ల కఠినంగా వ్యవహరించాలని పోలీసులను ఆదేశించారు. నిబంధనలు ఉల్లంఘించే వారి ఫొటోను సెల్‌ఫోన్ ద్వారా తీయించి ప్రత్యేక యాప్‌లో అప్‌లోడ్ చేయించి, వాహన నంబర్ ఆధారంగా రవాణా శాఖ పోర్టల్‌లోని సమాచారం తీసుకుని యజమానికి ఈ-చలాన్ మెసేజ్ అందేలా చర్యలు తీసుకున్నారు. హెల్మెట్ ధరించని వారిని, ట్రిపుల్ రైడింగ్, మైనర్ డ్రైవింగ్ ...మిగతా 8వ పేజీలో

నేటి నుంచి షాపింగ్ ఫెస్టివల్

- ఏయూ ఇంజనీరింగ్ కళాశాల మైదానంలో నిర్వహణ



అధికారులకు సూచనలు చేస్తున్న కలెక్టర్

విశాఖపట్నం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): జీఎస్టీపై ప్రజలకు అవగాహన కల్పించి, ధరలు ఎంత మేరకు తగ్గాయో వివరించడానికి, ఆయా వస్తువులను తగ్గింపు రేట్లపై అందించడానికి గురువారం నుంచి ఈ నెల 19వ తేదీ వరకు ఏయూ ఇంజనీరింగ్ కళాశాల మైదానంలో 'ది గ్రేట్ వైజాగ్ షాపింగ్ ఫెస్టివల్'ను నిర్వహిస్తున్నట్టు కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిరప్రసాద్ తెలిపారు. ఏయూ మైదానంలో షాపింగ్ ఫెస్టివల్ ఏర్పాట్లను ఆయన బుధవారం సాయంత్రం పరిశీలించారు. సుమారు 60 షాపులు ఏర్పాటు చేస్తున్నారని, ఉదయం 10 నుంచి రాత్రి 10 గంటల వరకు ఫెస్టివల్ జరుగుతుందన్నారు. జీఎస్టీ తగ్గిన నేపథ్యంలో తక్కువ ధరకు వస్తువులు లభిస్తాయన్నారు. జీఎస్టీ అవగాహన శిబిరం ఏర్పాటుపై అధికారులతో ఆయన చర్చించారు. స్టేట్ జీఎస్టీ అదనపు కమిషనర్ ఎస్.శేఖర్, టూరిజం అధికారిణి ...మిగతా 8వ పేజీలో

నేడు ఆస్ట్రేలియా, బంగ్లాదేశ్ మ్యాచ్

విశాఖపట్నం, స్పోర్ట్స్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి):

మహిళల వన్డే ప్రపంచ కప్ టోర్నీలో గురువారం ఏసీఏ-వీడీసీఏ స్టేడియంలో ఆస్ట్రేలియా, బంగ్లాదేశ్ జట్లు తలపడనున్నాయి. ఈ టోర్నీలో వరుస విజయాలతో దూసుకువెళుతున్న ఆస్ట్రేలియా...ఇక్కడి పిచ్‌పై భారత్‌ను కూడా ఓడించి మంచి ఊపు మీద ఉంది. ఇక ఇప్పటివరకూ ఆడిన నాలుగు మ్యాచ్‌లలో మూడింట్లో ఓటమి పాలైన బంగ్లాదేశ్‌కు ఈ మ్యాచ్ కీలకంగా మారింది. ఆల్‌రౌండర్లతో పటిష్ఠంగా ఉన్న ఆస్ట్రేలియా దూకుడును నిలువరించాలంటే..బంగ్లాదేశ్ అన్ని రంగాల్లో రాణించాల్సి ఉంది. ఆస్ట్రేలియాలో కెప్టెన్ హిల్లీ, పెర్రీ, మూనీ, గార్డనర్, లిచ్ ఫీల్డ్, బంగ్లాదేశ్‌లో షర్మిన్ అక్తర్, షోర్నా అక్తర్, ఫర్గాన హక్, నిగర్ సుల్తానా మంచి ఫామ్‌లో ఉన్నారు.

ఆర్టీసీ స్టీల్ సిటీ డిపోపై పంచాయితీ

లీజు గడువు ముగిసినందున స్థలాన్ని ఖాళీ చేయాల్సిందిగా స్టీల్‌ప్లాంటు యాజమాన్యం నోటీసులు

- అక్కడే కొనసాగాలనుకుంటే వడ్డీ లేని సెక్యూరిటీ డిపాజిట్‌గా రూ.133.39 కోట్లు, సేవా చార్జీలుగా మరో రూ.5.03 కోట్లు చెల్లించాలని డిమాండ్
- కుదరదన్న ఆర్టీసీ ఉన్నతాధికారులు



స్టీల్‌సిటీ డిపో (ఫైల్ ఫొటో)

ద్వారకా బస్‌స్టేషన్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి):

లీజు గడువు పూర్తయినందున తమ స్థలాన్ని ఖాళీ చేయాల్సిందిగా స్టీల్‌ప్లాంటు యాజమాన్యం కూర్మన్నపాలెం ప్రాంతంలో గల ఆర్టీసీ స్టీల్ సిటీ డిపో యాజమాన్యానికి నెలకొకమారు నోటీసు జారీచేస్తుంది. గడువు పొడిగించాలంటే ప్రస్తుతం ఉన్న భూమి విలువ ఆధారంగా లీజు చెల్లించాలని, వడ్డీ లేని సెక్యూరిటీ డిపాజిట్‌గా రూ.133.39 కోట్లు, సేవా చార్జీలుగా మరో రూ.5.03 కోట్లు చెల్లించాలని స్టీల్‌ప్లాంటు యాజమాన్యం డిమాండ్ చేస్తున్నది. ఇంతమొత్తంలో చెల్లించే స్థితిలో ఆర్టీసీ లేదని, 33 సంవత్సరాల క్రితం చేసుకున్న ఒప్పందాన్నే ఇప్పుడు మరో 33 సంవత్సరాలకు రెన్యువల్ చేయాలని ఆర్టీసీ ప్రధాన కార్యాలయం కోరుతున్నది. ఈ ప్రతిపాదనను స్టీల్‌ప్లాంటు యాజమాన్యం తోసిపుచ్చుతుంది.

సుమారు ఎనిమిది ఎకరాల స్థలంలో స్టీల్ సిటీ డిపో, గ్యారేజీ, డిపో అడ్మినిస్ట్రేషన్ కార్యాలయం నిర్మించి ఈ ప్రాంత ప్రజలకు రవాణా, లాజిస్టిక్స్ సేవలందిస్తున్నామని, ఇప్పుడు ఖాళీ చేయాలంటే జరిగే పనికాదని ఆర్టీసీ అధికారులు చెబుతున్నారు. ఇటీవల జరిగిన డీఆర్‌సీ సమావేశంలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఈ అంశంపై మాట్లాడుతూ స్టీల్‌సిటీ డిపోను అక్కడే కొనసాగించాలని కోరారు. ఈ మేరకు ఒక తీర్మానం చేసి రాష్ట్ర ప్రభుత్వానికి పంపారు. ఆర్టీసీ రీజనల్ మేనేజర్ బి.అప్పలనాయుడు ఇటీవల జిల్లా కలెక్టర్‌ను కలిసి స్టీల్ సిటీ విషయమై ప్లాంటు యాజమాన్యానికి లేఖ రాయాలని కోరారు. మరోవైపు స్టీల్ సిటీ డిపోను ఖాళీ చేయించే దిశగా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్‌ను స్టీల్ ప్లాంటు అధికారులు కోరినట్టు తెలుస్తుంది. దీంతో ఈ పంచాయితీ ఇప్పుడు కలెక్టర్ దగ్గర ఉంది.

స్టీల్ సిటీ డిపో ఖాళీ చేసేది లేదు

స్టీల్‌ప్లాంటు అవసరాల కోసం భూసేకరణ విభాగం ఇక్కడి రైతుల నుంచి అతి తక్కువ ధరకు భూమిని సేకరించింది. అందులోని ఎనిమిది ఎకరాల్లో ప్రభుత్వ ప్రజా రవాణా సంస్థ నడుస్తుంది. 84 బస్సులతో ఈ ప్రాంత ప్రయాణికులకు రవాణా సేవలు, కార్గో సేవలు అందిస్తోంది. ఇక్కడి ప్రజలకు రవాణా సౌకర్యాలు అందించే రాష్ట్ర ప్రభుత్వ సంస్థ ఆర్టీసీకి ఈ భూమిని ఉచితంగా ఇవ్వాలి. లేదా రైతుల నుంచి సేకరించిన ధరకు ఇవ్వాలి. అంతేగానీ స్టీల్‌సిటీ డిపోను ఖాళీ చేయించాలని యత్నిస్తే ఈ ప్రాంతం ప్రజలతో పాటు ఆర్టీసీ కార్మిక సంఘాలు ఉద్యమిస్తాయి.

\- వై.శ్రీనివాసరావు,
ఆర్టీసీ ఎన్ఎంయూఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

ఆర్డీవో సహా ముగ్గురికి కలెక్టర్ షోకాజ్

- ఏకలవ్య నగర్‌లో అంబేడ్కర్ విగ్రహం తొలగింపునకు యత్నం వ్యవహారం

విశాఖపట్నం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): పెందుర్తి మండలం ఏకలవ్య నగర్‌లో అంబేడ్కర్ విగ్రహం తొలగింపునకు యత్నం వ్యవహారంలో విశాఖ ఆర్డీవో పి.శ్రీలేఖ, పెందుర్తి తహశీల్దారు ఐ.వెంకటప్పారావు, మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ హరిప్రసూనకు జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిరప్రసాద్ షోకాజ్ నోటీస్ జారీచేశారు. విగ్రహం తొలగింపునకు సంబంధించి స్థల యజమాని సీహెచ్ శ్రీకృష్ణ వేసినకేసు హైకోర్టులో పెండింగ్‌లో ఉన్నప్పటికీ, అంబేడ్కర్ విగ్రహం తొలగింపునకు యత్నించిన అధికారులపై చర్యలు తీసుకోవాలని ప్రగతిశీల మహిళా సంఘం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కలెక్టర్ మంగళవారం నోటీస్‌లు జారీచేశారు. దీనిపై మూడు రోజుల్లో వివరణ ఇవ్వాలని నోటీస్‌లో పేర్కొన్నారు.

మరణంలోనూ వీడని బంధం

- భార్య మృతిని జీర్ణించుకోక తనువు చాలించిన భర్త



కల్లింపూడి దేముడమ్మ (ఫైల్)



తాతారావు (ఫైల్)

కంచరపాలెం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): భార్య మరణాన్ని తట్టుకోలేక భర్త కూడా తనువు చాలించిన ఘటన మంగళవారం నగరంలోని బర్మా క్యాంపు ప్రాంతంలో గల పల్నాటి కాలనీలో చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. పల్నాటి కాలనీలో కల్లింపూడి తాతారావు (70), ఆయన భార్య దేముడమ్మ (60), కుమారుడితో కలిసి నివాసం ఉంటున్నారు. దేముడమ్మకు పక్షవాతం రావడంతో కొంతకాలంగా మంచానికి పరిమితమై చికిత్స పొందుతున్నారు. ఈ నేపథ్యంలో మంగళవారం దేముడమ్మ మృతిచెందడంతో తాతారావు విలపిస్తూ అకస్మాత్తుగా కుప్పకూలిపోయారు. కుటుంబ సభ్యులు వెంటనే స్థానిక ఆసుపత్రికి తరలించారు. అప్పటికే తాతారావు మరణించారని వైద్యులు చెప్పారు.

జీఎస్టీ 2.0పై సైకత శిల్పం



జీఎస్టీ తగ్గింపుతో ప్రజలకు ఒనగూరే ప్రయోజనాలను వివరించేందుకు పర్యాటక శాఖ, జీఎస్టీ డిపార్టుమెంట్ ఆధ్వర్యంలో బుధవారం ఆర్కే బీచ్ రోడ్డులో ర్యాలీ నిర్వహించారు. జిల్లా జాయింట్ కలెక్టర్ కె.మయూర్‌అశోక్ ఈ ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్ఎస్ఆర్ కంపెనీ, సోమాని ఇస్పత్ సహకారంతో ఏయూ ఫైన్ ఆర్ట్స్ విద్యార్థులు రూపొందించిన సైకత శిల్పం ఆకట్టుకొంది.

నత్తనడకన ఇళ్ల నిర్మాణం

కొన్నిచోట్ల పూర్తిగా నిలిపివేత

- బిల్లులు మంజూరుకాకపోవడమే కారణం
- రెండు నెలలుగా పెండింగ్



అసంపూర్తిగా ఉన్న ఇల్లు

విశాఖపట్నం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి):

నగర శివారు ప్రాంతాల్లో చేపడుతున్న పేదల ఇళ్ల నిర్మాణాలకు సంబంధించి బిల్లులు సుమారు రెండు నెలలుగా మంజూరు కావడం లేదు. మెటీరియల్ సరఫరా కూడా తగ్గింది. దీంతో పనులు చాలావరకు నిలిచిపోగా, కొన్నిచోట్ల మందకొడిగా సాగుతున్నాయి.

పెందుర్తి, సబ్బవరం, ఆనందపురం, భీమునిపట్నం మండలాల్లోని 65 లేఅవుట్‌లలో సుమారు లక్ష ఇళ్లను నిర్మిస్తున్నారు. ఇప్పటివరకూ 30 వేల వరకూ పూర్తికాగా, మిగిలిన ఇళ్ల పనులు వివిధ దశల్లో ఉన్నాయి. పనులు అయిన మేరకు కాంట్రాక్టర్లు ఎప్పటికప్పుడు బిల్లులను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేస్తున్నారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద మంజూరైన ఇళ్లకు కేంద్రం ఎప్పటికప్పుడు నిధులు ఇస్తోంది. అయితే రాష్ట్రస్థాయిలో కొన్ని ఫిర్యాదులు...ప్రధానంగా నెల్లూరు జిల్లాలో ఇళ్ల నిర్మాణంపై ఆరోపణలు రావడంతో బిల్లుల మంజూరులో ప్రతిష్టంభన నెలకొంది. నెల్లూరు జిల్లాలో ఇళ్లు నిర్మిస్తున్న సంస్థలు కొన్ని విశాఖ జిల్లాలో పనులు చేస్తున్నాయి. అక్కడ మాదిరిగానే విశాఖలో అవకతవకలు జరిగాయన్న అనుమానంతో బిల్లులు మంజూరు నిలిపివేశారా?... అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. కాంట్రాక్టర్లకు సుమారు రూ.20 కోట్ల నుంచి రూ.25 కోట్లు రావలసి ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు.

జిల్లాలో సగం ఇళ్లు పెద్ద కాంట్రాక్టర్లు నిర్మిస్తుండగా, మిగిలినవారు చిన్నాచితకా కాంట్రాక్టర్లు. పెద్ద కాంట్రాక్టర్లకు ఆర్థికంగా ఇబ్బంది లేకపోయినా చిన్న కాంట్రాక్టర్లు మాత్రం బిల్లులు రాకపోవడంతో సతమతమవుతున్నారు. పలు రకాల మెటీరియల్, మిషనరీ సరఫరా చేసే ...మిగతా 8వ పేజీలో

అప్పన్నకు వైభవంగా తులసీ దళార్చన



సింహాచలం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహస్వామికి అర్జిత సేవల్లో భాగంగా సహస్ర నామ తులసీ దళార్చన బుధవారం వైభవంగా నిర్వహించారు. వేకువజామున సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపి ప్రభాతారాధనలు పూర్తిచేశారు. ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయ దేవేరులను స్వర్ణాభరణాలతో శోభాయమానంగా అలంకరించి వేదికపై ఉంచారు. భక్తుల గోత్రనామాలతో సంకల్పించి విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనములు చేసి షోడశోపచారాలు సమర్పించారు. అనంతరం నారసింహ అష్టోత్తర సహస్ర నామావళి పఠిస్తూ తులసీ దళాలతో పూజలు చేశారు. తరువాత అదే వేదికపై నిత్య కల్యాణం జరిపారు.

రేపటి నుంచి క్రీడా పోటీలు

భీమునిపట్నం (రూరల్), అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల విద్యార్థులకు ఈనెల 17, 18 తేదీల్లో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో మండల స్థాయి పోటీలు నిర్వహించనున్నట్టు వ్యాయామ ఉపాధ్యాయులు తెలిపారు. బుధవారం రెండో వార్డులోని ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం డి. ఆదినారాయణ అధ్యక్షతన వ్యాయామ ఉపాధ్యాయుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మండల క్రీడా సమన్వయకర్త వి.అచ్చుతరావు మాట్లాడుతూ అండర్ 17, అండర్ 14 విభాగాల్లో పోటీలు జరుగుతాయన్నారు. 17న బాలికలకు వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, బాడ్మింటన్, చెస్, యోగా పోటీలు ఉంటాయన్నారు. బాలురకు 18న వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, బ్యాడ్మింటన్, చెస్, యోగా, అథ్లెటిక్స్ పోటీలు జరుగుతాయని తెలిపారు.

ఆనందపురం : ఆనందపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈనెల 17 నుంచి 24వ తేదీ వరకు వివిధ స్థాయిల్లో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) క్రీడా పోటీలు నిర్వహించనున్నట్టు పాఠశాల హెచ్‌ఎం కామేశ్వరరావు తెలిపారు. బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. మండల స్థాయి పోటీలు 17, 18 తేదీల్లో, ఐదు మండలాల డివిజన్ స్థాయి పోటీలు 21 నుంచి 23వ తేదీ వరకు జరుగుతాయన్నారు.

అనిట్స్‌లో ప్రపంచ విద్యార్థి దినోత్సవం

తగరపువలస, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : సంగివలస అనిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో ప్రపంచ విద్యార్థి దినోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆంగ్ల విభాగం ఆధ్వర్యంలో మొదటి ఏడాది విద్యార్థులకు ప్రాజెక్టు ఎక్స్‌పో పేరుతో పలు పోటీలు నిర్వహించారు. పోటీల్లో ప్రతిభ చూపిన వారికి కళాశాల ప్రిన్సిపాల్ డా. వి. రాజ్యలక్ష్మి బహుమతులు అందించారు. కార్యక్రమంలో ఆంగ్ల విభాగం అధిపతి డా. సత్యఫణికుమారి, తదితరులు పాల్గొన్నారు.

చేతులు పరిశుభ్రతపై అవగాహన

తగరపువలస, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : చిట్టివలస జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులకు మ్యాజిక్ బస్ సంస్థ ఆధ్వర్యంలో చేతులు పరిశుభ్రతపై బుధవారం అవగాహన కల్పించారు. గ్లోబల్ హ్యాండ్ వాష్ దినోత్సవం సందర్భంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా ఆ సంస్థ సమన్వయకర్త దూడ రమేశ్ మాట్లాడుతూ ఏదైనా తినే ముందు సబ్బుతో చేతులను శుభ్రం చేసుకోవాలని సూచించారు. అనంతరం పాఠశాలకు హ్యాండ్ వాష్ లిక్విడ్, మెడిమిక్స్ సబ్బులు పంపిణీ చేశారు. వెల్లంకి గ్రామంలో కూడా సంస్థ నిర్వాహకులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

యోగా విజేతలకు అభినందనలు



విద్యార్థినులను అభినందిస్తున్న మాజీ ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

భీమునిపట్నం (రూరల్), అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : బెంగళూరులోని స్వామి వివేకానంద యోగా కేంద్రంలో జరిగిన సౌత్ జోన్ ఇంటర్ యూనివర్సిటీ బాలికల యోగా పోటీల్లో అవంతి ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థిని జె. తేజస్విని ప్రతిభ చూపింది. ఈమేరకు బుధవారం కళాశాలలో జరిగిన కార్యక్రమంలో కళాశాల ఛైర్మన్, మాజీ ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు ఆమెను అభినందించారు. అలాగే కర్ణాటకలోని బెల్లవిరాణి చిన్నమ్మ యూనివర్సిటీలో జరిగిన అంతర్ కళాశాలల కబడ్డీ పోటీల్లో గెలుపొందిన ప్రసాద్‌ను కూడా ముత్తంశెట్టి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలన్నారు.

నిత్యాన్న ప్రసాద పథకానికి రూ. లక్ష విరాళం

సింహాచలం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహ స్వామి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిత్యాన్న ప్రసాద పథకానికి నగరంలోని కేఆర్ఎం కాలనీవాసి బి. మాధవరావు దంపతులు రూ.లక్ష విరాళంగా సమర్పించారు.విరాళం మొత్తాన్ని నగదు రూపంలో దేవస్థానం డిప్యూటీ ఈఓ సింగం రాధ, పర్యవేక్షణాధికారి పి.సునీల్‌కు బుధవారం వారు అందజేశారు.దాత కుటుంబ సభ్యులకు అధికారులు అంతరాలయంలో స్వామివారి దర్శనం కల్పించారు.

గీతంలో అనాటమీ దినోత్సవం

ఎండాడ, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : ప్రపంచ అనాటమీ దినోత్సవం పురస్కరించుకుని గీతం ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ అండ్ రీసెర్చ్ (జిమ్‌సర్) అనాటమీ విభాగం ఆధ్వర్యంలో బాడీ వండర్స్ పేరుతో బుధవారం అనాటమీ ప్రదర్శన నిర్వహించారు. జిమ్‌సర్ వైద్య కళాశాలలోని అనాటమీ మ్యూజియంను పాఠశాలల విద్యార్థులను అనుమతించారు. ప్రదర్శనలో మానవ అవయవ నమూనాలు, త్రీడీ మోడల్స్, శరీర వ్యవస్థలను ఆరు స్టేషన్లగా విభజించి ప్రదర్శించారు. నగరంలో పలు పాఠశాలలకు చెందిన 500 మంది విద్యార్థులు ప్రదర్శనను తిలకించారు. కార్యక్రమంలో జిమ్‌సర్ ప్రో వీసీ గీతాంజలి, డీన్ రావు, అనాటమీ విభాగాధిపతి డాక్టర్ ఎంపీ పద్మినీ, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ రమణారావు, తదితరులు పాల్గొన్నారు.

అప్పన్న భక్తుడి నిజాయతీ

సింహాచలం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : అప్పన్న దర్శనానికి వచ్చిన ఓ భక్తుడు స్వర్ణాభరణాన్ని పోగొట్టుకోగా మరో భక్తుడు ఆ వస్తువును బాధితుడికి అప్పగించి తన నిజాయతీ చాటుకున్నాడు. దేవస్థానం ఏఈఓ సంగం రాధ తెలిపిన వివరాలు ప్రకారం.. ఈనెల 11న సాయంత్రం గాజువాక ప్రాంతానికి చెందిన బండి వరహాలరాజు సతీసమేతంగా అప్పన్న దర్శనానికి వచ్చారు. ఆ సమయంలో తన చేతికి ఉన్న రెండు తులాల బ్రేస్‌లెట్‌ను పోగొట్టుకున్నాడు. ఈ విషయాన్ని దేవాలయ సిసి కెమెరాల విభాగంలో ఫిర్యాదు చేయగా అదే రోజు రాత్రి 8 గంటల సమయంలో జి.తిరుపతిరావు, పి.రాజు తమకు బ్రేస్‌లెట్ దొరికిందని తెచ్చి కార్యాలయంలో అప్పగించారు. ఆ ఆభరణాన్ని ఏఈఓ రాధ బాధితుడికి బుధవారం అందజేశారు.

నత్తనడకన ఇళ్ల నిర్మాణం

... 7వ పేజీ తరువాయి

చిన్నపాటి వ్యాపారుల నుంచి ఒత్తిడి పెరిగింది. ఇటీవల జిల్లా హౌసింగ్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో కాంట్రాక్టర్లు ఇదే విషయాన్ని ప్రస్తావించారు. బిల్లులు మంజూరుకాకపోతే పనులు చేపట్టలేమని స్పష్టంచేశారు. ఇసుక సరఫరా ఇప్పటికే నిలిచిపోయిందని, సిమెంట్, ఇనుము కూడా రావడం లేదని కొందరు కాంట్రాక్టర్లు ప్రస్తావించారు. కాంట్రాక్టర్ల వాదనతో ఏకీభవించిన అధికారులు..బిల్లుల విషయం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళతామని హామీ ఇచ్చారు.



పద్మనాభం నుంచి బైక్‌లపై ర్యాలీగా వెళ్తున్న నాయకులు, కార్యకర్తలు

ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న టీడీపీ యువ నాయకుడు రవితేజ, తదితరులు



గూగుల్‌తో అభివృద్ధి పరుగులు

- టీడీపీ యువ నాయకుడు రవితేజ
- డేటా సెంటర్ భూముల వరకు పార్టీ శ్రేణుల బైక్ ర్యాలీ

ఆనందపురం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : గూగుల్ డేటా సెంటర్ ఏర్పాటుతో విశాఖలో అభివృద్ధి పరుగులు పెడుతుందని టీడీపీ యువ నాయకుడు గంటా రవితేజ అన్నారు. బుధవారం ఆనందపురం జంక్షన్ నుంచి గూగుల్ డేటా సెంటర్ ఏర్పాటు చేయనున్న తర్లువాడ వరకు పార్టీ శ్రేణులు బైక్ ర్యాలీ నిర్వహించాయి. ఈ సందర్భంగా తర్లువాడలో ఏర్పాటు చేసిన సభలో రవితేజ మాట్లాడుతూ గూగుల్ డేటా సెంటర్ భవిష్యత్తులో 1.88 లక్షల మంది యువతకు ఉపాధి కలిగిస్తుందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఇమేజ్ వల్లే రాష్ట్రానికి గూగుల్ ప్రాజెక్టు వచ్చిందని చెప్పారు. తొలుత ఆనందపురం జంక్షన్‌లో ఎన్టీఆర్ విగ్రహానికి రవితేజ పూలమాల వేసి బైక్ ర్యాలీని ప్రారంభించారు. ఆనందపురం, భీమిలి, పద్మనాభం మండలాలతో పాటు ఒకటి నుంచి ఎనిమిది, 98 వార్డుల నుంచి నాయకులు, కార్యకర్తలు తరలివచ్చారు. ఆనందపురం డిల్లీ పబ్లిక్ స్కూల్ నుంచి ప్రారంభమైన ర్యాలీ పాలవలస, పందలపాక మీదుగా తర్లువాడ వరకు సాగింది. అక్కడ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ప్రధాని మోదీ, ఐటీ శాఖా మంత్రి నారా లోకేశ్, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు చిత్రపటాలకు నాయకులు పాలాభిషేకం చేశారు. థాంక్యూ సీఎం సార్ అంటూ ప్లకార్డులు ప్రదర్శించి, నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆనందపురం టీడీపీ అధ్యక్షుడు తాట్రాజు అప్పారావు, తర్లువాడ సర్పంచ్ నాయుడు, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు, జడ్పీటీసీ సభ్యుడు గాడు వెంకటప్పడు, కార్పొరేటర్లు గాడు చిన్నికుమారి లక్ష్మి, నరసింహం, మొల్లి హేమలత, లొడగల అప్పారావు, కూటమి నాయకులు చిక్కాల విజయ్‌బాబు, కురిమిన లీలావతి, మామిడి దుర్గారావు, నాగోతి సూర్యప్రకాశ్, తదితరులు పాల్గొన్నారు.

సింహాచలంలో..

సింహాచలం : ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఐటీ మంత్రి లోకేశ్ కృషి ఫలితంగా విశాఖ ఐటీ హబ్‌గా మారబోతోందని 98వ వార్డు కార్పొరేటర్ పిసిని వరాహ నరసింహం అన్నారు. ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు పిలుపుమేరకు టీడీపీ వార్డు అధ్యక్షుడు పంచదార్ల శ్రీనివాస్ సారథ్యంలో నాయకులు, కార్యకర్తలు బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎంకే గోపాల్, పట్నాల ధర్మరాజు, సిరిపురపు సురేశ్, గంధ్రెడ్డి వెంకటరమణ, బూర్లె కనకారావు, నాగరాజు, గుసిడి శంకరరావు, లండ శ్రీను, సగ్గు బాబాలు, లండ విజయ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

పద్మనాభంలో..

పద్మనాభం : మండల టీడీపీ శ్రేణులు బైక్ ర్యాలీ నిర్వహించారు. తొలుత పద్మనాభం జంక్షన్‌కు చేరుకున్న నాయకులు, కార్యకర్తలు బైక్‌లపై ర్యాలీగా గూగుల్ డేటా సెంటర్ ఏర్పాటు చేయనున్న తర్లువాడకు తరలివెళ్లారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు కె. రమణ, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కె. దామోదరరావు, టీడీపీ మాజీ మండల అధ్యక్షుడు కె. నగేశ్‌కుమార్, నందీశ్వరరావు, గెద్ద ప్రసాద్, గంగరాజు, అప్పలనాయుడు, రమణ, నందిని, మహేశ్, తదితరులు పాల్గొన్నారు.

కొమ్మాది : జీవీఎంసీ 6వ వార్డు నుంచి టీడీపీ యువ నాయకుడు గరే గురునాథ్ ఆధ్వర్యంలో, ఐదో వార్డు నుంచి కార్పొరేటర్ మొల్లి హేమలత ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు తర్లువాడ వెళ్లారు.

అప్పన్న హుండీ ఆదాయం రూ.2.82 కోట్లు

సింహాచలం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహ స్వామికి గత 44 రోజుల్లో భక్తులు హుండీల ద్వారా రూ.2.82 కోట్ల కట్న, కానుకలను సమర్పించారు. ఈఓ త్రినాథరావు సారథ్యంలో ఇన్‌స్పెక్టర్ శ్రీధర్ ప్రత్యేక పర్యవేక్షణలో సింహగిరిపై ఉన్న పరకామణి కేంద్రంలో బుధవారం హుండీల లెక్కింపు చేపట్టారు. నగదు రూపంలో రూ.2,82, 18,987 కోట్లు లభ్యం రాగా స్వర్ణం 79.1 గ్రాములు, రజితం 13.75 కిలోలు లభించాయి. అలాగే 205 యూఎస్ఏ డాలర్లు, 500 ఒమన్ పైసా, 33 యూ రోలు, 15 కెనడా డాలర్లు, 30 సింగపూర్ డాలర్లు, యూఏఈకి చెందిన 95 దీరమ్స్, 16 సౌదీ అరేబియా రియల్స్ 79 ఖతార్ రియాల్స్ 144 నేపాల్ రూపాయిలు, 23 మలేషియా రింగిట్స్, 10 కువాయిట్ దీనార్స్ శ్రీలంక, మయన్మార్, ఉగాండా, ఖజకిస్తాన్, ఆస్ట్రేలియా దేశాలకు చెం దిన కరెన్సీలు కూడా హుండీల ద్వారా స్వామి ఖజానాకు లభ్యమయ్యా యి. ఈ కార్యక్రమంలో దేవస్థానానికి చెందిన పలు విభాగాలకు చెందిన సహాయ ఈఓలు, పర్యవేక్షణాధికారులు, ఎస్‌వీఎల్ఎన్ వాకర్స్ క్లబ్ సభ్యులు, శ్రీహరి సేవా సంఘం కార్యకర్తలు పాల్గొన్నారు.



ఆదాయాన్ని లెక్కిస్తున్న అధికారులు, సేవా కార్యకర్తలు

ఘనంగా అబ్దుల్ కలామ్ జయంతి

భీమునిపట్నం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : భారత మాజీ రాష్ట్రపతి, ప్రముఖ శాస్త్రవేత్త ఏపీజే అబ్దుల్ కలామ్ జీవితం యువతకు స్ఫూర్తిదాయకమని డైట్ కళాశాల ప్రిన్సిపాల్ ఎల్. సుధాకర్ అన్నారు. బుధవారం ఆ కళాశాలలో జరిగిన కలామ్ జయంతి వేడుకల్లో ఆయన మాట్లాడారు. కలామ్ రచనలు యువతకు చక్కటి మార్గదర్శకత్వాన్ని అందిస్తాయన్నారు. అలాగే కలామ్ జయంతి పురస్కరించుకుని వరల్డ్ స్టూడెంట్స్ డే నిర్వహించారు. తొలుత కలామ్ చిత్రపటానికి పలువురు పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ నాగేశ్వరరావు, అధ్యాపకులు, ఛాత్రోపాధ్యాయులు పాల్గొన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో కూడా కలామ్ జయంతి నిర్వహించారు. కళాశాల ఆవరణలో ఉన్న అబ్దుల్ కలామ్ విగ్రహానికి టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు, ప్రిన్సిపాల్ రామ్ ప్రసాద్ పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పీఓలు సూరిబాబు, సాయికుమార్ పాల్గొన్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కలామ్ చిత్రపటానికి వైస్ ప్రిన్సిపాల్ విష్ణుమూర్తి ఆధ్వర్యంలో అధ్యాపకులు పూలమాల వేసి నివాళులు అర్పించారు.



కలామ్ విగ్రహానికి పూలమాల వేస్తున్న గంటా నూకరాజు

భీమునిపట్నం (రూరల్) : అవంతి ఇంజనీరింగ్ కళాశాలలో కలామ్ జయంతి ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఛైర్మన్ ముత్తంశెట్టి శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్ డా. మురళీకృష్ణ, డైరెక్టర్ చంద్రశేఖర్, ఎంబీఏ విభాగ అధిపతి రాము, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ షరీఫ్, తదితరులు పాల్గొన్నారు.

కొమ్మాది : విద్యార్థులు అనుకున్న లక్ష్య సాధన కోసం శ్రమించాలని టీడీపీ యువ నాయకుడు గంటా రవితేజ అన్నారు. బుధవారం ఆయన చంద్రంపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఉన్న కలామ్ విగ్రహానికి పూలమాల వేసి, నివాళి అర్పించారు.

హిందీ పరీక్షల్లో శత శాతం ఉత్తీర్ణత

భీమునిపట్నం,అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : దక్షిణ భారత హిందీ ప్రచార సభ చెన్నై వారు నిర్వహించిన హిందీ పరీక్షల్లో తమ విద్యార్థులు శతశాతం ఉత్తీర్ణత సాధించినట్టు ఆదర్శ హిందీ ప్రేమి మండలి వ్యవస్థాపక అధ్యక్షుడు కేఎస్ఆర్ కృష్ణారావు తెలిపారు. బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. గత 13, 14వ తేదీల్లో పట్టణంలోని జీవీఎంసీ పండిట్ నెహ్రూ ఉన్నత పాఠశాలలో ఈ పరీక్షలు జరిగాయన్నారు.

సామూహిక సీమంతాలు

భీమునిపట్నం,అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని తోటవీధి కల్యాణ మండపంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో బుధవారం రాష్ట్రీయ పోషణ మాసోత్సవాలు జరిగాయి. ఈ సందర్భంగా కలిగొట్ల స్నిగ్ధశ్రీదేవి ఫౌండేషన్ ఛైర్మన్ కలిగొట్ల శ్రీరామచంద్రమూర్తి ఆర్థిక సహకారంతో పదకొండు మంది గర్భిణిలకు సామూహిక సీమంతాలు నిర్వహించారు. కార్యక్రమంలో సీడీపీఓ శ్రీదేవి, ఎంఈవో శివరాణి, ఏపీఎం వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

రగ్బీ పోటీల విజేత గురుజనాపల్లి

భీమునిపట్నం,అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : అస్మిత రగ్బీ లీగ్ పోటీల్లో తూర్పు గోదావరి జిల్లా గురుజనాపల్లి జట్టు ప్రథమ స్థానంలో నిలిచింది. పట్టణంలోని జీవీఎంసీ మినీ స్టేడియంలో ఖేల్ ఇండియా అస్మిత ఉమెన్స్ రాష్ట్ర స్థాయి రగ్బీ పోటీలను ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు మంగళవారం ప్రారంభించిన విషయం తెలిసిందే. పోటీల్లో 12 జట్లు పాల్గొన్నాయని నిర్వాహకులు తెలిపారు. ద్వితీయ స్థానాన్ని గుంటూరు జట్టు, తృతీయ స్థానాన్ని చంద్రంపాలెం (మధురవాడ) జట్టు గెలుపొందాయి.విజేతలకు కార్పొరేటర్ చిన్నికుమారిలక్ష్మి, ప్రకృతి స్కూల్ కరస్పాండెంట్ శ్రీనివాస్, టీడీపీ నాయకుడు గాడు అప్పలనాయుడు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో రగ్బీ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామాంజనేయులు, విశాఖ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు లలిత్‌కుమార్, కిశోర్, నల్లా శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

సూపర్ జీఎస్టీపై అవగాహన ర్యాలీ



ర్యాలీలో పాల్గొన్న అధికారులు, విద్యార్థులు

భీమునిపట్నం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల, వాణిజ్య పన్ను శాఖ సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం సూపర్ జీఎస్టీ,సూపర్ సేవింగ్స్ కార్యక్రమంపై ర్యాలీ నిర్వ హించారు. తొలుత విద్యార్థులు పాత బస్టాండ్ నుంచి పైలాన్, డచ్ సమాధులు, లైట్ హౌస్ మీదుగా బీచ్ రోడ్డు వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం బీచ్‌లో పలు విన్యాసాలు ప్రదర్శించారు. అలాగే బీచ్‌లో విద్యార్థులు తయారు చేసిన జీఎస్టీ 2.0 సైకత శిల్పం విశేషంగా ఆకట్టుకుంది. కార్యక్రమంలో కమర్షియల్ ట్యాక్స్ డిపార్టుమెంట్ డెప్యూటీ అసిస్టెంట్ కమిషనర్ ఉమాశంకర్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సురేఖ, టూరిజం డిపార్టుమెంట్ జీఎస్టీ ప్రోగ్రామ్ నోడల్ ఆఫీసరు అశోక్, డిగ్రీ కళాశాల జీఎస్టీ ప్రోగ్రామ్ కన్వీనరు బి. సహదేవుడు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్లు ఎస్. అప్పలనాయుడు, ఎస్. శ్రీను పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ కూచిపూడి దినోత్సవం

సాగర్‌నగర్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) :పద్మభూషణ్ స్వర్గీయ వెంపటి చిన సత్యం జయంతి పురస్క రించుకుని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలోని హ్యూమానిటీస్, సోషల్ సైన్సెస్ విభాగం ఆధ్వర్యంలో బుధవారం ప్రపంచ కూచిపూడి దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా గీతం ఫైన్ అండ్ పెర్ఫార్మింగ్ ఆర్ట్స్ విభాగానికి చెందిన 50 మంది విద్యార్థులు నృత్య ప్రదర్శనలతో ఆకట్టుకున్నారు. అనంతరం విభాగం కోఆర్డినేటర్ డాక్టర్ కె. మాల్యాద కూచిపూడి నాట్యానికి ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు తెచ్చిన వెంపటి చిన సత్యం జీవిత చరిత్రను వివరించారు.

హాకర్స్ జోన్ ఏర్పాటుకు చర్యలు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



వుడాకాలనీలో స్థలాన్ని పరిశీలిస్తున్న జడ్సీ కనకమహాలక్ష్మి

మధురవాడ, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) :జీవీఎంసీ జోన్-2 పరిధిలోని చిరు వ్యాపారుల ఉపాధి నిమిత్తం హాకర్స్ జోన్ ఏర్పాటుకు అధికారులు చర్యలు చేపట్టారు. స్థానికంగా హాకర్స్ జోన్లు లేకపోవడంతో వ్యాపారులు పడుతున్న ఇబ్బందుల గురించి 'ఆంధ్రజ్యోతి'లో బుధవారం కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. ఈమేరకు జడ్సీ కనక మహాలక్ష్మి, డిప్యూటీ సిటీ ప్లానర్ హరిదాసు మధురవాడ, మిథిలాపురి వుడాకాలనీ, ఎండాడ, స్వతంత్రనగర్ కాలనీ, ఆరిలోవలో పర్యటించి జోన్ల ఏర్పాటుకు స్థలాలను పరిశీలించారు. వీటిలో నిర్మాణాలు చేపట్టి ఆపరేషన్ లంగ్స్‌లో భాగంగా దుకాణాలను తొలగించిన బడ్డీల యజమానులకు ప్రాధాన్యత క్రమంలో వసతి కల్పించనున్నారు. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

గోస్తనీ నదిలో పడి వ్యక్తి గల్లంతు

తగరపువలస, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : తగరపువలస సమీపంలోని గోస్తనీ నదిలో పడి ఓ వ్యక్తి గల్లంతయ్యాడు. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. రెండు రోజుల క్రితం పీసా త్రిమూర్తులు అనే వ్యక్తి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. అతని దహన సంస్కరణలు నిమిత్తం వెళ్లిన తమ్మిన శ్రీను (40) నదిలో దిగి స్నానం చేస్తుండగా గల్లంతయ్యాడు. మంగళవారం సాయంత్రం ఈ సంఘటన జరిగింది. అప్పటి నుంచి పోలీసులు నదిలో గాలింపు జరుపుతున్నారు. ఇప్పటివరకు ఆచూకీ లభించలేదు. శ్రీను తగరపువలస మెయిన్ రోడ్డులో ఉన్న ఎలక్ట్రికల్ దుకాణంలో ప్లంబర్‌గా పనిచేస్తున్నాడు. బాలాజీనగర్‌లో ఉంటున్న అతనికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. భీమిలి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నేటి నుంచి అనంతుని పవిత్రోత్సవాలు

పద్మనాభం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : పద్మనాభంలోని అనంత పద్మనాభుని పవిత్రోత్సవాలు గురువారం నుంచి జరగనున్నాయి. ఉత్సవ కమిటీ సహకారంతో దేవస్థానం అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. స్థానిక కుంతీమాధవ స్వామి ఆలయం ఆవరణలో 19వ తేదీ వరకు ఈ ఉత్సవాలు నిర్వహిస్తారు.

ప్రభుత్వ భూ కేటాయింపు విధానాన్ని సవాల్ చేస్తాం

'సత్వ' పిల్ సవరణకు అనుమతి కోరిన పిటిషనర్

అమరావతి, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : విశాఖలో సత్వ డెవలపర్స్‌కు భూ కేటాయింపును సవాల్ చేస్తూ దాఖలైన ప్రజాప్రయోజన వ్యాజ్యం(పిల్)పై బుధవారం హైకోర్టు విచారణ జరిపింది. పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది పొన్నవోలు సుధాకర్‌రెడ్డి స్పందిస్తూ.. భూకేటాయింపు కోసం ప్రభుత్వం తీసుకొచ్చిన పాలసీని సవాల్ చేస్తూ పిల్‌ను సవరించేందుకు అనుమతించాలని కోరారు. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ చీమలపాటి రవితో కూడిన ధర్మాసనం అందుకు అంగీకరించి.. విచారణను రెండు వారాలకు వాయిదా వేసింది. మధురవాడ ఐటీ హిల్ నంబర్ 4 వద్ద 30 ఎకరాలను సత్వ డెవలపర్స్ ప్రైవేట్ లిమిటెడ్‌కు కేటాయిస్తూ.. రాష్ట్ర ఐటీ-ఎలక్ట్రానిక్స్- కమ్యూనికేషన్ల శాఖ ఈఏడాది ఆగస్టు 1న జారీ చేసిన జీవో 27ని సవాల్ చేస్తూ విశాఖకు చెందిన మేడపాటి వెంకటరెడ్డి పిల్ దాఖలు చేశారు. వివిధ సంస్థలకు చేసే భూకేటాయింపునకు టెండర్/ఆక్షన్ విధానాన్ని అనుసరించేలా ప్రభుత్వానికి మార్గదర్శకాలు జారీ చేయాలని.. 2023లో ఏపీఐఐసీ తీసుకొచ్చిన నిబంధనలను అనుసరించి లీజు విధానంలో ఏపీఐఐసీ, ఎస్ఐపీబీ ద్వారా భూకేటాయింపులు జరిపేలా ఆదేశాలివ్వాలని కోరారు. సంబంధిత జీవోను రద్దు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ పిల్ బుధవారం విచారణకు రాగా ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది (ఎస్‌జీపీ) ఎస్.ప్రణతి వాదనలు వినిపిస్తూ... వివిధ కంపెనీలు/సంస్థలకు భూకేటాయింపులను సవాల్ చేస్తూ ఇప్పటికే ప్రజాహిత వ్యాజ్యాలు దాఖలయ్యాయని కోర్టు దృష్టికితీసుకొచ్చారు. ధర్మాసనం స్పందిస్తూ... భూకేటాయింపుల కారణంగా పెద్ద సంస్థలు పెట్టుబడులు పెట్టేందుకు ముందుకొస్తున్నాయి కదా! అని ప్రశ్నించింది. పొన్నవోలు బదులిస్తూ.. అభివృద్ధికి తాము వ్యతిరేకం కాదని, భూకేటాయింపులు జరుగుతున్న విధానాన్ని మాత్రమే వ్యతిరేకిస్తున్నామన్నారు.

నేటి నుంచి షాపింగ్ ఫెస్టివల్

... 7వ పేజీ తరువాయి

జె.మాధవి, జీవీఎంసీ, రెవెన్యూ, పోలీస్, సీఐఐ అధికారులు పాల్గొన్నారు.

నవంబరు 14, 15 తేదీల్లో భాగస్వామ్య సదస్సు

ఏయూ ఇంజనీరింగ్ కళాశాల మైదానంలో నవంబరు 14, 15 తేదీల్లో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా భాగస్వామ్య సదస్సు (పార్టనర్‌షిప్ సమ్మిట్) నిర్వహించనున్నట్టు కలెక్టర్ హరేంధిర ప్రసాద్ తెలిపారు. సమ్మిట్ జరగనున్న మైదానంలో ఏర్పాట్లను బుధవారం సాయంత్రం ఆయన పరిశీలించారు. కేంద్ర, రాష్ట్ర మంత్రులు వచ్చే మార్గాలను, ప్రతినిధులు, ప్రముఖుల వాహనాల పార్కింగ్, ట్రాఫిక్ నియంత్రణ ఏర్పాట్లపై అధికారులకు కీలక సూచనలు చేశారు.

దుకాణం తెరిచారు!

... 7వ పేజీ తరువాయి

చూసి అక్కడ దుకాణాలు ఏర్పాటుచేయడానికి వీల్లేదంటూ స్పష్టంచేసి, తక్షణం తొలగించాలని ఆదేశించారు. దీంతో కూటమి ప్రజా ప్రతినిధి ఒకరు ఏయూ వీసీతో మాట్లాడి ఇంజనీరింగ్ కళాశాల మైదానానికి ఎదురుగా ఉన్న కొత్తమైదానంలో దుకాణాలు ఏర్పాటుకు అనుమతి ఇవ్వాలని కోరడంతో బుధవారం సాయంత్రం అంగీకరించినట్టు తెలిసింది. దీంతో అక్కడ దుకాణాల ఏర్పాటుపనులు ప్రారంభించారు. ఈ విషయం పోలీస్, అగ్నిమాపక శాఖ అధికారుల వద్ద ప్రస్తావించగా తమకు దుకాణాల ఏర్పాటుకు సంబంధించి ఇప్పటివరకూ ఎలాంటి దరఖాస్తులు రాలేదని సమాధానం ఇచ్చారు. పోలీస్ అధికారుల సూచనల మేరకు సమీప ప్రాంతాల్లో ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా దుకాణాలు ఏర్పాటు చేయాల్సి ఉంటుందని అగ్నిమాపక శాఖ అధికారులు చెబుతున్నారు. అలాకాకుండా దుకాణాలు ఏర్పాటుచేసిన తర్వాత తాము వెళ్లినా ఉపయోగం ఉండదని పేర్కొంటున్నారు.

ఒక్కో దుకాణం రూ.1.2 లక్షలకు విక్రయం

బాణసంచా వ్యాపారం చేయాలనుకునేవారే దుకాణం ఏర్పాటుకోసం దరఖాస్తు చేసుకోవాలి. కానీ నగరానికి చెందిన కూటమి ప్రజా ప్రతినిధి అనుచరులు ఇద్దరు మైదానం నుంచి దుకాణాల ఏర్పాటు వరకూ జీవీఎంసీ, అగ్నిమాపక, పోలీస్ శాఖ, ఏపీఈపీడీసీఎల్ నుంచి అన్ని అనుమతులు తాము తెస్తామని హామీ ఇస్తున్నారు. అందుకు రూ.1.2 లక్షలు డిమాండ్ చేస్తున్నారు. అసోసియేషన్‌ను ముందుపెట్టి వారిద్దరే చక్రం తిప్పుతున్నారని వ్యాపారులే పేర్కొంటున్నారు. దుకాణం ఏర్పాటుకు రూ.30 వేలకు ఒకరికి కాంట్రాక్టు ఇచ్చారని, అనుమతుల కోసం మరో రూ.30 వేలు వరకు ఖర్చుపెట్టి, మిగిలిన రూ.60 వేలు తమ జేబులో వేసుకుంటారని ఆరోపిస్తున్నారు. బినామీ పేర్లతో బల్క్‌గా దరఖాస్తులు పెట్టి, అనుమతి వచ్చిన తర్వాత కావాల్సిన వారికి వాటిని విక్రయిస్తారని చెబుతున్నారు. దీనిపై కూటమి ప్రజా ప్రతినిధులు, అధికారులు లోతుగా దృష్టిసారించి దరఖాస్తు చేసుకున్న వ్యక్తే దుకాణం నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

నడిరోడ్డుపై వివాహిత హత్య



వివరాలు నమోదు చేస్తున్న పోలీసులు

... 7వ పేజీ తరువాయి

స్వల్ప వాగ్వాదం జరిగింది. సాయంత్రం 5.15 గంటల సమయంలో శ్రావణ సంధ్యారాణి వాకింగ్‌కు వెళ్లేందుకు ఇంటి నుంచి బయలుదేరింది. కొద్దిఅడుగుల దూరం వెళ్లేసరికి కొండమ్మ అనే మహిళ ఎదురుపడడంతో ఆమెతో మాట్లాడుతోంది. ఇంతలో వెనుక నుంచి వచ్చిన శ్రీనివాసరావు పదునైన ఆయుధంతో శ్రావణ సంధ్యారాణి మెడ కోసేశాడు. దీంతో ఆమె తీవ్రరక్తస్రావంతో అక్కడికక్కడే కుప్పకూలిపోయింది. సంధ్యారాణితో మాట్లాడుతున్న మహిళ గట్టిగా కేకలు పెట్టింది. స్థానికులు అక్కడకు వచ్చేసరికి శ్రీనివాసరావు పరారైపోయాడు. స్థానికులు డయల్ 100కి ఫోన్ చేసి సమాచారం ఇవ్వడంతో ఫోర్త్ టౌన్ సీఐ సీహెచ్ ఉమాకాంత్ అక్కడకు చేరుకుని 108కి ఫోన్ చేశారు. 108 సిబ్బంది వచ్చి పరిశీలించగా ఆమె అప్పటికే మృతిచెందినట్టు నిర్ధారించారు. క్లూస్‌టీమ్‌ను రప్పించి ఘటనాస్థలంలో ఆధారాలు సేకరించారు. అనంతరం మృతదేహాన్ని కేజీహెచ్‌కు తరలించారు. నిందితుడు శ్రీనివాసరావును అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. సంధ్యారాణికి సోదరుడు ఉన్నప్పటికీ అతను అనారోగ్యంతో బాధపడుతున్నట్టు తెలిసింది. తమ అనేవారు ఎవరూ లేకపోవడంతో బుద్ధిమాంద్యం కలిగిన ఇద్దరు కవలల పరిస్థితి ఏమిటనేది అగమ్యగోచరంగా మారింది. వారిని తండ్రి వద్దకు చేర్చేలా పోలీసులు చొరవ తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

15 నెలలు 8,54,913 ఈ-చలాన్‌లు

... 7వ పేజీ తరువాయి

డ్రంకన్ డ్రైవ్, డేంజరస్ డ్రైవింగ్, రాంగ్‌రూట్‌లో ప్రయాణించే వారి ఫొటోలు తీసి ఈ-చలాన్ జారీచేయడం ప్రారంభించారు. అంతటితో సరిపెట్టేయకుండా, వాటిని క్లియర్ చేయించేందుకు ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ల వారీగా టార్గెట్‌లు విధించారు. దీంతో ఈ-చలాన్‌ల సంఖ్యతోపాటు, జారీచేసిన ఈ-చలాన్‌లలో క్లియర్ అయిన వాటి సంఖ్య కూడా పెరిగింది. నగరంలో గత ఏడాది జూలైలో 79,131 ఈ-చలాన్‌లు జారీచేస్తే వాటిలో 36,453 చలాన్‌లను కట్టించారు. ఆగస్టులో 79,436 ఈ-చలాన్‌లు జారీచేసి 37,298, సెప్టెంబరులో 82,646 ఈ-చలాన్‌లు జారీచేసి 39,840, అక్టోబరులో 92,002 జారీచేసి 43,788, నవంబరులో 86,633 జారీచేసి 40,869 క్లియర్ చేయించారు. ఈ ఏడాది సెప్టెంబరు వరకు 15 నెలల్లో 8,54,913 ఈ-చలాన్‌లు ద్వారా రూ.46,40,32,101 జరిమానా విధించారు. అందులో 3,44,421 ఈ-చలాన్‌లను క్లియర్ చేసి వాహన యజమానుల నుంచి రూ.13,39,73,796 వసూలు చేశారు. ఇది రాష్ట్రంలోనే అత్యధికం కావడం విశేషం.

వాహనాలకు జరిమానాపై విమర్శలు

నిబంధనలు ఉల్లంఘించిన వారికి ఈ-చలాన్‌ల జారీచేయడంపై ఎలాంటి అభ్యంతరాలు లేనప్పటికీ దుకాణాలు ముందు, రైతుబజార్‌ల వద్ద పార్కింగ్ చేసిన వాహనాలకు 'డేంజరస్ పార్కింగ్' పేరుతో ఈ-చలాన్‌లు జారీచేయడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. రోడ్డుపక్కనే దుకాణాలు ఏర్పాటుచేసినా పట్టించుకోని పోలీసులు వాటికి వెనుక వైపు నిలిపే వాహనాలను ఫొటోలు తీసి ఈ-చలాన్‌లు పంపుతున్నారంటూ వాహనదారులు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. దుకాణాలు ఉండే ప్రాంతాల్లో పార్కింగ్ సదుపాయం కల్పించకుండా, అక్కడ కొనుగోలు చేసేందుకు వచ్చేవారు వాహనాలను నిలిపితే జరిమానాలు విధించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నిస్తున్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని యువకుడికి గాయాలు

ఎంవీపీ కాలనీ, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : గుర్తు తెలియని వాహనం ఢీకొని ఓ యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. ఎంవీపీ పోలీస్ స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ వరహాలు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. సీతంపేటలోని శ్రీహరి వీధికి చెందిన టీకే యాదవరావు (24) బ్లింకిట్ స్టోర్‌లో కిరాణా డెలివరీ బాయ్‌గా పని చేస్తున్నాడు. ఈ నెల 13న తెల్లవారు జామున మూడు పన్నెండున్నర సమయంలో విధులు ముగించుకుని స్కూటీపై వస్తుండగా, కృష్ణాకళాశాల నుంచి హెచ్‌బీ కాలనీ చివరి బస్టాపు వద్దకు వచ్చేసరికి, సీతమ్మధార నుంచి అతి వేగంగా వచ్చిన తెల్లని బొలెరో వాహనం ఢీకొంది. దీంతో యాదవరావుతీవ్రంగా గాయపడ్డాడు.

సినిమా గైడ్

- **కానిస్టేబుల్** : జగదాంబ, రమాదేవి,
- **బల్టీ** : గోకుల్
- **కాంతార 2** : మెలోడి, శరత్, శ్రీరామా, శ్రీకన్య, ఊర్వశి (కంచరపాలెం), లక్ష్మీనరసింహ -2(104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), శ్రీకన్య (గాజువాక)
- **ఓజి** : శారదా, జగదాంబ, రమాదేవి, సంగం, , లీలామహల్, కిన్నెర, కామేశ్వరి, వెంకటేశ్వర-1, 2, శ్రీకన్య-2, శ్రీకన్య హెవెన్-3, మినీ మోహిని (గాజువాక), శ్రీకాంతి, సుకన్య, మౌర్య (గోపాలపట్నం), ఎస్.వి.సి.లిఖిత (శ్రీహరిపురం)
- **మిరాయి**: జగదాంబ, లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సౌజన్య(గోపాలపట్నం), నటరాజ్-1 (పెందుర్తి), కన్య (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం)
- **ఇడ్లీ కొట్టు** : శ్రీ వెంకటేశ్వర, రమాదేవి

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 19, టమాటా 21, వంకాయలు (తెలుపు) 36, వంకాయలు (నలుపు) 46, బెండకాయలు 32, పచ్చిమిర్చి 36, కాకరకాయలు 30, బీరకాయలు 34, ఆనపకాయ 20, కాలీఫ్లవర్ 38, క్యాబేజి 20, క్యారెట్ 58, దొండకాయలు 32, బంగాళ దుంపలు 18, అరటికాయ (పె)8, మునక్కాడలు (కిలో) 64, అల్లం (పాతది) 70, బరబాటి 40, ముల్లంగి 28, నిమ్మకాయలు (కిలో) 55, బద్దచిక్కుడు 60, దోస కాయలు 22, వెల్లుల్లి (పెద్దవి) 65, కొబ్బరికాయ (పెద్దది) 40, బీన్స్ (పెన్సిల్) 56, కీరదోస 28, కాప్సికమ్ 64, పొట్లకాయ (పెద్దది) 24, చేమదుంపలు 30, చిలగడదుంపలు 36, కంద 36, దేముడుచిక్కుడు 80, గోరు చిక్కుడు 40, కూర పెండలం 26, బ్రకోలి 45, పనసపొట్టు 200, కొండఉసిరి 70, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాలకూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 60, కర్రపెండలం 24, మామిడి అల్లం 100, బొప్పాయి 36, జామకాయలు (కిలో) 55.

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)

విశాఖపట్నం	535
విజయనగరం	539
శ్రీకాకుళం	539

చికెన్ ధరలు బ్యాగ్

రైతు ధర	125
లైవ్ ధర	145
విత్ స్కిన్	260
స్కిన్‌లెస్	270

జీఎస్టీ తగ్గింపుతో సామాన్యులకు ఉపశమనం

» బీచ్ రోడ్డు వద్ద అట్టహాసంగా అవగాహన ర్యాలీ

బీచ్ రోడ్డు, అక్టోబర్ 15, (ఆంధ్రజ్యోతి) : జీఎస్టీ తగ్గింపుతో సామాన్య ప్రజలకు ఉపశమనం కలిగిందని జిల్లా జాయింట్ కలెక్టర్ కె.మయూర్‌అశోక్ పేర్కొన్నారు. బుధవారం ఆర్కే బీచ్ వద్ద విశాఖపట్నం పర్యాటక శాఖ, జీఎస్టీ డిపార్టుమెంట్ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ జీఎస్టీ 2.0తో సామాన్య ప్రజలకు ఎంతో మేలు జరిగిందన్నారు. జీఎస్టీ తగ్గింపులపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు 'సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్' పేరుతో ప్రచారం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. పన్నులు తగ్గడంతో గృహ వస్తువుల నుంచి నిర్మాణ సామగ్రి వరకు ధరలు తగ్గాయన్నారు. ఎస్‌జీఎస్టీ అడిషనల్ కమిషనర్ సీతారాం శేఖర్ మాట్లాడుతూ జీఎస్టీ రేట్లను గణనీయంగా తగ్గించడం వల్ల పర్యాటనలు, తీర్థయాత్రలు, వినోద ప్రయాణాలు, సాంస్కృతిక పర్యాటనలు తక్కువ ఖర్చుతో చేయడానికి వీలుంటుందని అన్నారు. విశాఖ తీరంలో పర్యాటకులు రావడం వల్ల ప్రాంతీయ దుకాణాలు, రెస్టారెంట్లు, హస్తకళలు లాభపడ్డాయన్నారు. ముఖ్యంగా ట్రాన్స్‌పోర్ట్, కేటరింగ్, ఆటోమొబైల్ రెంటల్స్‌కు డిమాండ్ బాగా పెరిగిందన్నారు. అనంతరం ఆర్కే బీచ్ కాళికామాత దేవాలయం నుంచి వైఎంసీఏ కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏయూ ఫైన్ ఆర్ట్స్ విద్యార్థులు, ఎస్ఎస్ఆర్ కంపెనీ, సోమాని ఇస్పత్ సహకారంతో రూపొందించిన సైకత శిల్పం ఆకట్టుకొంది. కార్యక్రమంలో జిల్లా పర్యాటక అధికారి జె.మాధవి, డిప్యూటీ అసిస్టెంట్ కమిషనర్ శ్రీనివాసరావు, హోటల్ అసోసియేషన్ ప్రెసిడెంట్ పవన్ కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.



బీచ్ రోడ్డులో ర్యాలీ ప్రారంభిస్తున్న జేసీ కె.మయూర్‌అశోక్, పాల్గొన్న అధికారులు

22వ వార్డులో టీడీపీ 'గూగుల్' సంబరాలు



కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకుంటున్న టీడీపీ నాయకులు

మద్దిలపాలెం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : నగరానికి గూగుల్ డేటా సెంటర్ రాకతో ఐటీ అభివృద్ధి గణనీయంగా పెరుగుతుందని టీడీపీ పార్లమెంటరీ కమిటీ ఉపాధ్యక్షుడ బొట్టా వెంకటరమణ పేర్కొన్నారు. విశాఖలో గూగుల్ డేటా సెంటర్ ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వానికి, గూగుల్ సంస్థకు ఒప్పందం జరిగిన నేపథ్యంలో బుధవారం జీవీఎంసీ 22వ వార్డు మంగాపురం కాలనీలో టీడీపీ శ్రేణులు సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా వెంకటరమణ మాట్లాడుతూ గూగుల్ సంస్థ నగరానికి వస్తే మరెన్నో ఐటీ కంపెనీలు ఇక్కడకు రావడానికి ఆసక్తి చూపుతాయన్నారు. దీనివల్ల నగరం ఐటీ పరంగా అభివృద్ధి చెందడమే కాకుండా ఎంతో మంది యువతకు ఉపాది అవకాశాలు లభిస్తాయన్నారు. బెంగళూరు, హైదరాబాద్ తదితర నగరాలకు వెళ్లే అవసరం లేకుండా ఉత్తరాంధ్ర యువతకు విశాఖ ఉద్యోగ హబ్‌గా తయారవుతుందనడంలో ఎలాంటి సందేహం లేదన్నారు. కార్యక్రమంలో టీడీపీ వార్డు అధ్యక్షుడు కోడిబోయినఆనంద్, కార్యదర్శి మళ్ల రవికుమార్, దువ్వి స్వామి, ఒమ్మి అప్పారావు, దువ్వి రాజ్‌కుమార్, పండు, సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

పోలమాంబ అమ్మవారి హుండీ ఆదాయం రూ.8 లక్షలు

పెదవాల్తేరు, అ క్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : పెదవాల్తేరులోని కరక చెట్టు పోలమాంబ అమ్మవారి దేవస్థానంలో దేవదాయ, ధర్మాదాయశాఖ పర్యవేక్షణ అధికారి, లాసన్స్ బే కాలనీలో శ్రీవెంకటేశ్వరస్వామి దేవాలయం కార్యనిర్వహణాధికారి కె.ఆదినారాయణ, ఈవో గాయత్రి అధ్వర్యంలో బుధవారం హుండీ లెక్కించారు. 86 రోజులకు హుండీ ఆదాయం రూ.8,02,932 వచ్చినట్లు ఆలయ ఈవో గాయత్రి తెలిపారు. పెదవాల్తేరు గ్రామ సేవా సంఘం అధ్యక్షుడు బి.తవిటి రెడ్డి, పోలీసులు, బ్యాంకు సిబ్బంది, అర్చకులు, ఆలయ సిబ్బంది తదిరతులు పాల్గొన్నారు.

ఘనంగా వైట్‌కన్ డే



ర్యాలీ ప్రారంభిస్తున్న కార్పొరేటర్ మంగవేణి

ఎంవీపీ కాలనీ, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : ఎంవీపీ కాలనీ తొమ్మిదో సెక్టరులో ఉన్నరైజింగ్ హెలెన్ కిల్లర్ విజువల్లీ చాలెంజ్‌డ్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో బుధవారం 62వ వైట్‌కన్ డే (అంధుల కోసం స్టిక్ కనుగొన్న రోజు) కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఎంవీపీ కాలనీ సర్కిల్ నుంచి రెండు వందల మంది అంధులతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా 18వ వార్డు కార్పొరేటరు గొలగాని మంగవేణి విచ్చేసి జెండా ఊపి ర్యాలీ ప్రారంభించారు. వైట్‌కన్ అనేది అంధుల చేతిలో కర్ర మాత్రమే కాదని, అది వారికి స్వేచ్ఛా స్వాతంత్ర్యంతో పాటు ధైర్యాన్ని, విశ్వాసాన్ని పెంపొందిచేదని వక్తలు పేర్కొన్నారు. డీఎల్‌బీ స్కూల్1999 బ్యాచ్ ఆధ్వర్యంలోని హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థ, విశాఖ రాబిన్‌హుడ్ ఆర్మీ, ఎంవీపీ సాయిరాం భజన మండలి సహకారంతో వైట్‌కన్స్, ఫైల్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో బి.రమణ, భీమారావు, అమ్మినాయుడు, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

శ్మశాన వాటికలో ప్రహరీ గోడ నిర్మాణానికి శంకుస్థాపన

ఆరిలోవ, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 10వ వార్డులో జాతీయ రహదారికి అనుకొని మసీదు వద్ద గల ముస్లిం శ్మశాన వాటికలో కాంపౌండ్ వాల్ నిర్మాణంనిమిత్తం బుధవారం వెలగపూడి రామకృష్ణ బాబు కార్పొరేటర్ మద్దిల రామలక్ష్మితో కలిసి శంకుస్థాపన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వెలగపూడి మాట్లాడుతూ సుమారు రూ.18 లక్షల జీవీఎంసీ నిధులతో ఇక్కడ గోడ నిర్మాణం చేపట్టనున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో జోనల్ కమిషనర్ కనకమహాలక్ష్మి, జీవీఎంసీ డీఈ, ఏఈలు, టీడీపీ 10వ వార్డు అధ్యక్షుడు గాడు అప్పలనాయడు, బీజేపీ 10వ వార్డు అధ్యక్షుడు దొంతల రమణ, పలువురు ముస్లిం నాయకులు పాల్గొన్నారు.



శంకుస్థాపన నిర్వహిస్తున్న ఎమ్మెల్యే వెలగపూడి, కార్పొరేటర్ రామలక్ష్మి

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

ఆరిలోవ, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : ఆరిలోవ విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో గల ఆరిలోవ నుంచి పాత డెయిరీ ఫారం సబ్ స్టేషన్ వరకు 33 కేవీ యూజీ కేబుల్ చార్జింగ్ నిమిత్తం లైన్ క్లియరెన్స్ పనులు చేపడతున్నట్టు జోన్-3 ఆపరేషన్స్ విభాగం ఈఈ బి.సింహాచలంనాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. దీంతోగురవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని చెప్పారు. గాంధీ నగర్, తోటగరువు, అన్నానగర్, బీటీఆర్ నగర్, గణబాబు నగర్, బాలాజీనగర్, పాత ఆరిలోవ, చినగదిలి, పెదగదిలి, సంతపాలెం, సాయి బాబా గుడి ప్రాంతం, నేతాజీనగర్ ప్రాంతాల్లో సరఫరా ఉండదన్నారు.

విభజన హామీలు అమలు కోరుతూ ఏఐవైఎఫ్ ఆందోళన

సిరిపురం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): ఏపీకి ప్రత్యేక హోదా, విభజన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ అఖిలభారత యువజన సమైక్య (ఏఐవైఎఫ్)ఆధ్వర్యంలో బుధవారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు పరుచూరి రాజేంద్రబాబు, యుగంధర్ మాట్లాడుతూ ఏపీకి విభజన హామీలు అమలును కేంద్ర ప్రభుత్వం పూర్తిగా మరిచిపోయిందన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి తలమానికంగా నిలిచిన స్టీల్‌ప్లాంటును కార్పొరేట్ కంపెనీలకు కట్టబెట్టేందుకు ఎన్డీఏ ప్రభుత్వం ప్రయత్నిస్తుందన్నారు. 42 విభాగాలను ప్రైవేటు వ్యక్తులకు కట్టబెడుతూ, ఇక్కడ పనిచేస్తున్న కార్మికులను తొలగిస్తున్నారన్నారు. స్టీల్‌ప్లాంటును ఆదుకుంటామని చెబుతూనే, దశల వారీగా దీన్ని ప్రైవేటుపరం చేసే రీతిలో కేంద్ర ప్రభుత్వ చర్యలు ఉన్నాయన్నారు. దీనిపై కూటమి ప్రభుత్వం గట్టిగా వ్యతిరేకించాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్రం నుంచి ఎన్నికైన ఎంపీలు స్టీల్‌ప్లాంటు విషయంలో కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలన్నారు. రాష్ట్రంలో వైద్య కళాశాలలను పీపీపీ విధానంలో ప్రైవేటు వ్యక్తులకు అప్పగించాలనే ఆలోచన కూటమి ప్రభుత్వం విరమించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ నాయకుడు కె.శ్రీనివాస్, జిల్లా అధ్యక్షుడు వై.రాంబాబు, సందీప్, శివ, నాగరాజు, మధు, రమణ తదితరులు పాల్గొన్నారు.



ఆందోళన నిర్వహిస్తున్న ఏఐవైఎఫ్ ప్రతినిధులు

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి తీవ్ర గాయాలు

ఎంవీపీ కాలనీ, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : ఆగి ఉన్న లారీని టాటా ఏస్ వాహనంతో ఢీకొట్టడంతో ముగ్గురు యువకులు తీవ్ర గాయాలపాలై, అపస్మారక స్థితిలో చికిత్స పొందుతున్నారు. ఎంవీపీ పోలీస్ స్టేషన్ ఏఎస్ఐ జి.సత్యం తెలిపిన వివరాలలా ఉన్నాయి. అక్కయ్యపాలెం వద్ద ఓ సంస్థలో ఎల్ఈడీ టెక్నీషియన్లుగా పని చేస్తున్న లబాన శ్రీకాంత్ (27), లబాన సింహాద్రి (23), మేకమల్ల స్వరాజ్ (26) ఈ నెల 14న తెల్లవారు జామున నాలుగు గంటల సమయంలో టాటా ఏస్ గోల్డ్ వాహనంలో టిఫిన్ చేయడానికి నగరంలోకి ప్రయాణిస్తుండగా, మద్దిలపాలెం భారత్ పెట్రోలియం బంకు సమీపంలోకి వచ్చేసరికి ఆగి ఉన్న లారీని వేగంగా ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో ముగ్గురూ తీవ్ర గాయాల పాలై అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయారు. కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

ఆరోగ్య ఆంధ్రపదేశ్ లక్ష్యంతో సఖీ సురక్షా

పెదవాల్తేరు, అక్టోబరు 15 (ఆంధ్ర జ్యోతి) : ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ లక్ష్యం దిశగా రాష్ట్రం ముందుకు సాగుతోందని , మహిళల ఆరోగ్య పరిరక్షణ కోసమే సఖీ సురక్షా అమలు చేస్తున్నట్టు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు పేర్కొన్నారు. బుధవారం పెదవాల్తేరు చేపల మార్కెట్ వద్ద గల కల్యాణమండపంలో సఖీ సురక్షా వైద్య పరీక్షల శిబిరాన్ని జీవీఎంసీ యూసీడీ విభాగం ప్రాజెక్టు డైరెక్టర్ సత్యవేణితో కలిసి ఆయన ప్రారంభించారు. అనంతరం సఖీ సురక్షా కేక్‌ను కట్ చేసి మహిళలకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో చోడే వెంకట పట్టాభిరామ్, గేదెలనాగరాజు, బైరెడ్డి పోతన్న రెడ్డి, కాళ్ల శంకర్, పీతల అమరేంద్ర, స్వయం సహాయక సంఘం మహిళలు పాల్గొన్నారు.

'రహదారుల అభివృద్ధిపై దృష్టి సారించాలి'

సిరిపురం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : మాస్టర్‌ప్లాన్‌లో భాగంగా చేపడుతున్న రహదారుల అభివృద్ధి పనులపై ప్రత్యేక దృష్టి సారించి, వాటి నిర్మాణాలను సకాలంలో పూర్తి చేసేలా శ్రద్ధ తీసుకోవాలని వీఎంఆర్‌డీఏ చైర్మన్ ఎంవీ ప్రణవ్‌గోపాల్ పేర్కొన్నారు. బృహత్తర ప్రణాళిక రహదారుల పనుల పురోగతిపై అధికారులు, పనులు చేస్తున్న కాంట్రాక్టర్లతో బుధవారం వీఎంఆర్‌డీఏ సమావేశ మందిరంలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ప్రణవ్‌గోపాల్ మాట్లాడుతూ భోగాపురం విమానాశ్రయాన్ని సాధ్యమైనంతత్వరగా అందుబాటులోకి తీసుకురావాలనే కృతనిశ్చయంతో ఉన్న ముఖ్యమంత్రి చంద్ర బాబు, విద్యశాఖ మంత్రి లోకేష్ ఉన్నారని, ఇందుకనుగుణంగా రహదారుల అనుసంధానం జరుగాలన్నారు. జీవీఎంసీతో సమన్వయం చేసుకొని, టీడీఆర్‌లను సత్వరమే జారీ చేసి, వాటిని సంబంధిత లబ్ధిదారులకు అందజేసేలా అధికారులు శ్రద్ధ తీసుకోవాలన్నారు. అదనపు కమిషనర్ రమేశ్, కార్యదర్శి మురళి కృష్ణ, ప్రధాన ఇంజనీర్ వినయ్ కుమార్, ఎస్టేట్ అధికారి దయానిధి, ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

రైల్వే స్టేషన్‌లో 5 కిలోల గంజాయి పట్టివేత

విశాఖపట్నం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): రైల్లో గంజాయి రవాణా చేస్తున్న వ్యక్తిని ఆర్పీఎఫ్, జీఆర్పీ సిబ్బంది పట్టుకుని వారి నుంచి రూ.25 వేల విలువైన ఐదు కిలోల గంజాయి బ్యాగ్‌లను స్వాధీనం చేసుకున్నారు. బుధవారం ప్లాట్‌ఫామ్‌లపై తనిఖీలు నిర్వహిస్తున్న సమయంలో ఒడిశాకు చెందిన దేవేందర్ ఖోస్లా (42) గంజాయి రవాణా చేస్తూ పట్టుబడ్డారు. నిందితుడిపై కేసు నమోదు చేసి కోర్టుకు తరలించినట్టు రైల్వే పోలీసులు తెలిపారు.

టూ వీలర్ సర్వీస్ టెక్నీషియన్ కోర్సులో ఉచిత శిక్షణ

కంచరపాలెం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో టూవీలర్ సర్వీస్ టెక్నీషియన్ కోర్సులో ఉచిత శిక్షణను అందించనున్నారు. మూడు నెలల పాటు అందించనున్న ఈ శిక్షణకు పదో తరగతి పాసైన నిరుద్యోగ అభ్యర్థులు అర్హులు. శిక్షణ అనంతరం ఉద్యోగావకాశాలు కూడా కల్పించనున్నారు. అభ్యర్థులకు శిక్షణ ఈ నెల 23 నుంచి ప్రారంభం కానున్నదని స్కిల్ హబ్ కో-ఆర్డినేటర్ డి.రామకృష్ణ పేర్కొన్నారు. మరిన్ని వివరాల కోసం ఫోన్ : 9948768778లో సంప్రదించాలని కోరారు.

మాలతి ఆర్పీ కాదు

» స్పష్టం చేసిన సీవో ధనలక్ష్మి

అక్కయ్యపాలెం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : గ్రేటర్ విశాఖ 42వ వార్డు అక్కయ్యపాలెం సంగం ఆఫీస్ సమీపంలో జి.మాలతి అనే ఆమె జీవీఎంసీ ఆర్పీ కాదని సీవో ధనలక్ష్మి స్పష్టంచేశారు. మాలతి ఆర్పీగా చలామణి అవుతున్నారని శ్రీకనకమహాలక్ష్మి పొదుపు సంఘం సభ్యులు ఫిర్యాదు చేశారని, ఆమెకు పొదుపు సంఘాలకు ఎటువంటి సంబంధం లేదన్నారు. మాలతి 12 పొదుపు సంఘాల గ్రూప్‌లను తయారు చేసి బ్యాంకు ఖాతాలు తెరిచారన్నారు. కానీ ఆ సంఘాల బ్యాంకు పుస్తకాలు ఆమె దగ్గర లేకుండా ఎవరి పుస్తకాలు వారి దగ్గరే ఉన్నాయని చెప్పారు.

'రైళ్లలో బాణసంచా తరలిస్తే కఠిన చర్యలు'

విశాఖపట్నం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): రైల్లో బాణ సంచా, ఫైర్ క్రాకర్‌తోపాటు మండే వస్తువులు రవాణా చేయడం నేరమని వాల్తేరు రైల్వే అధికారులు తెలిపారు. దీపావళి పండుగను పురస్కరించుకుని రైళ్లలో క్రాకర్లు, బాణసంచా, ఇతర మండే వస్తువులు తీసుకువెళ్లకుండా నిరోధించేందుకు వాల్తేరు డివిజన్ ప్రత్యేక భద్రతా చర్యలు చేపట్టినట్లు తెలిపారు. దీనిలో భాగంగా స్టేషన్లలో, రైళ్లలో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశామన్నారు. ఎప్పటికప్పుడు ఆకస్మిక తనిఖీలు చేపట్టి నిబంధనలు ఉల్లంఘిస్తే రైల్వే చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. దీపావళి పండుగ జరుపుకోవడానికి స్వగ్రామాలకు వెళ్లేవారు వెంట బాణ సంచా తీసుకువెళ్లి ఇబ్బందులు తెచ్చుకోవద్దని,ప్రయాణికుల భద్రతకు తీవ్ర ప్రమాదం ఏర్పడే అవకాశముందని సూచించారు. ప్రయాణికుల భద్రతను దృష్టిలో ఉంచుకొని ప్రత్యేక తనిఖీలతోపాటు నిరంతర నిఘా ఏర్పాటు చేశామన్నారు. రైళ్లలోనేకాకుండా స్టేషన్‌లో ప్లాట్‌ఫామ్‌లపై నిషేధిత వస్తువులతో కనిపిస్తే చర్య తప్పదన్నారు. పార్శిల్ సర్వీసు ద్వారా రవాణా అయ్యే లగేజీలను క్షుణ్ణంగా తనిఖీ చేస్తామన్నారు.ప్రయాణికులు అప్రమత్తంగా ఉండి రైళ్లు, స్టేషన్లలో అనుమానాస్పదంగా కనిపిస్తే భద్రతా సిబ్బందికి సమాచారం అందించి సహకరించాలని కోరారు.

నగర పరిశుభ్రతపై షీ టీమ్స్ నిరంతర నిఘా

» పరిశుభ్రత, సుందరీకరణ, అభివృద్ధే ప్రాధాన్య అంశాలు
» నగర వాసుల సహకారం అవసరం
» జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్



వెంకోజీపాలెం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : విశాఖ నగర పరిశుభ్రత, సుందరీకరణ, అభివృద్ధే ప్రాధాన్యంగా జీవీఎంసీ ప్రత్యేక కార్యాచరణ చేపట్టినట్టు గ్రేటర్ విశాఖ కమిషనర్ కేతన్ గార్గ్ ఒక ప్రకటన ద్వారా తెలిపారు. ఈ నేపథ్యంలో బహిరంగ ప్రదేశాల్లో వ్యర్థాలను పారబోసే వారిని గుర్తించేందుకు నగరంలో 'షీ' (శానిటేషన్ అండ్ హెల్త్ ఎన్‌ఫోర్స్‌మెంట్) టీమ్స్ నిరంతర నిఘాతో పని చేస్తున్నాయని, పరిసర పరిశుభ్రతకు, పర్యావరణ పరిరక్షణకు నగర ప్రజలు సహకరించాలని జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ కోరారు. విశాఖ నగర పరిశుభ్రతకు, పర్యావరణానికి, సుందరీకరణకు, ఆహ్లాద వాతావరణానికి భంగం కలిగించేలా విశాఖ నగరంలో గల పలు వ్యాపారస్తులు, వాణిజ్య సముదాయాలు, నివాసితులు, సందర్శకులు బహిరంగ ప్రదేశాలు, కాలువలు, రోడ్లు, ఫుట్‌పాత్‌లపై తమ వ్యర్థాలను పారవేస్తూ పరిసరాలను నిత్యం అశుభ్రపరచడం జీవీఎంసీ గమనిస్తూ వాటి నియంత్రణకు ఇప్పటికే ఏర్పాటు చేసి 'షీ' టీమ్స్ ద్వారా ప్రత్యేక నిఘాను నగరమంతా ఏర్పాటు చేశామన్నారు. అలాగే బీచ్ పరిసరాల్లో ఉన్న వ్యాపారస్తులు బీచ్‌కు వచ్చే సందర్శకులు, విహారయాత్రికులకు అవగాహన కల్పించేందుకు బీచ్ తీర ప్రాంతాల్లో వ్యర్థాలను పారవేసి పరిసరాలు, అశుభ్రపరుస్తూ సముద్ర జలాల కలుషితానికి కారకులవుతున్నారన్నారు. అందుకే జీవీఎంసీ నగరంలో ఏర్పాటు చేసిన 'షీ' టీమ్స్ నిరంతర నిఘా ద్వారా అతిక్రమించిన వ్యర్థాలను పారవేసే వ్యాపారస్తులు, వాణిజ్య సముదాయాలను గుర్తించి రూ.1000 జరిమానాతో పాటు వారి వ్యాపార లైసెన్సులను రద్దు చేయడం, అలాగే కాలనీలు, రోడ్లు, బహిరంగ ప్రదేశాలు, కాలువలు, ఫుట్‌పాత్‌లపై వ్యర్థాలు పారవేసే వారిపై రూ.500 జరిమానా విధింపు ప్రక్రియను చేపట్టామన్నారు. ప్రజల ఆరోగ్య పరిరక్షణ దిశగా నగరంలో గల పలు హోటళ్లు, రెస్టారెంట్లు, ఆహారం విక్రయించే స్టాళ్లు, వంటశాలలపై జీవీఎంసీ 'షీ' టీమ్స్ తనిఖీలు నిర్వహించి అపరిశుభ్రమైన ఆహారాన్ని, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువులను స్వాధీన పరుచుకుని జరిమానాలను విధించి, అతిక్రమించిన వ్యాపారాల లైసెన్సులను కూడా రద్దు చేయడం ఇప్పటికే జరుగుతోందన్నారు. ఆ దిశగా నగర పరిసరాల పరిశుభ్రతను మరింత పటిష్ట పరిచేందుకు ఈ 'షీ' టీమ్స్ నగరంలో నిరంతర నిఘాతో పరిశీలిస్తున్నాయన్నారు.

నగరంలో అంతర్జాతీయ భాగస్వామ్య సదస్సు, అంతర్జాతీయ ఫ్లీట్ రివ్యూ కార్యక్రమాలు జరగనున్న నేపథ్యంలో మహా విశాఖ నగరాన్ని మరింత అభివృద్ధి పరుస్తూ... సుందరంగా, పచ్చదనం, విద్యుత్ కాంతులతో అందరినీ ఆకర్షించేలా తీర్చిదిద్దే కార్యక్రమాలను జీవీఎంసీ పూర్తి చేస్తోందన్నారు. కాబట్టి వ్యాపారస్తులు, వాణిజ్య సముదాయాల నిర్వాహకులు, కాలనీవాసులు, నివాసితులు తమ వద్ద రోజు ఉత్పత్తి అయ్యే వ్యర్థాలను బహిరంగ ప్రదేశాలు, రోడ్లు, కాలువలు, ఫుట్‌పాత్‌లపై పారవేయకుండా, జరిమానాలతో వ్యాపార లైసెన్సుల రద్దులకు గురి కాకుండా రోజూ తమ వద్దకు వచ్చే జీవీఎంసీ వాహనాలకు వ్యర్థాలను వేరు చేసి అందించాలని సూచించారు. విశాఖ నగరాన్ని మరింత అభివృద్ధి పరుస్తూ సుందరంగా తీర్చిదిద్దుతూ అతిథులను, పర్యాటకులను, విదేశీయులు, విహారయాత్రికులను ఆకర్షించేలా జీవీఎంసీ చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలకు, పరిసరాల పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణకు నగర ప్రజలు, వ్యాపారస్తులు సహకరించాలని కమిషనర్ విజ్ఞప్తి చేశారు.

ట్రాక్ మెయింటెనర్స్ సమస్యలపై శ్రామిక్ యూనియన్ ధర్నా



మహా ధర్నా నిర్వహిస్తున్న తూర్పు కోస్తా రైల్వే శ్రామిక్ యూనియన్ నేతలు, ప్రతినిధులు

విశాఖపట్నం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : రైళ్ల కార్యకలాపాలకు వెన్నుముకగా నిలిచే ట్రాక్ మెయింటెనర్ల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ తూర్పు కోస్తా రైల్వే శ్రామిక్ యూనియన్ బుధవారం మహా ధర్నా నిర్వహించింది. వాల్తేరు డివిజన్ కార్యాలయం వద్ద జరిగిన ఈ ధర్నాలో డివిజనల్ కో-ఆర్డినేటర్ పీఆర్‌ఎం రావు మాట్లాడుతూ ట్రాక్ మెయింటైనర్ల సమస్యల పరిష్కారంలో యాజమాన్యం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని, రైళ్ల రాకపోకలు సురక్షితంగా జరగడంలో కీలక బాధ్యతలు నిర్వర్తిస్తున్న ట్రాక్ మెయింటైనర్లను వివిధ రకాలుగా వేధించడం అమానుషమని ఆవేదన వ్యక్తం చేశారు. దరిమిలా ట్రాక్ మెయింటైనర్ల పెట్రోలింగ్ పనుల పరిధిని 20 కిలోమీటర్ల నుంచి 12 కిలోమీటర్లకు తగ్గించాలని, అర్హులైన ట్రాక్ మెయింటైనర్ల కెరీర్ మెరుగుపడేందుకు 10 శాతం కోటా కల్పించాలని డిమాండ్ చేశారు. అలాగే పరిమిత విభాగ పోటీ పరీక్ష (ఎల్‌డీసీఈ), జనరల్ విభాగ పోటీ పరీక్షలలో (జీడీసీఈ) అవకాశం కల్పించాలని, రైల్వే బోర్డు మార్గదర్శకాల ప్రకారం సేఫ్టీ కిట్స్ పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం డీఆర్‌ఎంకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో శ్రామిక్ యూనియన్ నాయకులు, బ్రాంచి కార్యదర్శులు, కార్మికులు పాల్గొన్నారు.

పలు రైళ్లకు అదనపు కోచ్‌లు

విశాఖపట్నం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని సంత్రాగచ్చి-యశ్వంత్‌పూర్ ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైలుకు (02863) ఈ నెల 16న ఒక థర్డ్ ఏసీ కోచ్, రౌర్కెలా-జగదల్‌పూర్ ఎక్స్‌ప్రెస్‌కు (18107) ఈ నెల 18న ఒక స్లీపర్ క్లాసు కోచ్ జత చేస్తున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు.

పోర్టు, డిఎల్‌బి పెన్షనర్లకు పెరిగిన అలవెన్సు

మాధవధార, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) ; పోర్టు పెన్షనర్లు, డిఎల్‌బి పెన్షనర్లకు అక్టోబరు నెల నుంచి డి.ఎ పెరిగిందని హార్బర్ అండ్ పోర్ట్ పెన్షనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు చౌదరి అప్పారావు పేర్కొన్నారు. అసోసియేషన్ అధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఈ మేరకు సభ్యులకు దీపావళి పండుగ సందర్భంగా తీపి కబురు చెప్పారు. ఉద్యోగుల్లో క్లాస్ 1, క్లాస్ 2 కేటగిరీల వారికి 52 శాతం, క్లాస్ 3, 4 కేటగిరీల వారికి 18శాతం పెన్షను పెరిగిందని అన్నారు. పెరిగిన మేరకు పింఛను మొత్తాన్ని 2025 అక్టోబరు 1వతేదీ నుంచి దశల వారీగా చెల్లిస్తారని అన్నారు. 31-12-2025 తేదీ వరకు నెలవారీ పెన్షనులోనే పెరిగిన డిఎ మొత్తం అందుతుందని తెలియజేసారు.

సాహిత్య విమర్శకు మార్గదర్శి కట్టమంచి

సీతంపేట, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : ముసలమ్మ మరణం, నవయామిని, పంచమి, వ్యాసమంజరి, అర్థశాస్త్రం మొదలైన గ్రంథాలు రాసి, తెలుగు సాహితీ రంగంలో తనకంటూ ప్రత్యేకమైన విశిష్ట స్థానాన్ని కట్టమంచి రామలింగారెడ్డి ఏర్పర్చుకున్నారని, సాహిత్య విమర్శకు మార్గదర్శిగా నిలిచారని ఆంధ్ర విశ్వవిద్యాలయం విశ్రాంత ఆచార్యుడు ఆచార్య వెలమల సిమ్మన్న పేర్కొన్నారు. సీతంపేట రాజేంద్రనగర్‌లో సహృదయ సాహితి సంస్థ ఆధ్వర్యంలో 'బహుముఖ ప్రజ్ఞాశాలి కట్టమంచి' అనే అంశంపై ప్రసంగ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ముందుగా తుదిశ్వాస విడిచిన ప్రముఖ రచయిత కవి 101 సంవత్సరాలు జీవించిన రాచకొండ నరసింహశర్మ మరణానికి సభలో మౌనం పాటించి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆచార్య వెలమల సిమ్మన్న మాట్లాడుతూ కవిత్వ విచారం అనే విమర్శనా గ్రంథంతో అభినవ విమర్శనా మార్గదర్శి అయ్యారన్నారు. కార్యక్రమంలో డాక్టర్ కేజీ వేణు, డాక్టర్ డీవీ సూర్యారావు, సీహెచ్ చినసూర్యనారాయణ, ఉప్పల అప్పలరాజు, చల్లా రాంబాబు, కె.భీమేశ్వరరావు, పరమేశ్వర రావు, డీఎస్ కుమార్, ఆర్.శివాజీ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూకేటాయింపు విధానాన్ని సవాల్ చేస్తాం

» 'సత్వ' పిల్ సవరణకు అనుమతి కోరిన పిటిషనర్
» హైకోర్టు అంగీకారం.. విచారణ 2 వారాలకు వాయిదా

అమరావతి, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): విశాఖలో సత్వ డెవలపర్స్‌కు భూకేటాయింపును సవాల్ చేస్తూ దాఖలైన ప్రజాప్రయోజన వ్యాజ్యం(పిల్)పై బుధవారం హైకోర్టు విచారణ జరిపింది. పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది పొన్నవోలు సుధాకర్‌రెడ్డి స్పందిస్తూ.. భూకేటాయింపు కోసం ప్రభుత్వం తీసుకొచ్చిన పాలసీని సవాల్ చేస్తూ పిల్‌ను సవరించేందుకు అనుమతించాలని కోరారు. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ చీమలపాటి రవితో కూడిన ధర్మాసనం అందుకు అంగీకరించి.. విచారణను రెండు వారాలకు వాయిదా వేసింది. విశాఖపట్నం పరిధిలోని మధురవాడ ఐటీ హిల్ నంబర్ 4 వద్ద 30 ఎకరాలను సత్వ డెవలపర్స్ ప్రైవేట్ లిమిటెడ్‌కు కేటాయిస్తూ.. రాష్ట్ర ఐటీ-ఎలక్ట్రానిక్స్-కమ్యూనికేషన్ల శాఖ ఈ ఏడాది ఆగస్టు 1న జారీ చేసిన జీవో 27ని సవాల్ చేస్తూ విశాఖకు చెందిన మేడపాటి వెంకటరెడ్డి పిల్ దాఖలు చేశారు. వివిధ సంస్థలకు చేసే భూకేటాయింపునకు టెండర్/ఆక్షన్ విధానాన్ని అనుసరించేలా ప్రభుత్వానికి మార్గదర్శకాలు జారీ చేయాలని.. 2023లో ఏపీఐఐసీ తీసుకొచ్చిన నిబంధనలను అనుసరించి లీజు విధానంలో ఏపీఐఐసీ, ఎస్‌ఐపీబీ ద్వారా భూకేటాయింపులు జరిపేలా ఆదేశాలివ్వాలని కోరారు. సంబంధిత జీవోను రద్దు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ పిల్ బుధవారం విచారణకు రాగా ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది (ఎస్‌జీపీ) ఎస్.ప్రణతి వాదనలు వినిపిస్తూ... వివిధ కంపెనీలు/సంస్థలకు భూకేటాయింపులను సవాల్ చేస్తూ ఇప్పటికే ప్రజాహిత వ్యాజ్యాలు దాఖలయ్యాయని కోర్టు దృష్టికి తీసుకొచ్చారు. ధర్మాసనం స్పందిస్తూ... భూకేటాయింపుల కారణంగా పెద్ద సంస్థలు పెట్టుబడులు పెట్టేందుకు ముందుకొస్తున్నాయి కదా! అని ప్రశ్నించింది. పొన్నవోలు బదులిస్తూ.. అభివృద్ధికి తాము వ్యతిరేకం కాదని, భూకేటాయింపులు జరుగుతున్న విధానాన్ని మాత్రమే వ్యతిరేకిస్తున్నామన్నారు. ప్రభుత్వం తీసుకొచ్చిన భూకేటాయింపు పాలసీని సవాల్ చేస్తామని.. పిటిషన్‌లో సవరణకు అనుమతించాలని కోరారు.

నడిరోడ్డుపై వివాహిత హత్య

... 7వ పేజీ తరువాయి



ఘటనా స్థలంలో విచారిస్తున్న పోలీసులు

స్వల్ప వాగ్వాదం జరిగింది. సాయంత్రం 5.15 గంటల సమయంలో శ్రావణ సంధ్యారాణి వాకింగ్‌కు వెళ్లేందుకు ఇంటి నుంచి బయలుదేరింది. కొద్దిఅడుగుల దూరం వెళ్లేసరికి కొండమ్మ అనే మహిళ ఎదురు పడడంతో ఆమెతో మాట్లాడుతోంది. ఇంతలో వెనుక నుంచి వచ్చిన శ్రీనివాసరావు పదునైన ఆయుధంతో శ్రావణ సంధ్యారాణి మెడ కోసేశాడు. దీంతో ఆమె తీవ్రరక్తస్రావంతో అక్కడికక్కడే కుప్పకూలిపోయింది. సంధ్యారాణితో మాట్లాడుతున్న మహిళ గట్టిగా కేకలు పెట్టింది. స్థానికులు అక్కడకు వచ్చేసరికి శ్రీనివాసరావు పరారైపోయాడు. స్థానికులు డయల్ 100కి ఫోన్ చేసి సమాచారం ఇవ్వడంతో ఫోర్త్ టౌన్ సీఐ సీహెచ్ ఉమాకాంత్ అక్కడకు చేరుకుని 108కి ఫోన్ చేశారు. 108 సిబ్బంది వచ్చి పరిశీలించగా ఆమె అప్పటికే మృతిచెందినట్టు నిర్ధారించారు. క్లూస్‌టీమ్‌ను రప్పించి ఘటనాస్థలంలో ఆధారాలు సేకరించారు. అనంతరం మృతదేహాన్ని కేజీహెచ్‌కు తరలించారు. నిందితుడు శ్రీనివాసరావును అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. సంధ్యారాణికి ఒక సోదరుడు ఉన్నప్పటికీ అతను అనారోగ్యంతో బాధపడుతున్నట్టు తెలిసింది. తమ అనేవారు ఎవరూ లేకపోవడంతో బుద్ధిమాంద్యం కలిగిన ఇద్దరు కవలల పరిస్థితి ఏమిటనేది అగమ్యగోచరంగా మారింది. వారిని తండ్రి వద్దకు చేర్చేలా పోలీసులు చొరవ తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

నత్తనడకన ఇళ్ల నిర్మాణం

... 7వ పేజీ తరువాయి

చిన్నపాటి వ్యాపారుల నుంచి ఒత్తిడి పెరిగింది. ఇటీవల జిల్లా హౌసింగ్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో కాంట్రాక్టర్లు ఇదే విషయాన్ని ప్రస్తావించారు. బిల్లులు మంజూరుకాకుంటే పనులు చేపట్టలేమని స్పష్టంచేశారు. ఇసుక సరఫరా ఇప్పటికే నిలిచిపోయిందని, సిమెంట్, ఇనుము కూడా రావడం లేదని కొందరు కాంట్రాక్టర్లు ప్రస్తావించారు. కాంట్రాక్టర్ల వాదనతో ఏకీభవించిన అధికారులు...బిల్లుల విషయం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళతామని హామీ ఇచ్చారు.

15 నెలలు.. 8,54,913 ఈ-చలాన్‌లు

... 7వ పేజీ తరువాయి

డ్రంకన్ డ్రైవ్, డేంజరస్ డ్రైవింగ్, రాంగ్‌రూట్‌లో ప్రయాణించే వారి ఫొటోలు తీసి ఈ-చలాన్ జారీచేయడం ప్రారంభించారు. అంతటితో సరిపెట్టేయకుండా, వాటిని క్లియర్ చేయించేందుకు ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ల వారీగా టార్గెట్‌లు విధించారు. దీంతో ఈ-చలాన్‌ల సంఖ్యతోపాటు, జారీచేసిన ఈ-చలాన్‌లలో క్లియర్ అయిన వాటి సంఖ్య కూడా పెరిగింది. నగరంలో గత ఏడాది జూలైలో 79,131 ఈ-చలాన్‌లు జారీచేస్తే వాటిలో 36,453 చలాన్‌లను కట్టించారు. ఆగస్టులో 79,436 ఈ-చలాన్‌లు జారీచేసి 37,298, సెప్టెంబరులో 82,646 ఈ-చలాన్‌లు జారీచేసి 39,840, అక్టోబరులో 92,002 జారీచేసి 43,788, నవంబరులో 86,633 జారీచేసి 40,869 క్లియర్ చేయించారు. ఈ ఏడాది సెప్టెంబరు వరకు 15 నెలల్లో 8,54,913 ఈ-చలాన్‌లు ద్వారా రూ.46,40,32,101 జరిమానా విధించారు. అందులో 3,44,421 ఈ-చలాన్‌లను క్లియర్ చేసి వాహన యజమానుల నుంచి రూ.13,39,73,796 వసూలు చేశారు.ఇది రాష్ట్రంలోనే అత్యధికం కావడం విశేషం.

దుకాణాలు, రైతుబజార్ల వద్ద పార్కింగ్ చేసిన వాహనాలకు జరిమానాపై విమర్శలు

నిబంధనలు ఉల్లంఘించిన వారికి ఈ-చలాన్‌ల జారీచేయడంపై ఎలాంటి అభ్యంతరాలు లేనప్పటికీ దుకాణాలు ముందు, రైతుబజార్‌ల వద్ద పార్కింగ్ చేసిన వాహనాలకు 'డేంజరస్ పార్కింగ్' పేరుతో ఈ-చలాన్‌లు జారీచేయడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. రోడ్డుపక్కనే దుకాణాలు ఏర్పాటుచేసినా పట్టించుకోని పోలీసులు వాటికి వెనుక వైపు నిలిపే వాహనాలను ఫొటోలు తీసి ఈ-చలాన్‌లు పంపుతున్నారంటూ వాహనదారులు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. దుకాణాలు ఉండే ప్రాంతాల్లో పార్కింగ్ సదుపాయం కల్పించకుండా, అక్కడ కొనుగోలు చేసేందుకు వచ్చేవారు వాహనాలను నిలిపితే జరిమానాలు విధించడం ఎంతవరకు సమజంసమని ప్రశ్నిస్తున్నారు.

విద్యార్థుల రక్షణకు కమిటీ ఏర్పాటుపై హర్షం

డాబాగార్డెన్స్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : ఉన్నత విద్యా సంస్థల్లో విద్యార్థుల ఆత్మహత్యల నివారణకు ప్రభుత్వం 13 మందితో కమిటీని ఏర్పాటు చేయడం అభినందనీయమని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ వేదిక సలహాదారుడు నరవ ప్రకాశరావు అన్నారు. బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు.

'ది వీక్షిత్ భారత్ యంగ్ లీడర్స్'పై ప్రచారం

జ్ఞానాపురం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : దేశ వ్యాప్తంగా డైనమిక్ యువ నాయకులను ఎంపిక చేయడానికి జాతీయ యువజనోత్సవం 2025 కార్యక్రమంలో భాగంగా ది వీక్షిత్ భారత్ యంగ్ లీడర్స్ డైలాగ్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఈమేరకు జ్ఞానాపురంలోని సెయింట్ జోసెఫ్ మహిళా కళాశాలలో నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో కళాశాల ఎన్ఎస్ఎస్ వలంటీర్లు బ్రోచర్స్ ద్వారా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా నెహ్రూ యువ కేంద్రం డిప్యూటీ డైరెక్టర్ మాట్లాడుతూ వీక్షిత్ భారత్ యంగ్ లీడర్స్ డైలాగ్ కార్యక్రమం ద్వారా యువతకు పలు అంశాలపై అవగాహన కల్పించనున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పీఓ కె. మాణిక్య కుమారి, లీలా ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

గోస్తనీ నదిలో పడి వ్యక్తి గల్లంతు

తగరపువలస, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : తగరపువలస సమీపంలోని గోస్తనీ నదిలో పడి ఓ వ్యక్తి గల్లంతయ్యాడు. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. రెండు రోజుల క్రితం పీసా త్రిమూర్తులు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. అతని దహన సంస్కరణలు నిమిత్తం వెళ్లిన తమ్మిన శ్రీను (40) నదిలో దిగి స్నానం చేస్తుండగా గల్లంతయ్యాడు. మంగళవారం సాయంత్రం ఈ సంఘటన జరిగింది. అప్పటి నుంచి పోలీసులు నదిలో గాలింపు జరుపుతున్నారు. ఇప్పటి వరకు ఆచూకీ లభించలేదు. శ్రీను తగరపువలస మెయిన్ రోడ్డులో ఉన్న ఎలక్ట్రికల్ దుకాణంలో ప్లంబర్‌గా పనిచేస్తున్నాడు. బాలాజీనగర్‌లో ఉంటున్న అతనికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. భీమిలి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నిత్యాన్న ప్రసాద పథకానికి రూ. లక్ష విరాళం

సింహాచలం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిత్యాన్న ప్రసాద పథకానికి నగరంలోని కేఆర్ఎం కాలనీవాసి బి. మాధవరావు దంపతులు రూ.లక్ష విరాళంగా సమర్పించారు. విరాళం మొత్తాన్ని నగదు రూపంలో దేవస్థానం డిప్యూటీ ఈఓ సింగం రాధ, పర్యవేక్షణాధికారి సునీల్‌కు బుధవారం వారు అందజేశారు. దాత కుటుంబ సభ్యులకు అధికారులు అంతరాలయంలో స్వామివారి దర్శనం కల్పించారు.

ప్రధాని సభకు తరలివెళ్లిన నగరవాసులు

మహారాణిపేట, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : కర్నూల్ జిల్లాలో గురువారం జరగనున్న ప్రధాని నరేంద్ర మోదీ బహిరంగ సభకు నగరం నుంచి పలువురు తరలివెళ్లారు. సూపర్ జీఎస్టీపై జరిగే ఈ సభకు నగరం నుంచి మూడు బస్సుల్లో పారిశ్రామికవేత్తలు, వ్యాపారులు, డీలర్లు, ఎంఎస్ఎంఈ ఇండస్ట్రీ ప్రతినిధులు వెళ్లారు.

నేటి నుంచి షాపింగ్ ఫెస్టివల్

... 7వ పేజీ తరువాయి

జె.మాధవి, జీవీఎంసీ, రెవెన్యూ, పోలీస్, సీఐఐ అధికారులు పాల్గొన్నారు.

నవంబరు 14, 15 తేదీల్లో భాగస్వామ్య సదస్సు

ఏయూ ఇంజినీరింగ్ కళాశాల మైదానంలో నవంబరు 14, 15 తేదీల్లో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా భాగస్వామ్య సదస్సు (పార్టనర్‌షిప్ సమ్మిట్) నిర్వహించనున్నట్టు జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ తెలిపారు. సమ్మిట్ జరగనున్న మైదానంలో ఏర్పాట్లను బుధవారం సాయంత్రం ఆయన పరిశీలించారు. కేంద్ర, రాష్ట్ర మంత్రులు వచ్చే మార్గాలను, ప్రతినిధులు, ప్రముఖుల వాహనాల పార్కింగ్, ట్రాఫిక్ నియంత్రణ తదితర ఏర్పాట్లపై అధికారులకు కీలక సూచనలు చేశారు.

విద్యుత్ రంగంలో ఆవిష్కరణలకు హ్యాక్‌థాన్

ఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్ ఇమ్మడి

విశాఖపట్నం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : ఏపీఈపీడీసీఎల్ స్థాపించిన సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ ఫర్ ఎనర్జీ ట్రాన్సిషన్ (సీఓఈఈటీ)క్లైమేట్ కలెక్టివ్ ఫౌండేషన్ సంయుక్తంగా విద్యుత్ రంగంలో సాంకేతిక ఆవిష్కరణలను ప్రోత్సహించేందుకు హ్యాక్‌ఏపీ హ్యాక్‌థాన్ నిర్వహించనున్నట్టు ఏపీఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్ ఇమ్మడి ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ రంగానికి సంబంధించి వాస్తవ సమస్యలకు వినూత్న సాంకేతిక పరిష్కారాలు అందించగల స్టార్టప్ సంస్థలు ఈ హ్యాక్‌థాన్‌లో పాల్గొనవచ్చన్నారు. రాష్ట్రంలో విద్యుత్తు పంపిణీ వ్యవస్థలో ఎదురవుతున్న సవాళ్లకు స్టార్టప్, డేటా ఆధారిత, ఆధునిక సాంకేతిక పరిష్కారాలు కనుగొనడం ఈ హ్యాక్‌థాన్ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ఎంపికైన స్టార్టప్‌లు తమ పరిష్కారాలను రాష్ట్ర విద్యుత్ రంగ ప్రముఖుల సమక్షంలో ప్రదర్శించే అవకాశం పొందడంతో పాటు విజేతలకు పైలట్ ప్రాజెక్టులు, మూడు డిస్కంలలో పూర్తిస్థాయిలో ప్రాజెక్టులు అమలు చేసుకునే అవకాశాలు లభిస్తాయని పేర్కొన్నారు. ప్రమాదాలను ముందుగానే గుర్తించే వ్యవస్థ, స్మార్ట్ మీటర్ల డేటా విశ్లేషణ ద్వారా ఆదాయ సంరక్షణ, ట్రాన్స్‌ఫార్మర్ ఫెయిల్యూర్ ప్రిడిక్షన్, హెచ్‌టీ లైన్లలో ఇన్సులేటర్ వైఫల్యాల గుర్తింపు,వాటి లోపాలను సురక్షితంగా గుర్తించే సాంకేతిక పరిష్కారాలను అభివృద్ధి చేయాల్సి ఉంటుందన్నారు. విద్యుత్తు రంగం, ఇంధన పరివర్తనలో శిక్షణ, పరిశోధన,సాంకేతిక మార్పులను ముందుకు తీసుకెళ్లేందుకు ఏపీఈపీడీసీఎల్ సీఓఈఈటీ స్టార్టప్‌లకు సహకార వేదికగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఈ నెల 22 అర్ధరాత్రివరకు రిజిస్ట్రేషన్లు కొనసాగుతాయని, హ్యాక్ ఏపీ హ్యాక్‌థాన్ వెబ్‌సైట్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్

డ్రగ్స్ రవాణాను నివారించాలి : కలెక్టర్

మహారాణిపేట, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో గంజాయి, ఇతర మత్తు పదార్థాల రవాణాను పూర్తిగా నివారించాలని కలెక్టర్ హరేంధిర ప్రసాద్ ఆదేశించారు. బుధవారం ఆయన తన కార్యాలయంలో సీపీ శంఖబ్రత బాగ్చితో కలిసి పలు శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు, ఈ సందర్భంగా మాట్లాడుతూ పాఠశాలలు, కళాశాలల వద్ద ఈగల్ టీమ్, ఈగల్ క్లబ్‌ల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. సీపీ మాట్లాడుతూ వ్యసన విముక్తి కేంద్రాలను బలోపేతం చేయడం, నిర్మానుష్య ప్రాంతాల్లో పొదలను తొలగించి లైట్లు ఏర్పాటు చేయాలని, అనుమానిత ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని చెప్పారు.

చేతులు పరిశుభ్రత ముఖ్యం

మహారాణిపేట, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : జిల్లా పరిషత్ కార్యాలయంలో బుధవారం వరల్డ్ హ్యాండ్ వాష్ డే నిర్వహించారు, ఈ సందర్భంగా జడ్పీ సీఈవో పి. నారాయణమూర్తి మాట్లాడుతూ ఆహారం తీసుకునే ముందు చేతులను శుభ్రం చేసుకోవడం వల్ల సగం వ్యాధులు దరి చేరవని చెప్పారు. గతంలో ఇది ఒక ఆచారంగా ఉండే దని, ప్రస్తుతం దీన్ని అలవాటుగా మార్చుకోవాలని తెలిపారు, చేతుల పరిశుభ్రతపై ప్రతిఒక్కరికి అవగాహన కల్పించాలన్నారు. అనంతరం అధికారులు చేతుల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు.

అప్పన్న హుండీ ఆదాయం రూ.2.82 కోట్లు



హుండీల ఆదాయాన్ని లెక్కిస్తున్న సిబ్బంది

సింహాచలం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహస్వామికి గత 44 రోజుల్లో భక్తులు హుండీల ద్వారా రూ.2.82 కోట్ల కట్న, కానుకలను సమర్పించారు. ఈఓ వేంద్ర త్రినాథరావు సారథ్యంలో ఇన్‌స్పెక్టర్ శ్రీధర్ ప్రత్యేక పర్యవేక్షణలో సింహగిరిపై ఉన్న పరకామణి కేంద్రంలో బుధవారం హుండీల లెక్కింపు చేపట్టారు. నగదు రూపంలో రూ.2,82,18,987 కోట్లు లభ్యం రాగా స్వర్ణం 79.1 గ్రాములు, రజితం 13.75 కిలోలు లభించాయి.అలాగే 205 యూఎస్ఏ డాలర్లు, 500 ఒమన్ పైసా, 33 యూరోలు, 15 కెనడా డాలర్లు, 30 సింగపూర్ డాలర్లు, యూఏఈకి చెందిన 95 దీరమ్స్, 16 సౌదీ అరేబియా రియల్స్, 79 ఖతార్ రియాల్స్, 144 నేపాల్ రూపాయిలు, 23 మలేషియా రింగిట్స్, 10 కువాయిట్ దీనార్స్, శ్రీలంక, మయమ్మార్, ఉగాండా, ఖజకిస్తాన్, ఆస్ట్రేలియా దేశాలకు చెందిన కరెన్సీలు కూడా హుండీల ద్వారా స్వామి ఖజానాకు లభ్యమయ్యాయి. ఈ కార్యక్రమంలో దేవస్థానానికి చెందిన పలు విభాగాలకు చెందిన సహాయ ఈఓలు, పర్యవేక్షణాధికారులు, ఎస్‌వీఎల్ఎన్ వాకర్స్ క్లబ్ సభ్యులు, శ్రీహరి సేవా సం ఘం కార్యకర్తలు పాల్గొన్నారు.

'నూతన విద్యా విధానంలో మార్పులు అవసరం'

సీతంపేట, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : నూతన విద్యా విధానం పేద, మధ్య తరగతి ప్రజలను విద్యకు దూరం చేస్తుందని ఏయూ కామర్స్ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ బి. సుబ్బయ్య అన్నారు. ద్వారకానగర్‌లోని పౌర గ్రంథాలయంలో పీడీఎస్‌ఓ విశాఖ జిల్లా మహాసభను బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెక్యులర్, ఫెడరల్, రాజ్యాంగ మౌలిక సూత్రాలకు విరుద్ధంగా విద్యా ప్రైవేటీకరణకు, కార్పొరేటీకరణకు అనుకూలంగా ఉన్న నూతన విద్యా విధానాన్ని అందరూ వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు.పీడీఎస్‌ఓ జిల్లా అధ్యక్షుడు పి. విశ్వనాథ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పీడీఎస్‌ఓ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. భాస్కర్, జిల్లా కార్యదర్శి వి. లక్ష్మి, సతీశ్ కుమార్, యు. జానకి, యమున, లక్ష్మణ్, భాగ్య, తేజ, తులసి, దుర్గాప్రసాద్, వసంత్ పాల్గొన్నారు.

ఘనంగా అబ్దుల్ కలామ్ జయంతి



కలామ్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న నాయకులు

మహారాణిపేట, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : మాజీ రాష్ట్రపతి, ప్రముఖ శాస్త్రవేత్త అబ్దుల్ కలామ్ జయంతి టీడీపీ కార్యాలయంలో బుధవారం ఘనంగా నిర్వహించారు, ముస్లిం మైనారిటీ సెల్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మహ్మద్ నజీర్ కలాం, తదితరులు కలామ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు, ఈ కార్యక్రమంలో మైనారిటీ కార్పొరేషన్ డైరెక్టర్ అబ్దుల్ సలీమా, నాయకులు అబ్దుల్ అనీఫ్, షేక్ బాబ్జి, షేక్ సలీం, మహ్మద్ గౌస్, రఫీ పాల్గొన్నారు.

దుకాణం తెరిచారు!

... 7వ పేజీ తరువాయి

చూసి అక్కడ దుకాణాలు ఏర్పాటుచేయడానికి వీల్లేదంటూ స్పష్టంచేసి, తక్షణం తొలగించాలని ఆదేశించారు. దీంతో కూటమి ప్రజా ప్రతినిధి ఒకరు ఏయూ వీసీతో మాట్లాడి ఇంజనీరింగ్ కళాశాల మైదానానికి ఎదురుగా ఉన్న కొత్తమైదానంలో దుకాణాలు ఏర్పాటుకు అనుమతి ఇవ్వాలని కోరడంతో బుధవారం సాయంత్రం అంగీకరించినట్టు తెలిసింది. దీంతో అక్కడ దుకాణాల ఏర్పాటుపనులు ప్రారంభించారు. ఈ విషయం పోలీస్, అగ్నిమాపక శాఖ అధికారుల వద్ద ప్రస్తావించగా తమకు దుకాణాల ఏర్పాటుకు సంబంధించి ఇప్పటివరకూ ఎలాంటి దరఖాస్తులు రాలేదని సమాధానం ఇచ్చారు. పోలీస్ అధికారుల సూచనల మేరకు సమీప ప్రాంతాల్లో ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా దుకాణాలు ఏర్పాటు చేయాల్సి ఉంటుందని అగ్నిమాపక శాఖ అధికారులు చెబుతున్నారు. అలాకాకుండా దుకాణాలు ఏర్పాటుచేసిన తర్వాత తాము వెళ్లినా ఉపయోగం ఉండదని పేర్కొంటున్నారు.

ఒక్కో దుకాణం రూ.1.2 లక్షలకు విక్రయం

బాణసంచా వ్యాపారం చేయాలనుకునేవారే దుకాణం ఏర్పాటుకోసం దరఖాస్తు చేసుకోవాలి. కానీ నగరానికి చెందిన కూటమి ప్రజా ప్రతినిధి అనుచరులు ఇద్దరు మైదానం నుంచి దుకాణాల ఏర్పాటు వరకూ జీవీఎంసీ, అగ్నిమాపక, పోలీస్ శాఖ, ఏపీఈపీడీసీఎల్ నుంచి అన్ని అనుమతులు తామే తెస్తామని హామీ ఇస్తున్నారు. అందుకు రూ.1.2 లక్షలు డిమాండ్ చేస్తున్నారు. అసోసియేషన్‌ను ముందుపెట్టి వారిద్దరే చక్రం తిప్పుతున్నారని వ్యాపారులే పేర్కొంటున్నారు. దుకాణం ఏర్పాటుకు రూ.30 వేలకు ఒకరికి కాంట్రాక్టు ఇచ్చారని, అనుమతుల కోసం మరో రూ.30 వేలు వరకు ఖర్చుపెట్టి, మిగిలిన రూ.60 వేలు తమ జేబులో వేసుకుంటారని ఆరోపిస్తున్నారు. బినామీ పేర్లతో బల్క్‌గా దరఖాస్తులు పెట్టి, అనుమతి వచ్చిన తర్వాత కావాల్సిన వారికి వాటిని విక్రయిస్తారని చెబుతున్నారు. దీనిపై కూటమి ప్రజా ప్రతినిధులు, అధికారులు లోతుగా దృష్టిసారించి దరఖాస్తు చేసుకున్న వ్యక్తే దుకాణం నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని యువకుడికి గాయాలు

ఎంవీపీ కాలనీ, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : గుర్తు తెలియని వాహనం ఢీకొని ఓ యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. ఎంవీపీ పోలీస్ స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ వరహాలు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. సీతంపేటలోని శ్రీహరి వీధికి చెందిన టేకి యాదవరావు (24) బ్లింకిట్ స్టోర్‌లో కిరాణా డెలివరీ బాయ్‌గా పని చేస్తున్నాడు. ఈ నెల 13న తెల్లవారు జామున మూడు పన్నెండున్నర సమయంలో విధులు ముగించుకుని స్కూటీపై వస్తుండగా, కృష్ణాకళాశాల నుంచి హెచ్‌బీ కాలనీ చివరి బస్టాపు వద్దకు వచ్చేసరికి, సీతమ్మధార నుంచి అతి వేగంగా వచ్చిన తెల్లని బొలెరో వాహనం ఢీకొంది. దీంతో యాదవరావుతీవ్రంగా గాయపడ్డాడు.

సినిమా గైడ్

- **కానిస్టేబుల్** : జగదాంబ, రమాదేవి,
- **బల్టీ** : గోకుల్
- **కాంతార 2** : మెలోడి, శరత్, శ్రీరామా, శ్రీకన్య, ఊర్వశి (కంచరపాలెం), లక్ష్మీనరసింహ -2(104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), శ్రీకన్య (గాజువాక)
- **ఓజి** : శారదా, జగదాంబ, రమాదేవి, సంగం, , లీలామహల్, కిన్నెర, కామేశ్వరి, వెంకటేశ్వర-1, 2, శ్రీకన్య-2, శ్రీకన్య హెవెన్-3, మినీ మోహిని (గాజువాక), శ్రీకాంతి, సుకన్య, మౌర్య (గోపాలపట్నం), ఎస్.వి.సి.లిఖిత (శ్రీహరిపురం)
- **మిరాయి**: జగదాంబ, లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సౌజన్య(గోపాలపట్నం), నటరాజ్-1 (పెందుర్తి), కన్య (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం)
- **ఇడ్లీ కొట్టు** : శ్రీ వెంకటేశ్వర, రమాదేవి

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 19, టమాటా 21, వంకాయలు (తెలుపు) 36, వంకాయలు (నలుపు) 46, బెండకాయలు 32, పచ్చిమిర్చి 36, కాకరకాయలు 30, బీరకాయలు 34, ఆనపకాయ 20, కాలీఫ్లవర్ 38, క్యాబేజి 20, క్యారెట్ 58, దొండకాయలు 32, బంగాళ దుంపలు 18, అరటికాయ (పె)8, మునక్కాడలు (కిలో) 64, అల్లం (పాతది) 70, బరబాటి 40, ముల్లంగి 28, నిమ్మకాయలు (కిలో) 55, బద్దచిక్కుడు 60, దోస కాయలు 22, వె ల్లుల్లి (పెద్దవి) 65, కొబ్బరికాయ (పెద్దది) 40, బీన్స్ (పెన్సిల్) 56, కీరదోస 28, కాప్సికమ్ 64, పొట్లకాయ (పెద్దది) 24, చేమ దుంపలు 30, చిలగడదుంపలు 36, కంద 36, దేముడుచిక్కుడు 80, గోరు చిక్కుడు 40, కూర పెండలం 26, బ్రకోలి 45, పనసపొట్టు 200, కొండఉసిరి 70, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాలకూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 60, కర్రపెండలం 24, మామిడి అల్లం 100, బొప్పాయి 36, జామకాయలు (కిలో) 55.

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)

విశాఖపట్నం	535
విజయనగరం	539
శ్రీకాకుళం	539

చికెన్ ధరలు

బ్యాగ్	
రైతు ధర	125
లైవ్ ధర	145
విత్ స్కిన్	260
స్కిన్‌లెస్	270

జీఎస్టీ తగ్గింపుతో సామాన్యులకు ఉపశమనం

» బీచ్ రోడ్డు వద్ద అట్టహాసంగా అవగాహన ర్యాలీ

బీచ్ రోడ్డు, అక్టోబర్ 15, (ఆంధ్రజ్యోతి) : జీఎస్టీ తగ్గింపుతో సామాన్య ప్రజలకు ఉపశమనం కలిగిందని జిల్లా జాయింట్ కలెక్టర్ కె.మయూర్‌అశోక్ పేర్కొన్నారు. బుధవారం ఆర్కే బీచ్ వద్ద విశాఖపట్నం పర్యాటక శాఖ, జీఎస్టీ డిపార్టుమెంట్ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ జీఎస్టీ 2.0తో సామాన్య ప్రజలకు ఎంతో మేలు జరిగిందన్నారు. జీఎస్టీ తగ్గింపులపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు 'సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్' పేరుతో ప్రచారం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. పన్నులు తగ్గడంతో గృహ వస్తువుల నుంచి నిర్మాణ సామగ్రి వరకు ధరలు తగ్గాయన్నారు. ఎస్‌జీఎస్టీ అడిషనల్ కమిషనర్ సీతారాం శేఖర్ మాట్లాడుతూ జీఎస్టీ రేట్లను గణనీయంగా తగ్గించడం వల్ల పర్యాటనలు, తీర్థయాత్రలు, వినోద ప్రయాణాలు, సాంస్కృతిక పర్యాటనలు తక్కువ ఖర్చుతో చేయడానికి వీలుంటుందని అన్నారు. విశాఖ తీరంలో పర్యాటకులు రావడం వల్ల ప్రాంతీయ దుకాణాలు, రెస్టారెంట్లు, హస్తకళలు లాభపడ్డాయన్నారు. ముఖ్యంగా ట్రాన్స్‌పోర్ట్, కేటరింగ్, ఆటోమొబైల్ రెంటల్స్‌కు డిమాండ్ బాగా పెరిగిందన్నారు. అనంతరం ఆర్కే బీచ్ కాళికామాత దేవాలయం నుంచి వైఎంసీఏ కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏయూ ఫైన్ ఆర్ట్స్ విద్యార్థులు, ఎస్ఎస్ఆర్ కంపెనీ, సోమాని ఇస్పత్ సహకారంతో రూపొందించిన సైకత శిల్పం ఆకట్టుకొంది. కార్యక్రమంలో జిల్లా పర్యాటక అధికారి జె.మాధవి, డిప్యూటీ అసిస్టెంట్ కమిషనర్ శ్రీనివాసరావు, హోటల్ అసోసియేషన్ ప్రెసిడెంట్ పవన్ కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.


బీచ్ రోడ్డులో ర్యాలీ ప్రారంభిస్తున్న జేసీ కె.మయూర్‌అశోక్, పాల్గొన్న అధికారులు

ఘనంగా వైట్‌కన్ డే



ర్యాలీ ప్రారంభిస్తున్న కార్పొరేటర్ మంగవేణి

ఎంవీపీ కాలనీ, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : ఎంవీపీ కాలనీ తొమ్మిదో సెక్టరులో ఉన్నరైజింగ్ హెలెన్ కిల్లర్ విజువల్లీ చాలెంజ్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో బుధవారం 62వ వైట్‌కన్ డే (అంధుల కోసం స్టిక్ కనుగొన్న రోజు) కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఎంవీపీ కాలనీ సర్కిల్ నుంచి రెండు వందల మంది అంధులతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా 18వ వార్డు కార్పొరేటరు గొలగాని మంగవేణి విచ్చేసి జెండా ఊపి ర్యాలీ ప్రారంభించారు. వైట్‌కన్ అనేది అంధుల చేతిలో కర్ర మాత్రమే కాదని, అది వారికి స్వేచ్ఛా స్వాతంత్ర్యంతో పాటు ధైర్యాన్ని, విశ్వాసాన్ని పెంపొందిచేదని వక్తలు పేర్కొన్నారు. డీఎల్‌బీ స్కూల్1999 బ్యాచ్ ఆధ్వర్యంలోని హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థ, విశాఖ రాబిన్‌హుడ్ ఆర్మీ, ఎంవీపీ సాయిరాం భజన మండలి సహకారంతో వైట్‌కన్స్, ఫైల్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో బి.రమణ, భీమారావు, అమ్మినాయుడు, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

శ్మశాన వాటికలో ప్రహరీ గోడ నిర్మాణానికి శంకుస్థాపన

ఆరిలోవ, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 10వ వార్డులో జాతీయ రహదారికి అనుకొని మసీదు వద్ద గల ముస్లిం శ్మశాన వాటికలో కాంపౌండ్ వాల్ నిర్మాణనిమిత్తం బుధవారం వెలగపూడి రామకృష్ణ బాబు కార్పొరేటర్ మద్దిల రామలక్ష్మితో కలిసి శంకుస్థాపన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వెలగపూడి మాట్లాడుతూ సుమారు రూ.18 లక్షల జీవీఎంసీ నిధులతో ఇక్కడ గోడ నిర్మాణం చేపట్టనున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో జోనల్ కమిషనర్ కనకమహాలక్ష్మి, జీవీఎంసీ డీఈ, ఏఈలు, టీడీపీ 10వ వార్డు అధ్యక్షుడు గాడు అప్పలనాయడు, బీజేపీ 10వ వార్డు అధ్యక్షుడు దొంతల రమణ, పలువురు ముస్లిం నాయకులు పాల్గొన్నారు.


శంకుస్థాపన నిర్వహిస్తున్న ఎమ్మెల్యే వెలగపూడి, కార్పొరేటర్ రామలక్ష్మి

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

ఆరిలోవ, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : ఆరిలోవ విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో గల ఆరిలోవ నుంచి పాత డెయిరీ ఫారం సబ్ స్టేషన్ వరకు 33 కేవీ యూజీ కేబుల్ చార్జింగ్ నిమిత్తం లైన్ క్లియరెన్స్ పనులు చేపడతున్నట్టు జోన్-3 ఆపరేషన్స్ విభాగం ఈఈ బి.సింహాచలంనాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. దీంతోగురవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని చెప్పారు. గాంధీ నగర్, తోటగరువు, అన్నానగర్, బీటీఆర్ నగర్, గణబాబు నగర్, బాలాజీనగర్, పాత ఆరిలోవ, చినగదిలి, పెదగదిలి, సంతపాలెం, సాయి బాబా గుడి ప్రాంతం, నేతాజీనగర్ ప్రాంతాల్లో సరఫరా ఉండదన్నారు.

విభజన హామీలు అమలు కోరుతూ ఏఐవైఎఫ్ ఆందోళన

సిరిపురం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): ఏపీకి ప్రత్యేక హోదా, విభజన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ అఖిలభారత యువజన సమైక్య (ఏఐవైఎఫ్)ఆధ్వర్యంలో బుధవారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు పరుచూరి రాజేంద్రబాబు, యుగంధర్ మాట్లాడుతూ ఏపీకి విభజన హామీలు అమలును కేంద్ర ప్రభుత్వం పూర్తిగా మరిచిపోయిందన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి తలమానికంగా నిలిచిన స్టీల్‌ప్లాంటును కార్పొరేట్ కంపెనీలకు కట్టబెట్టేందుకు ఎన్డీఏ ప్రభుత్వం ప్రయత్నిస్తుందన్నారు. 42 విభాగాలను ప్రైవేటు వ్యక్తులకు కట్టబెడుతూ, ఇక్కడ పనిచేస్తున్న కార్మికులను తొలగిస్తున్నారన్నారు. స్టీల్‌ప్లాంటును ఆదుకుంటామని చెబుతూనే, దశల వారీగా దీన్ని ప్రైవేటుపరం చేసే రీతిలో కేంద్ర ప్రభుత్వ చర్యలు ఉన్నాయన్నారు. దీనిపై కూటమి ప్రభుత్వం గట్టిగా వ్యతిరేకించాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్రం నుంచి ఎన్నికైన ఎంపీలు స్టీల్‌ప్లాంటు విషయంలో కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలన్నారు. రాష్ట్రంలో వైద్య కళాశాలలను పీపీపీ విధానంలో ప్రైవేటు వ్యక్తులకు అప్పగించాలనే ఆలోచన కూటమి ప్రభుత్వం విరమించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ నాయకుడు కె.శ్రీనివాస్, జిల్లా అధ్యక్షుడు వై.రాంబాబు, సందీప్, శివ, నాగరాజు, మధు, రమణ తదితరులు పాల్గొన్నారు.



ఆందోళన నిర్వహిస్తున్న ఏఐవైఎఫ్ ప్రతినిధులు

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి తీవ్ర గాయాలు

ఎంవీపీ కాలనీ, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : ఆగి ఉన్న లారీని టాటా ఏస్ వాహనంతో ఢీకొట్టడంతో ముగ్గురు యువకులు తీవ్ర గాయాలపాలై, అపస్మారక స్థితిలో చికిత్స పొందుతున్నారు. ఎంవీపీ పోలీస్ స్టేషన్ ఏఎస్ఐ జి.సత్యం తెలిపిన వివరాలలా ఉన్నాయి. అక్కయ్యపాలెం వద్ద ఓ సంస్థలో ఎల్ఈడీ టెక్నిషియన్లుగా పని చేస్తున్న లబాన శ్రీకాంత్ (27), లబాన సింహాద్రి (23), మేకమల్ల స్వరాజ్ (26) ఈ నెల 14న తెల్లవారు జామున నాలుగు గంటల సమయంలో టాటా ఏస్ గోల్డ్ వాహనంలో టిఫిన్ చేయడానికి నగరంలోకి ప్రయాణిస్తుండగా, మద్దిలపాలెం భారత్ పెట్రోలియం బంకు సమీపంలోకి వచ్చేసరికి ఆగి ఉన్న లారీని వేగంగా ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో ముగ్గురూ తీవ్ర గాయాల పాలై అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయారు. కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

ఆరోగ్య ఆంధ్రపదేశ్ లక్ష్యంతో సఖీ సురక్షా

పెదవాల్తేరు, అక్టోబరు 15 (ఆంధ్ర జ్యోతి) : ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ లక్ష్యం దిశగా రాష్ట్రం ముందుకు సాగుతోందని , మహిళల ఆరోగ్య పరిరక్షణ కోసమే సఖీ సురక్షా అమలు చేస్తున్నట్టు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు పేర్కొన్నారు. బుధవారం పెదవాల్తేరు చేపల మార్కెట్ వద్ద గల కల్యాణమండపంలో సఖీ సురక్షా వైద్య పరీక్షల శిబిరాన్ని జీవీఎంసీ యూసీడీ విభాగం ప్రాజెక్టు డైరెక్టర్ సత్యవేణితో కలిసి ఆయన ప్రారంభించారు. అనంతరం సఖీ సురక్షా కేక్‌ను కట్ చేసి మహిళలకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో చోడే వెంకట పట్టాభిరామ్, గేదెలనాగరాజు, బైరెడ్డి పోతన్న రెడ్డి, కాళ్ల శంకర్, పీతల అమరేంద్ర, స్వయం సహాయక సంఘం మహిళలు పాల్గొన్నారు.

'రహదారుల అభివృద్ధిపై దృష్టి సారించాలి'

సిరిపురం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : మాస్టర్‌ప్లాన్‌లో భాగంగా చేపడుతున్న రహదారుల అభివృద్ధి పనులపై ప్రత్యేక దృష్టి సారించి, వాటి నిర్మాణాలను సకాలంలో పూర్తి చేసేలా శ్రద్ధ తీసుకోవాలని వీఎంఆర్‌డీఏ చైర్మన్ ఎంవీ ప్రణవ్‌గోపాల్ పేర్కొన్నారు. బృహత్తర ప్రణాళిక రహదారుల పనుల పురోగతిపై అధికారులు, పనులు చేస్తున్న కాంట్రాక్టర్లతో బుధవారం వీఎంఆర్‌డీఏ సమావేశ మందిరంలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ప్రణవ్‌గోపాల్ మాట్లాడుతూ భోగాపురం విమానాశ్రయాన్ని సాధ్యమైనంతత్వరగా అందుబాటులోకి తీసుకురావాలనే కృతనిశ్చయంతో ఉన్న ముఖ్యమంత్రి చంద్ర బాబు, విద్యాశాఖ మంత్రి లోకేష్ ఉన్నారని, ఇందుకనుగుణంగా రహదారుల అనుసంధానం జరుగాలన్నారు. జీవీఎంసీతో సమన్వయం చేసుకొని, టీడీఆర్‌లను సత్వరమే జారీ చేసి, వాటిని సంబంధిత లబ్ధిదారులకు అందజేసేలా అధికారులు శ్రద్ధ తీసుకోవాలన్నారు. అదనపు కమిషనర్ రమేశ్, కార్యదర్శి మురళి కృష్ణ, ప్రధాన ఇంజనీర్ వినయ్ కుమార్, ఎస్టేట్ అధికారి దయానిధి, ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

రైల్వే స్టేషన్‌లో 5 కిలోల గంజాయి పట్టివేత

విశాఖపట్నం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): రైల్లో గంజాయి రవాణా చేస్తున్న వ్యక్తిని ఆర్పీఎఫ్, జీఆర్పీ సిబ్బంది పట్టుకుని వారి నుంచి రూ.25 వేల విలువైన ఐదు కిలోల గంజాయి బ్యాగ్‌లను స్వాధీనం చేసుకున్నారు. బుధవారం ప్లాట్‌ఫామ్‌లపై తనిఖీలు నిర్వహిస్తున్న సమయంలో ఒడిశాకు చెందిన దేవేందర్ ఖోస్లా (42) గంజాయి రవాణా చేస్తూ పట్టుబడ్డారు. నిందితుడిపై కేసు నమోదు చేసి కోర్టుకు తరలించినట్టు రైల్వే పోలీసులు తెలిపారు.

22వ వార్డులో టీడీపీ 'గూగుల్' సంబరాలు


కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకుంటున్న టీడీపీ నాయకులు

మద్దిలపాలెం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : నగరానికి గూగుల్ డేటా సెంటర్ రాకతో ఐటీ అభివృద్ధి గణనీయంగా పెరుగుతుందని టీడీపీ పార్లమెంటరీ కమిటీ ఉపాధ్యక్షుడ బొట్టా వెంకటరమణ పేర్కొన్నారు. విశాఖలో గూగుల్ డేటా సెంటర్ ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వానికి, గూగుల్ సంస్థకు ఒప్పందం జరిగిన నేపథ్యంలో బుధవారం జీవీఎంసీ 22వ వార్డు మంగాపురం కాలనీలో టీడీపీ శ్రేణులు సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా వెంకటరమణ మాట్లాడుతూ గూగుల్ సంస్థ నగరానికి వస్తే మరెన్నో ఐటీ కంపెనీలు ఇక్కడకు రావడానికి ఆసక్తి చూపుతాయన్నారు. దీనివల్ల నగరం ఐటీ పరంగా అభివృద్ధి చెందడమే కాకుండా ఎంతో మంది యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. బెంగళూరు, హైదరాబాద్ తదితర నగరాలకు వెళ్లే అవసరం లేకుండా ఉత్తరాంధ్ర యువతకు విశాఖ ఉద్యోగ హబ్‌గా తయారవుతుందనడంలో ఎలాంటి సందేహం లేదన్నారు. కార్యక్రమంలో టీడీపీ వార్డు అధ్యక్షుడు కోడిబోయినఆనంద్, కార్యదర్శి మళ్ల రవికుమార్, దువ్వి స్వామి, ఒమ్మి అప్పారావు, దువ్వి రాజ్‌కుమార్, పండు, సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

పోలమాంబ అమ్మవారి హుండీ ఆదాయం రూ.8 లక్షలు

పెదవాల్తేరు, అ క్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : పెదవాల్తేరులోని కరక చెట్టు పోలమాంబ అమ్మవారి దేవస్థానంలో దేవదాయ, ధర్మాదాయశాఖ పర్యవేక్షణ అధికారి, లాసన్స్ బే కాలనీలో శ్రీవెంకటేశ్వరస్వామి దేవాలయం కార్యనిర్వహణాధికారి కె.ఆదినారాయణ, ఈవో గాయత్రి అధ్వర్యంలో బుధవారం హుండీ లెక్కించారు. 86 రోజులకు హుండీ ఆదాయం రూ.8,02,932 వచ్చినట్లు ఆలయ ఈవో గాయత్రి తెలిపారు. పెదవాల్తేరు గ్రామ సేవా సంఘం అధ్యక్షుడు బి.తవిటి రెడ్డి, పోలీసులు, బ్యాంకు సిబ్బంది, అర్చకులు, ఆలయ సిబ్బంది తదిరతులు పాల్గొన్నారు.

టూ వీలర్ సర్వీస్ టెక్నీషియన్ కోర్సులో ఉచిత శిక్షణ

కంచరపాలెం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో టూవీలర్ సర్వీస్ టెక్నీషియన్ కోర్సులో ఉచిత శిక్షణను అందించనున్నారు. మూడు నెలల పాటు అందించనున్నఈ శిక్షణకు పదో తరగతి పాసైన నిరుద్యోగ అభ్యర్థులు అర్హులు. శిక్షణ అనంతరం ఉద్యోగావకాశాలు కూడా కల్పించనున్నారు. అభ్యర్థులకు శిక్షణ ఈ నెల 23 నుంచి ప్రారంభం కానున్నదని స్కిల్ హబ్ కో-ఆర్డినేటర్ డి.రామకృష్ణ పేర్కొన్నారు. మరిన్ని వివరాల కోసం ఫోన్ : 9948768778లో సంప్రదించాలని కోరారు.

మాలతి ఆర్పీ కాదు

» స్పష్టం చేసిన సీవో ధనలక్ష్మి

అక్కయ్యపాలెం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : గ్రేటర్ విశాఖ 42వ వార్డు అక్కయ్యపాలెం సంగం ఆఫీస్ సమీపంలో జి.మాలతి అనే ఆమె జీవీఎంసీ ఆర్పీ కాదని సీవో ధనలక్ష్మి స్పష్టంచేశారు. మాలతి ఆర్పీగా చలామణి అవుతున్నారని శ్రీకనకమహాలక్ష్మి పొదుపు సంఘం సభ్యులు ఫిర్యాదు చేశారని, ఆమెకు పొదుపు సంఘాలకు ఎటువంటి సంబంధం లేదన్నారు. మాలతి 12 పొదుపు సంఘాల గ్రూప్‌లను తయారు చేసి బ్యాంకు ఖాతాలు తెరిచారన్నారు. కానీ ఆ సంఘాల బ్యాంకు పుస్తకాలు ఆమె దగ్గర లేకుండా ఎవరి పుస్తకాలు వారి దగ్గరే ఉన్నాయని చెప్పారు.

'రైళ్లలో బాణసంచా తరలిస్తే కఠిన చర్యలు'

విశాఖపట్నం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): రైల్లో బాణ సంచా, ఫైర్ క్రాకర్‌తోపాటు మండే వస్తువులు రవాణా చేయడం నేరమని వాల్తేరు రైల్వే అధికారులు తెలిపారు. దీపావళి పండుగను పురస్కరించుకుని రైళ్లలో క్రాకర్లు, బాణసంచా, ఇతర మండే వస్తువులు తీసుకువెళ్లకుండా నిరోధించేందుకు వాల్తేరు డివిజన్ ప్రత్యేక భద్రతా చర్యలు చేపట్టినట్లు తెలిపారు. దీనిలో భాగంగా స్టేషన్లలో, రైళ్లలో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశామన్నారు. ఎప్పటికప్పుడు ఆకస్మిక తనిఖీలు చేపట్టి నిబంధనలు ఉల్లంఘిస్తే రైల్వే చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. దీపావళి పండుగ జరుపుకోవడానికి స్వగ్రామాలకు వెళ్లేవారు వెంట బాణసంచా తీసుకువెళ్లి ఇబ్బందులు తెచ్చుకోవద్దని,ప్రయాణికుల భద్రతకు తీవ్ర ప్రమాదం ఏర్పడే అవకాశముందని సూచించారు. ప్రయాణికుల భద్రతను దృష్టిలో ఉంచుకొని ప్రత్యేక తనిఖీలతోపాటు నిరంతర నిఘా ఏర్పాటు చేశామన్నారు. రైళ్లలోనేకాకుండా స్టేషన్‌లో ప్లాట్‌ఫామ్‌లపై నిషేధిత వస్తువులతో కనిపిస్తే చర్య తప్పదన్నారు. పార్శిల్ సర్వీసు ద్వారా రవాణా అయ్యే లగేజీలను క్షుణ్ణంగా తనిఖీ చేస్తామన్నారు.ప్రయాణికులు అప్రమత్తంగా ఉండి రైళ్లు, స్టేషన్లలో అనుమానాస్పదంగా కనిపిస్తే భద్రతా సిబ్బందికి సమాచారం అందించి సహకరించాలని కోరారు.

నగర పరిశుభ్రతపై షీ టీమ్స్ నిరంతర నిఘా

» పరిశుభ్రత, సుందరీకరణ, అభివృద్ధే ప్రాధాన్య అంశాలు
» నగర వాసుల సహకారం అవసరం
» జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్



వెంకోజీపాలెం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : విశాఖ నగర పరిశుభ్రత, సుందరీకరణ, అభివృద్ధే ప్రాధాన్యంగా జీవీఎంసీ ప్రత్యేక కార్యాచరణ చేపట్టినట్టు గ్రేటర్ విశాఖ కమిషనర్ కేతన్ గార్గ్ ఒక ప్రకటన ద్వారా తెలిపారు. ఈ నేపథ్యంలో బహిరంగ ప్రదేశాల్లో వ్యర్థాలను పారబోసే వారిని గుర్తించేందుకు నగరంలో 'షీ' (శానిటేషన్ అండ్ హెల్త్ ఎన్‌ఫోర్స్‌మెంట్) టీమ్స్ నిరంతర నిఘాతో పని చేస్తున్నాయని, పరిసర పరిశుభ్రతకు, పర్యావరణ పరిరక్షణకు నగర ప్రజలు సహకరించాలని జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ కోరారు. విశాఖ నగర పరిశుభ్రతకు, పర్యావరణానికి, సుందరీకరణకు, ఆహ్లాద వాతావరణానికి భంగం కలిగించేలా విశాఖ నగరంలో గల పలు వ్యాపారస్తులు, వాణిజ్య సముదాయాలు, నివాసితులు, సందర్శకులు బహిరంగ ప్రదేశాలు, కాలువలు, రోడ్లు, ఫుట్‌పాత్‌లపై తమ వ్యర్థాలను పారవేస్తూ పరిసరాలను నిత్యం అశుభ్రపరచడం జీవీఎంసీ గమనిస్తూ వాటి నియంత్రణకు ఇప్పటికే ఏర్పాటు చేసి 'షీ' టీమ్స్ ద్వారా ప్రత్యేక నిఘాను నగరమంతా ఏర్పాటు చేశామన్నారు. అలాగే బీచ్ పరిసరాల్లో ఉన్న వ్యాపారస్తులు బీచ్‌కు వచ్చే సందర్శకులు, విహారయాత్రికులకు అవగాహన కల్పించేందుకు బీచ్ తీర ప్రాంతాల్లో వ్యర్థాలను పారవేసి పరిసరాలు, అశుభ్రపరుస్తూ సముద్ర జలాల కలుషితానికి కారకులవుతున్నారన్నారు. అందుకే జీవీఎంసీ నగరంలో ఏర్పాటు చేసిన 'షీ' టీమ్స్ నిరంతర నిఘా ద్వారా అతిక్రమించిన వ్యర్థాలను పారవేసే వ్యాపారస్తులు, వాణిజ్య సముదాయాలను గుర్తించి రూ.1000 జరిమానాతో పాటు వారి వ్యాపార లైసెన్సులను రద్దు చేయడం, అలాగే కాలనీలు, రోడ్లు, బహిరంగ ప్రదేశాలు, కాలువలు, ఫుట్‌పాత్‌లపై వ్యర్థాలు పారవేసే వారిపై రూ.500 జరిమానా విధింపు ప్రక్రియను చేపట్టామన్నారు. ప్రజల ఆరోగ్య పరిరక్షణ దిశగా నగరంలో గల పలు హోటళ్లు, రెస్టారెంట్లు, ఆహారం విక్రయించే స్టాళ్లు, వంటశాలలపై జీవీఎంసీ 'షీ' టీమ్స్ తనిఖీలు నిర్వహించి అపరిశుభ్రమైన ఆహారాన్ని, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువులను స్వాధీన పరుచుకుని జరిమానాలను విధించి, అతిక్రమించిన వ్యాపారాల లైసెన్సులను కూడా రద్దు చేయడం ఇప్పటికే జరుగుతోందన్నారు. ఆ దిశగా నగర పరిసరాల పరిశుభ్రతను మరింత పటిష్ట పరిచేందుకు ఈ 'షీ' టీమ్స్ నగరంలో నిరంతర నిఘాతో పరిశీలిస్తున్నాయన్నారు.

నగరంలో అంతర్జాతీయ భాగస్వామ్య సదస్సు, అంతర్జాతీయ ఫ్లీట్ రివ్యూ కార్యక్రమాలు జరగనున్న నేపథ్యంలో మహా విశాఖ నగరాన్ని మరింత అభివృద్ధి పరుస్తూ... సుందరంగా, పచ్చదనం, విద్యుత్ కాంతులతో అందరినీ ఆకర్షించేలా తీర్చిదిద్దే కార్యక్రమాలను జీవీఎంసీ పూర్తి చేస్తోందన్నారు. కాబట్టి వ్యాపారస్తులు, వాణిజ్య సముదాయాల నిర్వాహకులు, కాలనీవాసులు, నివాసితులు తమ వద్ద రోజు ఉత్పత్తి అయ్యే వ్యర్థాలను బహిరంగ ప్రదేశాలు, రోడ్లు, కాలువలు, ఫుట్‌పాత్‌లపై పారవేయకుండా, జరిమానాలతో వ్యాపార లైసెన్సుల రద్దులకు గురి కాకుండా రోజూ తమ వద్దకు వచ్చే జీవీఎంసీ వాహనాలకు వ్యర్థాలను వేరు చేసి అందించాలని సూచించారు. విశాఖ నగరాన్ని మరింత అభివృద్ధి పరుస్తూ సుందరంగా తీర్చిదిద్దుతూ అతిధులను, పర్యాటకులను, విదేశీయులు, విహారయాత్రికులను ఆకర్షించేలా జీవీఎంసీ చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలకు, పరిసరాల పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణకు నగర ప్రజలు, వ్యాపారస్తులు సహకరించాలని కమిషనర్ విజ్ఞప్తి చేశారు.

ట్రాక్ మెయింటెనర్స్ సమస్యలపై శ్రామిక్ యూనియన్ ధర్నా



మహా ధర్నా నిర్వహిస్తున్న తూర్పు కోస్తా రైల్వే శ్రామిక్ యూనియన్ నేతలు, ప్రతినిధులు

విశాఖపట్నం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : రైళ్ల కార్యకలాపాలకు వెన్నుముకగా నిలిచే ట్రాక్ మెయింటెనర్ల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ తూర్పు కోస్తా రైల్వే శ్రామిక్ యూనియన్ బుధవారం మహా ధర్నా నిర్వహించింది. వాల్తేరు డివిజన్ కార్యాలయం వద్ద జరిగిన ఈ ధర్నాలో డివిజనల్ కో-ఆర్డినేటర్ పీఆర్ఎం రావు మాట్లాడుతూ ట్రాక్ మెయింటైనర్ల సమస్యల పరిష్కారంలో యాజమాన్యం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని, రైళ్ల రాకపోకలు సురక్షితంగా జరగడంలో కీలక బాధ్యతలు నిర్వర్తిస్తున్న ట్రాక్ మెయింటైనర్లను వివిధ రకాలుగా వేధించడం అమానుషమని ఆవేదన వ్యక్తం చేశారు. దరిమిలా ట్రాక్ మెయింటైనర్ల పెట్రోలింగ్ పనుల పరిధిని 20 కిలోమీటర్ల నుంచి 12 కిలోమీటర్లకు తగ్గించాలని, అర్హులైన ట్రాక్ మెయింటైనర్ల కెరీర్ మెరుగుపడేందుకు 10 శాతం కోటా కల్పించాలని డిమాండ్ చేశారు. అలాగే పరిమిత విభాగ పోటీ పరీక్ష (ఎల్‌డీసీఈ), జనరల్ విభాగ పోటీ పరీక్షలలో (జీడీసీఈ) అవకాశం కల్పించాలని, రైల్వే బోర్డు మార్గదర్శకాల ప్రకారం సేఫ్టీ కిట్స్ పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం డీఆర్ఎంకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో శ్రామిక్ యూనియన్ నాయకులు, బ్రాంచి కార్యదర్శులు, కార్మికులు పాల్గొన్నారు.

పలు రైళ్లకు అదనపు కోచ్‌లు

విశాఖపట్నం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని సంత్రాగచ్చి-యశ్వంత్‌పూర్ ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైలుకు (02863) ఈ నెల 16న ఒక థర్డ్ ఏసీ కోచ్, రౌర్కెలా-జగదల్‌పూర్ ఎక్స్‌ప్రెస్‌కు (18107) ఈ నెల 18న ఒక స్లీపర్ క్లాసు కోచ్ జత చేస్తున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు.

పోర్టు, డిఎల్‌బి పెన్షనర్లకు పెరిగిన అలవెన్సు

మాధవధార, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) ; పోర్టు పెన్షనర్లు, డిఎల్‌బి పెన్షనర్లకు అక్టోబరు నెల నుంచి డి.ఎ పెరిగిందని హార్బర్ అండ్ పోర్ట్ పెన్షనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు చౌదరి అప్పారావు పేర్కొన్నారు. అసోసియేషన్ అధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఈ మేరకు సభ్యులకు దీపావళి పండుగ సంధర్బంగా తీపి కబురు చెప్పారు. ఉద్యోగుల్లో క్లాస్ 1, క్లాస్ 2 కేటగిరీల వారికి 52 శాతం, క్లాస్ 3, 4 కేటగిరీల వారికి 18శాతం పెన్షను పెరిగిందని అన్నారు. పెరిగిన మేరకు పించను మొత్తాన్ని 2025 అక్టోబరు 1వతేదీ నుంచి దశల వారీగా చెల్లిస్తారని అన్నారు. 31-12-2025 తేదీ వరకు నెలవారీ పెన్షనులోనే పెరిగిన డిఎ మొత్తం అందుతుందని తెలియజేసారు.

సాహిత్య విమర్శకు మార్గదర్శి కట్టమంచి

సీతంపేట, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : ముసలమ్మ మరణం, నవయామిని, పంచమి, వ్యాసమంజరి, అర్థశాస్త్రం మొదలైన గ్రంథాలు రాసి, తెలుగు సాహితీ రంగంలో తనకంటూ ప్రత్యేకమైన విశిష్ట స్థానాన్ని కట్టమంచి రామలింగారెడ్డి ఏర్పర్చుకున్నారని, సాహిత్య విమర్శకు మార్గదర్శిగా నిలిచారని ఆంధ్ర విశ్వవిద్యాలయం విశ్రాంత ఆచార్యుడు ఆచార్య వెలమల సిమ్మన్న పేర్కొన్నారు. సీతంపేట రాజేంద్రనగర్‌లో సహృదయ సాహితి సంస్థ ఆధ్వర్యంలో 'బహుముఖ ప్రజ్ఞాశాలి కట్టమంచి' అనే అంశంపై ప్రసంగ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ముందుగా తుదిశ్వాస విడిచిన ప్రముఖ రచయిత కవి 101 సంవత్సరాలు జీవించిన రాచకొండ నరసింహశర్మ మరణానికి సభలో మౌనం పాటించి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆచార్య వెలమల సిమ్మన్న మాట్లాడుతూ కవిత్వ విచారం అనే విమర్శనా గ్రంథంతో అభినవ విమర్శనా మార్గదర్శి అయ్యారన్నారు. కార్యక్రమంలో డాక్టర్ కేజీ వేణు, డాక్టర్ డీవీ సూర్యారావు, సీహెచ్ చినసూర్యనారాయణ, ఉప్పల అప్పలరాజు, చల్లా రాంబాబు, కె.భీమేశ్వరరావు, పరమేశ్వర రావు, డీఎస్ కుమార్, ఆర్.శివాజీ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూకేటాయింపు విధానాన్ని సవాల్ చేస్తాం

» 'సత్త్వ' పిల్ సవరణకు అనుమతి కోరిన పిటిషనర్
» హైకోర్టు అంగీకారం.. విచారణ 2 వారాలకు వాయిదా

అమరావతి, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): విశాఖలో సత్త్వ డెవలపర్స్‌కు భూకేటాయింపును సవాల్ చేస్తూ దాఖలైన ప్రజాప్రయోజన వ్యాజ్యం(పిల్)పై బుధవారం హైకోర్టు విచారణ జరిపింది. పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది పొన్నవోలు సుధాకర్‌రెడ్డి స్పందిస్తూ.. భూకేటాయింపు కోసం ప్రభుత్వం తీసుకొచ్చిన పాలసీని సవాల్ చేస్తూ పిల్‌ను సవరించేందుకు అనుమతించాలని కోరారు. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ చీమలపాటి రవితో కూడిన ధర్మాసనం అందుకు అంగీకరించి.. విచారణను రెండు వారాలకు వాయిదా వేసింది. విశాఖపట్నం పరిధిలోని మధురవాడ ఐటీ హిల్ నంబర్ 4 వద్ద 30 ఎకరాలను సత్త్వ డెవలపర్స్ ప్రైవేట్ లిమిటెడ్‌కు కేటాయిస్తూ.. రాష్ట్ర ఐటీ-ఎలక్ట్రానిక్స్-కమ్యూనికేషన్ల శాఖ ఈ ఏడాది ఆగస్టు 1న జారీ చేసిన జీవో 27ని సవాల్ చేస్తూ విశాఖకు చెందిన మేడపాటి వెంకటరెడ్డి పిల్ దాఖలు చేశారు. వివిధ సంస్థలకు చేసే భూకేటాయింపునకు టెండర్/ఆక్షన్ విధానాన్ని అనుసరించేలా ప్రభుత్వానికి మార్గదర్శకాలు జారీ చేయాలని.. 2023లో ఏపీఐఐసీ తీసుకొచ్చిన నిబంధనలను అనుసరించి లీజు విధానంలో ఏపీఐఐసీ, ఎస్ఐపీబీ ద్వారా భూకేటాయింపులు జరిపేలా ఆదేశాలివ్వాలని కోరారు. సంబంధిత జీవోను రద్దు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ పిల్ బుధవారం విచారణకు రాగా ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది (ఎస్‌జీపీ) ఎస్.ప్రణతి వాదనలు వినిపిస్తూ... వివిధ కంపెనీలు/సంస్థలకు భూకేటాయిం పులను సవాల్ చేస్తూ ఇప్పటికే ప్రజాహిత వ్యాజ్యాలు దాఖలయ్యాయని కోర్టు దృష్టికి తీసుకొచ్చారు. ధర్మాసనం స్పందిస్తూ... భూకేటాయింపుల కారణంగా పెద్ద సంస్థలు పెట్టుబడులు పెట్టేందుకు ముందుకొస్తున్నాయి కదా! అని ప్రశ్నించింది. పొన్నవోలు బదులిస్తూ.. అభివృద్ధికి తాము వ్యతిరేకం కాదని, భూకేటాయింపులు జరుగుతున్న విధానాన్ని మాత్రమే వ్యతిరేకిస్తున్నామన్నారు. ప్రభుత్వం తీసుకొచ్చిన భూకేటాయింపు పాలసీని సవాల్ చేస్తామని.. పిటిషన్‌లో సవరణకు అనుమతించాలని కోరారు.

నడిరోడ్డుపై వివాహిత హత్య

... 7వ పేజీ తరువాయి



ఘటనా స్థలంలో విచారిస్తున్న పోలీసులు

స్వల్ప వాగ్వాదం జరిగింది. సాయంత్రం 5.15 గంటల సమయంలో శ్రావణ సంధ్యారాణి వాకింగ్‌కు వెళ్లేందుకు ఇంటి నుంచి బయలుదేరింది. కొద్దిఅడుగుల దూరం వెళ్లేసరికి కొండమ్మ అనే మహిళ ఎదురు పడడంతో ఆమెతో మాట్లాడుతోంది. ఇంతలో వెనుక నుంచి వచ్చిన శ్రీనివాసరావు పదునైన ఆయుధంతో శ్రావణ సంధ్యారాణి మెడ కోసేశాడు. దీంతో ఆమె తీవ్రరక్తస్రావంతో అక్కడికక్కడే కుప్పకూలిపోయింది. సంధ్యారాణితో మాట్లాడుతున్న మహిళ గట్టిగా కేకలు పెట్టింది. స్థానికులు అక్కడకు వచ్చేసరికి శ్రీనివాసరావు పరారైపోయాడు. స్థానికులు డయల్ 100కి ఫోన్ చేసి సమాచారం ఇవ్వడంతో ఫోర్త్ టౌన్ సీఐ సీహెచ్ ఉమాకాంత్ అక్కడకు చేరుకుని 108కి ఫోన్ చేశారు. 108 సిబ్బంది వచ్చి పరిశీలించగా ఆమె అప్పటికే మృతిచెందినట్టు నిర్ధారించారు. క్లూస్‌టీమ్‌ను రప్పించి ఘటనాస్థలంలో ఆధారాలు సేకరించారు. అనంతరం మృతదేహాన్ని కేజీహెచ్‌కు తరలించారు. నిందితుడు శ్రీనివాసరావును అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. సంధ్యారాణికి ఒక సోదరుడు ఉన్నప్పటికీ అతను అనారోగ్యంతో బాధపడుతున్నట్టు తెలిసింది. తమ అనేవారు ఎవరూ లేకపోవడంతో బుద్ధిమాంద్యం కలిగిన ఇద్దరు కవలల పరిస్థితి ఏమిటనేది అగమ్యగోచరంగా మారింది. వారిని తండ్రి వద్దకు చేర్చేలా పోలీసులు చొరవ తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

నత్తనడకన ఇళ్ల నిర్మాణం

... 7వ పేజీ తరువాయి

చిన్నపాటి వ్యాపారుల నుంచి ఒత్తిడి పెరిగింది. ఇటీవల జిల్లా హౌసింగ్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో కాంట్రాక్టర్లు ఇదే విషయాన్ని ప్రస్తావించారు. బిల్లులు మంజూరుకాకుంటే పనులు చేపట్టలేమని స్పష్టంచేశారు. ఇసుక సరఫరా ఇప్పటికే నిలిచిపోయిందని, సిమెంట్, ఇనుము కూడా రావడం లేదని కొందరు కాంట్రాక్టర్లు ప్రస్తావించారు. కాంట్రాక్టర్ల వాదనతో ఏకీభవించిన అధికారులు...బిల్లుల విషయం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళతామని హామీ ఇచ్చారు.

15 నెలలు.. 8,54,913 ఈ-చలాన్‌లు

... 7వ పేజీ తరువాయి

డ్రంకన్ డ్రైవ్, డేంజరస్ డ్రైవింగ్, రాంగ్‌రూట్‌లో ప్రయాణించే వారి ఫొటోలు తీసి ఈ-చలాన్ జారీచేయడం ప్రారంభించారు. అంతటితో సరిపెట్టేయకుండా, వాటిని క్లియర్ చేయించేందుకు ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ల వారీగా టార్గెట్‌లు విధించారు. దీంతో ఈ-చలాన్‌ల సంఖ్యతోపాటు, జారీచేసిన ఈ-చలాన్‌లలో క్లియర్ అయిన వాటి సంఖ్య కూడా పెరిగింది. నగరంలో గత ఏడాది జూలైలో 79,131 ఈ-చలాన్‌లు జారీచేస్తే వాటిలో 36,453 చలాన్‌లను కట్టించారు. ఆగస్టులో 79,436 ఈ-చలాన్‌లు జారీచేసి 37,298, సెప్టెంబరులో 82,646 ఈ-చలాన్‌లు జారీచేసి 39,840, అక్టోబరులో 92,002 జారీచేసి 43,788, నవంబరులో 86,633 జారీచేసి 40,869 క్లియర్ చేయించారు. ఈ ఏడాది సెప్టెంబరు వరకు 15 నెలల్లో 8,54,913 ఈ-చలాన్‌లు ద్వారా రూ.46,40,32,101 జరిమానా విధించారు. అందులో 3,44,421 ఈ-చలాన్‌లను క్లియర్ చేసి వాహన యజమానుల నుంచి రూ.13,39,73,796 వసూలు చేశారు.ఇది రాష్ట్రంలోనే అత్యధికం కావడం విశేషం.

దుకాణాలు, రైతుబజార్ల వద్ద పార్కింగ్ చేసిన వాహనాలకు జరిమానాపై విమర్శలు

నిబంధనలు ఉల్లంఘించిన వారికి ఈ-చలాన్‌ల జారీచేయడంపై ఎలాంటి అభ్యంతరాలు లేనప్పటికీ దుకాణాలు ముందు, రైతుబజార్‌ల వద్ద పార్కింగ్ చేసిన వాహనాలకు 'డేంజరస్ పార్కింగ్' పేరుతో ఈ-చలాన్‌లు జారీచేయడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. రోడ్డుపక్కనే దుకాణాలు ఏర్పాటుచేసినా పట్టించుకోని పోలీసులు వాటికి వెనుక వైపు నిలిపే వాహనాలను ఫొటోలు తీసి ఈ-చలాన్‌లు పంపుతున్నారంటూ వాహనదారులు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. దుకాణాలు ఉండే ప్రాంతాల్లో పార్కింగ్ సదుపాయం కల్పించకుండా, అక్కడ కొనుగోలు చేసేందుకు వచ్చేవారు వాహనాలను నిలిపితే జరిమానాలు విధించడం ఎంతవరకు సమజంసమని ప్రశ్నిస్తున్నారు.

విద్యార్థుల రక్షణకు కమిటీ ఏర్పాటుపై హర్షం

డాబాగార్డెన్స్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : ఉన్నత విద్యా సంస్థల్లో విద్యార్థుల ఆత్మహత్యల నివారణకు ప్రభుత్వం 13 మందితో కమిటీని ఏర్పాటు చేయడం అభినందనీయమని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ వేదిక సలహాదారుడు నరవ ప్రకాశరావు అన్నారు. బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు.

'ది వికసిత్ భారత్ యంగ్ లీడర్స్'పై ప్రచారం

జ్ఞానాపురం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : దేశ వ్యాప్తంగా డైనమిక్ యువ నాయకులను ఎంపిక చేయడానికి జాతీయ యువజనోత్సవం 2025 కార్యక్రమంలో భాగంగా ది వికసిత్ భారత్ యంగ్ లీడర్స్ డైలాగ్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఈమేరకు జ్ఞానాపురంలోని సెయింట్ జోషఫ్ మహిళా కళాశాలలో నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో కళాశాల ఎన్ఎస్ఎస్ వలంటీర్లు బ్రోచర్స్ ద్వారా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా నెహ్రూ యువ కేంద్రం డిప్యూటీ డైరెక్టర్ మాట్లాడుతూ వికసిత్ భారత్ యంగ్ లీడర్స్ డైలాగ్ కార్యక్రమం ద్వారా యువతకు పలు అంశాలపై అవగాహన కల్పించనున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పీఓ కె. మాణిక్య కుమారి, లీలా ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

గోస్తనీ నదిలో పడి వ్యక్తి గల్లంతు

తగరపువలస, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : తగరపువలస సమీపంలోని గోస్తనీ నదిలో పడి ఓ వ్యక్తి గల్లంతయ్యాడు. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. రెండు రోజుల క్రితం పీసా త్రిమూర్తులు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. అతని దహన సంస్కరణలు నిమిత్తం వెళ్లిన తమ్మిన శ్రీను (40) నదిలో దిగి స్నానం చేస్తుండగా గల్లంతయ్యాడు. మంగళవారం సాయంత్రం ఈ సంఘటన జరిగింది. అప్పటి నుంచి పోలీసులు నదిలో గాలింపు జరుపుతున్నారు. ఇప్పటి వరకు ఆచూకీ లభించలేదు. శ్రీను తగరపువలస మెయిన్ రోడ్డులో ఉన్న ఎలక్ట్రికల్ దుకాణంలో ప్లంబర్‌గా పనిచేస్తున్నాడు. బాలాజీనగర్‌లో ఉంటున్న అతనికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. భీమిలి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నిత్యాన్న ప్రసాద పథకానికి రూ. లక్ష విరాళం

సింహాచలం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహ స్వామి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిత్యాన్న ప్రసాద పథకానికి నగరంలోని కేఆర్ఎం కాలనీవాసి బి. మాధవరావు దంపతులు రూ.లక్ష విరాళంగా సమర్పించారు. విరాళం మొత్తాన్ని నగదు రూపంలో దేవస్థానం డిప్యూటీ ఈఓ సింగం రాధ, పర్యవేక్షణాధికారి సునీల్‌కు బుధవారం వారు అందజేశారు. దాత కుటుంబ సభ్యులకు అధికారులు అంతరాలయంలో స్వామివారి దర్శనం కల్పించారు.

ప్రధాని సభకు తరలివెళ్లిన నగరవాసులు

మహారాణిపేట, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : కర్నూల్ జిల్లాలో గురువారం జరగనున్న ప్రధాని నరేంద్ర మోదీ బహిరంగ సభకు నగరం నుంచి పలువురు తరలివెళ్లారు. సూపర్ జీఎస్‌టీపై జరిగే ఈ సభకు నగరం నుంచి మూడు బస్సుల్లో పారిశ్రామికవేత్తలు, వ్యాపారులు, డీలర్లు, ఎంఎస్ఎంఈ ఇండస్ట్రీ ప్రతినిధులు వెళ్లారు.

నేటి నుంచి షాపింగ్ ఫెస్టివల్

... 7వ పేజీ తరువాయి

జె.మాధవి, జీవీఎంసీ, రెవెన్యూ, పోలీస్, సీఐఐ అధికారులు పాల్గొన్నారు.

నవంబరు 14, 15 తేదీల్లో భాగస్వామ్య సదస్సు

ఏయూ ఇంజనీరింగ్ కళాశాల మైదానంలో నవంబరు 14, 15 తేదీల్లో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా భాగస్వామ్య సదస్సు (పార్టనర్‌షిప్ సమ్మిట్) నిర్వహించనున్నట్టు జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ తెలిపారు. సమ్మిట్ జరగనున్న మైదానంలో ఏర్పాట్లను బుధవారం సాయంత్రం ఆయన పరిశీలించారు. కేంద్ర, రాష్ట్ర మంత్రులు వచ్చే మార్గాలను, ప్రతినిధులు, ప్రముఖుల వాహనాల పార్కింగ్, ట్రాఫిక్ నియంత్రణ తదితర ఏర్పాట్లపై అధికారులకు కీలక సూచనలు చేశారు.

విద్యుత్ రంగంలో ఆవిష్కరణలకు హ్యాక్‌థాన్

ఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్ ఇమ్మడి

విశాఖపట్నం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : ఏపీఈపీడీసీఎల్ స్థాపించిన సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ ఫర్ ఎనర్జీ ట్రాన్సిషన్ (సీఓఈఈటీ)క్లైమేట్ కలెక్టివ్ ఫౌండేషన్ సంయుక్తంగా విద్యుత్ రంగంలో సాంకేతిక ఆవిష్కరణలను ప్రోత్సహించేందుకు హ్యాక్‌ఏపీ హ్యాక్‌థాన్ నిర్వహించనున్నట్టు ఏపీఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్ ఇమ్మడి ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ రంగానికి సంబంధించి వాస్తవ సమస్యలకు వినూత్న సాంకేతిక పరిష్కారాలు అందించగల స్టార్టప్ సంస్థలు ఈ హ్యాక్‌థాన్‌లో పాల్గొనవచ్చన్నారు. రాష్ట్రంలో విద్యుత్తు పంపిణీ వ్యవస్థలో ఎదురవుతున్న సవాళ్లకు స్టార్టప్, డేటా ఆధారిత, ఆధునిక సాంకేతిక పరిష్కారాలు కనుగొనడం ఈ హ్యాక్‌థాన్ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ఎంపికైన స్టార్టప్‌లు తమ పరిష్కారాలను రాష్ట్ర విద్యుత్ రంగ ప్రముఖుల సమక్షంలో ప్రదర్శించే అవకాశం పొందడంతో పాటు విజేతలకు పైలట్ ప్రాజెక్టులు, మూడు డిస్కంలలో పూర్తిస్థాయిలో ప్రాజెక్టులు అమలు చేసుకునే అవకాశాలు లభిస్తాయని పేర్కొన్నారు. ప్రమాదాలను ముందుగానే గుర్తించే వ్యవస్థ, స్మార్ట్ మీటర్ల డేటా విశ్లేషణ ద్వారా ఆదాయ సంరక్షణ, ట్రాన్స్‌ఫార్మర్ ఫెయిల్యూర్ ప్రిడిక్షన్, హెచ్‌టీ లైన్లలో ఇన్సులేటర్ వైఫల్యాల గుర్తింపు,వాటి లోపాలను సురక్షితంగా గుర్తించే సాంకేతిక పరిష్కారాలను అభివృద్ధి చేయాల్సి ఉంటుందన్నారు. విద్యుత్తు రంగం, ఇంధన పరివర్తనలో శిక్షణ, పరిశోధన,సాంకేతిక మార్పులను ముందుకు తీసుకెళ్లేందుకు ఏపీఈపీడీసీఎల్ సీఓఈఈటీ స్టార్టప్‌లకు సహకార వేదికగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఈ నెల 22 అర్ధరాత్రివరకు రిజిస్ట్రేషన్లు కొనసాగుతాయని, హ్యాక్ ఏపీ హ్యాక్‌థాన్ వెబ్‌సైట్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్

డ్రగ్స్ రవాణాను నివారించాలి : కలెక్టర్

మహారాణిపేట, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో గంజాయి, ఇతర మత్తు పదార్థాల రవాణాను పూర్తిగా నివారించాలని కలెక్టర్ హరేంధిర ప్రసాద్ ఆదేశించారు. బుధవారం ఆయన తన కార్యాలయంలో సీపీ శంఖబ్రత బాగ్చితో కలిసి పలు శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు, ఈ సందర్భంగా మాట్లాడుతూ పాఠశాలలు, కళాశాలల వద్ద ఈగల్ టీమ్, ఈగల్ క్లబ్‌ల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. సీపీ మాట్లాడుతూ వ్యసన విముక్తి కేంద్రాలను బలోపేతం చేయడం, నిర్మానుష్య ప్రాంతాల్లో పొదలను తొలగించి లైట్లు ఏర్పాటు చేయాలని, అనుమానిత ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని చెప్పారు.

చేతులు పరిశుభ్రత ముఖ్యం

మహారాణిపేట, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : జిల్లా పరిషత్ కార్యాలయంలో బుధవారం వరల్డ్ హ్యాండ్ వాష్ డే నిర్వహించారు, ఈ సందర్భంగా జడ్పీ సీఈవో పి. నారాయణమూర్తి మాట్లాడుతూ ఆహారం తీసుకునే ముందు చేతులను శుభ్రం చేసుకోవడం వల్ల సగం వ్యాధులు దరి చేరవని చెప్పారు. గతంలో ఇది ఒక ఆచారంగా ఉండే దని, ప్రస్తుతం దీన్ని అలవాటుగా మార్చుకోవాలని తెలిపారు, చేతుల పరిశుభ్రతపై ప్రతిఒక్కరికి అవగాహన కల్పించాలన్నారు. అనంతరం అధికారులు చేతుల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు.

'నూతన విద్యా విధానంలో మార్పులు అవసరం'

సీతంపేట, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : నూతన విద్యా విధానం పేద, మధ్య తరగతి ప్రజలను విద్యకు దూరం చేస్తుందని ఏయూ కామర్స్ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ బి. సుబ్బయ్య అన్నారు. ద్వారకానగర్‌లోని పౌర గ్రంథాలయంలో పీడీఎస్‌ఓ విశాఖ జిల్లా మహాసభను బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెక్యులర్, ఫెడరల్, రాజ్యాంగ మౌలిక సూత్రాలకు విరుద్ధంగా విద్యా ప్రైవేటీకరణకు, కార్పొరేటీకరణకు అనుకూలంగా ఉన్న నూతన విద్యా విధానాన్ని అందరూ వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు.పీడీఎస్‌ఓ జిల్లా అధ్యక్షుడు వి. విశ్వనాథ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పీడీఎస్‌ఓ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. భాస్కర్, జిల్లా కార్యదర్శి వి. లక్ష్మి, సతీశ్ కుమార్, యు. జానకి, యమున, లక్ష్మణ్, భాగ్య, తేజ, తులసి, దుర్గాప్రసాద్, వసంత్ పాల్గొన్నారు.

ఘనంగా అబ్దుల్ కలామ్ జయంతి



కలామ్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న నాయకులు

మహారాణిపేట, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : మాజీ రాష్ట్రపతి, ప్రముఖ శాస్త్రవేత్త అబ్దుల్ కలామ్ జయంతి టీడీపీ కార్యాలయంలో బుధవారం ఘనంగా నిర్వహించారు, ముస్లిం మైనారిటీ సెల్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మహ్మద్ నజీర్ కలాం, తదితరులు కలామ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు, ఈ కార్యక్రమంలో మైనారిటీ కార్పొరేషన్ డైరెక్టర్ అబ్దుల్ సలీమా, నాయకులు అబ్దుల్ అనీఫ్, షేక్ బాబ్జి, షేక్ సలీం, మహ్మద్ గౌస్, రఫీ పాల్గొన్నారు.

అప్పన్న హుండీ ఆదాయం రూ.2.82 కోట్లు



హుండీల ఆదాయాన్ని లెక్కిస్తున్న సిబ్బంది

సింహాచలం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహస్వామికి గత 44 రోజుల్లో భక్తులు హుండీల ద్వారా రూ.2.82 కోట్ల కట్న, కానుకలను సమర్పించారు. ఈఓ వేంద్ర త్రినాథరావు సారథ్యంలో ఇన్‌స్పెక్టర్ శ్రీధర్ ప్రత్యేక పర్యవేక్షణలో సింహగిరిపై ఉన్న పరకామణి కేంద్రంలో బుధవారం హుండీల లెక్కింపు చేపట్టారు. నగదు రూపంలో రూ.2,82,18,987 కోట్లు లభ్యం రాగా స్వర్ణం 79.1 గ్రాములు, రజితం 13.75 కిలోలు లభించాయి.అలాగే 205 యూఎస్ఏ డాలర్లు, 500 ఒమన్ పైసా, 33 యూరోలు, 15 కెనడా డాలర్లు, 30 సింగపూర్ డాలర్లు, యూఏఈకి చెందిన 95 దీరమ్స్, 16 సౌదీ అరేబియా రియల్స్, 79 ఖతార్ రియాల్స్, 144 నేపాల్ రూపాయిలు, 23 మలేషియా రింగిట్స్, 10 కువాయిట్ దీనార్స్, శ్రీలంక, మయన్మార్, ఉగాండా, ఖజకిస్తాన్, ఆస్ట్రేలియా దేశాలకు చెందిన కరెన్సీలు కూడా హుండీల ద్వారా స్వామి ఖజానాకు లభ్యమయ్యాయి. ఈ కార్యక్రమంలో దేవస్థానానికి చెందిన పలు విభాగాలకు చెందిన సహాయ ఈఓలు, పర్యవేక్షణాధికారులు, ఎస్‌పీఎల్ఎన్ వాకర్స్ క్లబ్ సభ్యులు, శ్రీహరి సేవా సం ఘం కార్యకర్తలు పాల్గొన్నారు.

దుకాణం తెరిచారు!

... 7వ పేజీ తరువాయి

చూసి అక్కడ దుకాణాలు ఏర్పాటుచేయడానికి వీల్లేదంటూ స్పష్టంచేసి, తక్షణం తొలగించాలని ఆదేశించారు. దీంతో కూటమి ప్రజా ప్రతినిధి ఒకరు ఏయూ వీసీతో మాట్లాడి ఇంజనీరింగ్ కళాశాల మైదానానికి ఎదురుగా ఉన్న కొత్తమైదానంలో దుకాణాలు ఏర్పాటుకు అనుమతి ఇవ్వాలని కోరడంతో బుధవారం సాయంత్రం అంగీకరించినట్టు తెలిసింది. దీంతో అక్కడ దుకాణాల ఏర్పాటుపనులు ప్రారంభించారు. ఈ విషయం పోలీస్, అగ్నిమాపక శాఖ అధికారుల వద్ద ప్రస్తావించగా తమకు దుకాణాల ఏర్పాటుకు సంబంధించి ఇప్పటివరకూ ఎలాంటి దరఖాస్తులు రాలేదని సమాధానం ఇచ్చారు. పోలీస్ అధికారుల సూచనల మేరకు సమీప ప్రాంతాల్లో ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా దుకాణాలు ఏర్పాటు చేయాల్సి ఉంటుందని అగ్నిమాపక శాఖ అధికారులు చెబుతున్నారు. అలాకాకుండా దుకాణాలు ఏర్పాటుచేసిన తర్వాత తాము వెళ్లినా ఉపయోగం ఉండదని పేర్కొంటున్నారు.

ఒక్కో దుకాణం రూ.1.2 లక్షలకు విక్రయం

బాణసంచా వ్యాపారం చేయాలనుకునేవారే దుకాణం ఏర్పాటుకోసం దరఖాస్తు చేసుకోవాలి. కానీ నగరానికి చెందిన కూటమి ప్రజా ప్రతినిధి అనుచరులు ఇద్దరు మైదానం నుంచి దుకాణాల ఏర్పాటు వరకూ జీవీఎంసీ, అగ్నిమాపక, పోలీస్ శాఖ, ఏపీఈపీడీసీఎల్ నుంచి అన్ని అనుమతులు తాము తెస్తామని హామీ ఇస్తున్నారు. అందుకు రూ.1.2 లక్షలు డిమాండ్ చేస్తున్నారు. అసోసియేషన్‌ను ముందుపెట్టి వారిద్దరే చక్రం తిప్పుతున్నారని వ్యాపారులే పేర్కొంటున్నారు. దుకాణం ఏర్పాటుకు రూ.30 వేలకు ఒకరికి కాంట్రాక్టు ఇచ్చారని, అనుమతుల కోసం మరో రూ.30 వేలు వరకు ఖర్చుపెట్టి, మిగిలిన రూ.60 వేలు తమ జేబులో వేసుకుంటారని ఆరోపిస్తున్నారు. బినామీ పేర్లతో బల్క్‌గా దరఖాస్తులు పెట్టి, అనుమతి వచ్చిన తర్వాత కావాల్సిన వారికి వాటిని విక్రయిస్తారని చెబుతున్నారు. దీనిపై కూటమి ప్రజా ప్రతినిధులు, అధికారులు లోతుగా దృష్టిసారించి దరఖాస్తు చేసుకున్న వ్యక్తే దుకాణం నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

దాడి అప్పారావుకు నేతల నివాళి

గోపాలపట్నం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో మంగళవారం సాయంత్రం మృతి చెందిన తెలుగుదేశం పార్టీ సీనియర్ నేత దాడి అప్పారావు అంత్యక్రియలు కొత్త పాలెం గ్రామంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు, మాజీ మంత్రి దాడి వీరభద్రరావు, మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద్, పలువురు కార్పొరేటర్‌లు, నేతలు దాడి అప్పారావు మృతదేహానికి నివాళులర్పించారు.

బాక్సింగ్ పోటీలకు అలేఖ్య ఎంపిక



సింధియా, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): రాజమండ్రిలో ఇటీవల జరిగిన ఏపీ 69వ నేషనల్ స్కూల్ గేమ్స్‌లో అండర్-17 బాలికల 44, 46 కిలోల విభాగం బాక్సింగ్ పోటీల్లో కేంద్రీయ విద్యాలయం విద్యార్థిని వద్దాది అలేఖ్య బంగారు పతకం సాధించింది. ఈ నెల 28 నుంచి నవంబరు 3 వరకు అరుణాచల్‌ప్రదేశ్‌లో జరగనున్న జాతీయ బాక్సింగ్ పోటీలకు కూడా తాను ఎంపికైనట్లు అలేఖ్య తెలిపింది. అలేఖ్యను పాఠశాల యాజమాన్య ప్రతినిధులు అభినందించారు.

సినిమా గైడ్

- **కానిస్టేబుల్** : జగదాంబ, రమాదేవి,
- **బల్టీ** : గోకుల్
- **కాంతార 2**: మెలోడి, శరత్, శ్రీరామా, శ్రీకన్య, ఊర్వశి (కంచరపాలెం), లక్ష్మీనరసింహ-2(104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), శ్రీకన్య (గాజువాక)
- **ఓజీ**: శారదా, జగదాంబ, రమాదేవి, సంగం, లీలామహల్, కిన్నెర, కామేశ్వరి, వెంకటేశ్వర-1, 2, శ్రీకన్య-2, శ్రీకన్య హెవెన్-3, మినీ మోహిని (గాజువాక), శ్రీకాంతి, సుకన్య, మౌర్య (గోపాలపట్నం), ఎస్.వి.సి.లిఖిత (శ్రీహరిపురం)
- **మిరాయి**: జగదాంబ, లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సౌజన్య (గోపాలపట్నం), నటరాజ్-1 (పెందుర్తి), కన్య (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం)
- **ఇడ్లీ కొట్టు** : శ్రీ వెంకటేశ్వర, రమాదేవి

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 19, టమాటా 21, వంకాయలు (తెలుపు) 36, వంకాయలు (నలుపు) 46, బెండకాయలు 32, పచ్చిమిర్చి 36, కాకరకాయలు 30, బీరకాయలు 34, ఆనపకాయ 20, కాలీఫ్లవర్ 38, క్యాబేజి 20, క్యారెట్ 58, దొండకాయలు 32, బంగాళ దుంపలు 18, అరటికాయ (పె)8, మునక్కాడలు (కిలో) 64, అల్లం (పాతది) 70, బరబాటి 40, ముల్లంగి 28, నిమ్మకాయలు (కిలో) 55, బద్దచిక్కుడు 60, దోస కాయలు 22, వెల్లుల్లి (పెద్దవి) 65, కొబ్బరికాయ (పెద్దది) 40, బీన్స్ (పెన్సిల్) 56, కీర దోస 28, కాప్సికమ్ 64, పొట్లకాయ (పెద్దది) 24, చేమదుంపలు 30, చిలగడదుంపలు 36, కంద 36, దేముడు చిక్కుడు 80, గోరు చిక్కుడు 40, కూర పెండలం 26, బ్రకోలి 45, పనసపొట్టు 200, కొండఉసిరి 70, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాల కూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 60, బూడిద గుమ్మడికాయ 20, కర్రపెండలం 24, మామిడి అల్లం 100, బొప్పాయి 36, జామకాయలు (కిలో) 55.

కోడిగుడ్లు (నెక్)
(వంద - రూ.లలో)

విశాఖపట్నం	535
విజయనగరం	539
శ్రీకాకుళం	539

చికెన్ ధరలు
బ్యాగ్

రైతు ధర	125
లైవ్ ధర	145
విత్ స్కిన్	260
స్కిన్‌లెస్	270

విశాఖను విశ్వ నగరంగా నిలిపేందుకు సీఎం కృషి

- టీడీపీ 'గాజువాక' సమన్వయకర్త ప్రసాదుల శ్రీనివాస్
- గూగుల్ రాక పట్ల పాత గాజువాకలో సంబరాలు



పాత గాజువాకలో సంబరాలు జరుపుకుంటున్న నాయకులు, కార్యకర్తలు

గాజువాక, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): విశాఖను విశ్వ విఖ్యాత నగరంగా తీర్చిదిద్దేందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు విశేష కృషి చేస్తున్నారని తెలుగుదేశం పార్టీ గాజువాక నియోజకవర్గ సమన్వయకర్త ప్రసాదుల శ్రీనివాస్ అన్నారు. విశాఖ నగరంలో గూగుల్ సంస్థ ఏఐ డేటా సెంటర్ ఏర్పాటు చేయనుండడం చరిత్రాత్మక పరిణామమన్నారు. విశాఖకు గూగుల్ ఏఐ డేటా సెంటర్ రానుండడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ బుధవారం పాత గాజువాకలో తెలుగు యువత ఆధ్వర్యంలో సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా ప్రసాదుల శ్రీనివాస్ మాట్లాడుతూ దేశంలో ఆంధ్రప్రదేశ్ అన్ని రంగాలలో ముందుందని, ఇప్పుడు విశాఖను మరింత అభివృద్ధి చేయడమే ధ్యేయంగా చంద్రబాబు ముందుకు సాగుతున్నారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కొద్ది రోజుల్లోనే విశాఖకు పలు ప్రముఖ కంపెనీలు వచ్చాయని, దీంతో యువతకు ఉపాధి అవకాశాలు మరింత మెరుగయ్యాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏపీ గ్రీనరీ, బ్యూటీషియన్ డైరెక్టర్ మొల్లి పెంటిరాజు, కార్పొరేటర్ పల్లా శ్రీనివాసరావు, నాయకులు పులి వెంకటరమణారెడ్డి, నల్లూరు సూర్యనారాయణ, పుచ్చా విజయ్‌కుమార్, గంధం వెంకటరావు, కరణం కనకారావు, దీనంకొండ కృష్ణంరాజు, యువత అధ్యక్షుడు ఎం.గణపతి, ప్రధాన కార్యదర్శి నరేష్, నాయకులు పాల్గొన్నారు.

టీడీపీ 87వ వార్డు కార్యాలయంలో..

కూర్మన్నపాలెం: విశాఖలో గూగుల్ సంస్థ ఏఐ డేటా సెంటర్ ఏర్పాటు కానుండడం పట్ల ఆనందం వ్యక్తం చేస్తూ టీడీపీ 87వ వార్డు కార్యాలయంలో రాష్ట్ర కార్యదర్శి బొండా జగన్ ఆధ్వర్యంలో ప్లకార్డులు ప్రదర్శిస్తూ, బాణసంచా కాల్చి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గూగుల్ రాకతో విశాఖ ఖ్యాతి విశ్వ వ్యాపితం కానున్నదన్నారు. హైటెక్ సిటీ హైదరాబాద్ తరహాలో విశాఖ నగరం అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. కూటమి నాయకులు ఎస్ఎస్ విజయరామరాజు, డీవీ అప్పారావు, ఎస్.కనకరాజు, పి.ఆనంద్‌కుమార్, పి.దానయ్య, కె.శ్రీను, మాటూరి రాము, కె.కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.



అమృతరావు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న కార్మిక నాయకులు

'ఉక్కు' స్థాపనలో అమృతరావు కృషి ప్రశంసనీయం

ఉక్కుటౌన్‌షిప్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): స్టీల్ ప్లాంట్ ఏర్పాటులో దివంగత టి.అమృతరావు చేసిన కృషి ప్రశంసనీయమైనదని ఉక్కు కార్మిక సంఘ నాయకులు అన్నారు. స్టీల్ ప్లాంటును విశాఖలోనే ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ నాడు కలెక్టరేట్ వద్ద నాటి ఎమ్మెల్యే అమృతరావు చేపట్టిన ఆమరణ నిరాహార దీక్షకు ప్రభుత్వం స్పందించిన రోజును పురస్కరించుకుని బుధవారం ప్లాంట్‌లో ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ ఎన్నో పోరాటాలతో సాధించుకున్న స్టీల్ ప్లాంటును ప్రస్తుతం పరిరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. నాయకులు డి.ఆదినారాయణ, జె.అయోధ్యరామ్. పీవీ రమణమూర్తి, యు.రామస్వామి, పిట్టా రెడ్డి, రామ్మోహన్‌కుమార్, బి.అప్పారావు, పెంటారావు, తదితరులు పాల్గొన్నారు.

జీఎస్టీ సంస్కరణలతో మధ్యతరగతి ప్రజలకు ప్రయోజనం

పెందుర్తిరూరల్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): ప్రధాని నరేంద్ర మోదీ ప్రవేశ పెట్టిన జీఎస్టీ సంస్కరణలతో మధ్యతరగతి ప్రజల జీవన అవసరాలకు ఊతం లభించిందని 95వ వార్డు కార్పొరేటరు ముమ్మన దేముడు పేర్కొన్నారు. వార్డు పరిధి వరలక్ష్మీనగర్‌లో బుధవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. జీఎస్టీ సంస్కరణలపై అవగాహన కల్పించారు. ముందుగా కాలనీ వాసులు నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్నారు. మోదీ చిత్ర పటానికి క్షీరాభిషేకం చేశారు. సీవో ఈశ్వరరావు, కూటమి నాయకులు గంట్ల నర్సింహమూర్తి, కోన కల్యాణ్, వర్మ, భాగ్యలక్ష్మి, లహరి, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

వరలక్ష్మీనగర్‌లో అవగాహన ర్యాలీ

వేపగుంట: వేపగుంట సమీప వరలక్ష్మీనగర్‌లో జీవీఎంసీ ఆధ్వర్యంలో జీఎస్టీ తగ్గింపుపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్పొరేటర్ ముమ్మన దేముడు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం జీఎస్‌టీ తగ్గింపు ద్వారా సామాన్య, మధ్యతరగతి ప్రజలకు ఎంతో మేలు చేసిందన్నారు. సామాన్య ప్రజలు వాడే ఎలక్ట్రికల్ వస్తువులు, గృహోపకరణాలు, వాహనాల ధరలు తగ్గాయని పేర్కొన్నారు. కాలనీ నాయకులు వర్మ, నరసింహమూర్తి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సిమెంటు కంపెనీని ఏర్పాటు చేస్తే ఊరుకోం

శ్రీలంబోదర స్త్రీశక్తి టిడ్కో సంక్షేమ సంఘం ప్రతినిధులు

పెదగంట్యాడ, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): పెదగంట్యాడ సమీపంలో అంబుజా సిమెంట్ కంపెనీ ఏర్పాటు చేయాలని చూస్తే మహిళల ఆగ్రహానికి చవిచూడాల్సి వస్తుందని శ్రీలంబోదర స్త్రీశక్తి టిడ్కో సంక్షేమ సంఘం హెచ్చరించింది. పెదగంట్యాడ ప్రాంతంలో సిమెంట్ గ్రైండింగ్ యూనిట్ వద్దే వద్దు అంటూ సంఘం ప్రతినిధులు బుధవారం ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేసి కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి కె.సత్యనారాయణ మాట్లాడుతూ సిమెంట్ గ్రైండింగ్ యూనిట్ ఏర్పాటుకు వ్యతిరేకంగా తాము ప్రజా సంఘాలను ఐక్యపరిచి ఉద్యమాన్ని చేపడుతున్నామన్నారు. సంఘం అధ్యక్ష, కార్యదర్శులు రమణి, పీతల లక్ష్మి, ఉపాధ్యక్షురాలు కె.వనజాక్షి, ఇతర సభ్యులు, పాల్గొన్నారు.



కలామ్ పేరు ఆకృతిలో ఏర్పడిన విద్యార్థులు

అబ్దుల్ కలామ్‌కు నివాళి

గోపాలపట్నం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): మాజీ రాష్ట్రపతి, క్షిపణి శాస్త్రవేత్త, భారతరత్న ఏపీజే అబ్దుల్ కలామ్ జయంతిని బుధవారం పలుచోట్ల ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా ఎన్ఎస్‌టీఎల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో డైరెక్టర్ డాక్టర్ అబ్రహం వర్గీస్ మాట్లాడుతూ కలామ్ వంటి మహనీయుల స్ఫూర్తితో యువత దేశాభివృద్ధికి దోహదపడాలన్నారు. దేశ రక్షణ రంగంలో అబ్దుల్ కలామ్ చెరగని ముద్రవేశారన్నారు. ఎన్ఎస్‌టీఎల్ గేటు వద్ద కలామ్ విగ్రహానికి అబ్రహం వర్గీస్, ఇతర శాస్త్రవేత్తలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. శాస్త్రవేత్త డాక్టర్ హెచ్ఎస్ దాస్, ఎన్ఎస్‌టీఎల్ సీఈ యూనియన్ అధ్యక్షుడు ఎ.సునీల్, వర్క్స్ కమిటీ కార్యదర్శి జి.నాగభూషణం, ఉపాధ్యక్షుడు సీహెచ్ ప్రసన్న కుమార్, ఉద్యోగులు, యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.

పెందుర్తి: ఇక్కడి ఆదిత్యనగర్‌లో గల యూనిక్ పబ్లిక్ స్కూల్‌లో అబ్దుల్ కలామ్ చిత్రపటానికి కరస్పాండెంట్ కోనేటి ఆదినారాయణ పూలమాల వేసి నివాళులర్పించారు. తొలుత కలామ్ పేరు ఆకృతిలో విద్యార్థులు ఏర్పడిన విన్యాసం ఆకట్టుకుంది.

ఆటోనగర్: డాక్టర్ అబ్దుల్ కలామ్ ఆశయ సాధనకు విద్యార్థులు కృషి చేయాలని గాజువాక ట్రాఫిక్ సీఐ షేక్ హుస్సేన్ సూచించారు. 70వ వార్డు శ్రీనివాసనగర్‌లో గల ట్వింకిల్ స్కూల్ ప్రాంగణంలోని కలామ్ విగ్రహానికి ఆయన పూలమాల వేసి నివాళులర్పించి మాట్లాడారు. కలామ్ మాటలను స్ఫూర్తిగా తీసుకుని మానవ సేవే-మాధవ సేవగా భావిస్తూ వందలాది మంది పేద విద్యార్థులకు ఉచిత విద్యతో పాటు వైద్య సేవలందిస్తున్న స్కూల్ యాజమాన్యాన్ని అభినందించారు. స్కూల్ డైరెక్టర్ దొడ్డి శ్యామ్, ప్రిన్సిపాల్ కరుణకుమారిలు మాట్లాడుతూ కలాం ఆశయ సాధనే ధ్యేయంగా స్ఫూర్తిదాయక కార్యక్రమాలను చేపడుతున్నామన్నారు. ఉపాధ్యాయులు డి.చంద్రశేఖర్, గీత, శిరీష, లలిత, కల్యాణి, విద్యార్థులు పాల్గొన్నారు.



కలామ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న షేక్ హుస్సేన్, తదితరులు

బ్రెస్ట్ క్యాన్సర్‌పై అవగాహన ర్యాలీ

అగనంపూడి, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): విజ్ఞాన్ ఫార్మసీ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో బుధవారం కాపుజగ్గరాజుపేటలో బ్రెస్ట్ క్యాన్సర్‌పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ప్రిన్సిపాల్ వై.శ్రీనివాసరావు ర్యాలీని ప్రారంభించి మాట్లాడారు. కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం చేస్తున్న సేవలను కొనియాడారు. ప్రాణాంతకమైన జబ్బులు, వ్యాధుల గురించి ప్రజల్లో అవగాహనను పెంపొందించడం అభినందనీయమన్నారు. అనంతరం విద్యార్థులు ర్యాలీలో భాగంగా ఇంటింటికీ వెళ్లి ఆరోగ్యం కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

విద్యార్థులు నైపుణ్యానికి పదును పెట్టాలి: ఆర్ఐవో

మల్కాపురం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు నిరంతరం తమ నైపుణ్యాలను పెంచుకుని, సృజనాత్మకతను ప్రదర్శించాలని ఆర్ఐవో) మురళీధర్ సూచించారు. స్థానిక సెయింట్ ఆన్స్ జూనియర్ కళాశాల ఏర్పాటు చేసి 50 ఏళ్లు పూర్తవ్వడం, మాజీ రాష్ట్రపతి డాక్టర్ అబ్దుల్ కలామ్ జయంతి నేపథ్యంలో బుధవారం వివిధ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా 50 స్టాల్స్‌తో ఎగ్జిబిషన్ ఏర్పాటు చేసి, కళాశాల ఆవరణలో 50 మొక్కలు నాటారు. ఎగ్జిబిషన్‌ను ఆర్ఐవో ప్రారంభించారు. కార్యక్రమంలో సెయింట్ ఆన్స్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సిస్టర్ ప్రేమకుమారి, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సిస్టర్ క్యాస్లిన్, కరస్పాండెంట్ సిస్టర్ గెసిల్లా, అధ్యాపకురాలు సిస్టర్ సంధ్య తదితరులు పాల్గొన్నారు.

మంత్రి మనోహర్‌ను కలిసిన 'అయితి'



మంత్రికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న అయితి సింహాచలం

పెందుర్తి, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర పౌరసరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్‌ను పెందుర్తి పీఏసీఎస్ చైర్మన్, జనసేన జిల్లా కార్యదర్శి అయితి సింహాచలం మర్యాదపూర్వకంగా కలిశారు. విశాఖలో జనసేన ముఖ్య కార్యకర్తల సమావేశానికి హాజరై నోవాటెల్‌లో బస చేసిన మంత్రి మనోహర్‌ను ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబుతో కలిసి చైర్మన్ అయితి భేటీ అయ్యారు. రైతులకు సహకార బ్యాంకు ద్వారా సకాలంలో రుణాలు అందించాలని మంత్రి సూచించారు. జనసేన 97వ వార్డు అధ్యక్షుడు సేనాపతి సోమశేఖర్ మంత్రిని కలిశారు.

ఉక్కు నిర్వాసితులకు శాశ్వత పరిష్కారం చూపాలి

ఉక్కుటౌన్‌షిప్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): ఉక్కు నిర్వాసిత నిరుద్యోగులకు శాశ్వత పరిష్కారం చూపాలని నిర్వాసిత సంఘ నాయకులు డిమాండ్ చేశారు. ఉక్కు నిర్వాసిత నిరుద్యోగులు బుధవారం స్టీల్ ప్లాంట్ నెహ్రూ పార్కులో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ప్లాంట్ కోసం సర్వం త్యాగం చేసిన నిర్వాసితులకు ఉపాధి కల్పించకపోవడం దారుణమన్నారు. ఇటీవల నిర్వాసిత కాంట్రాక్టు కార్మికులను కూడా యాజమాన్యం తొలగించిందని ఆవేదన వ్యక్తం చేశారు. నిర్వాసితుల సమస్యలపై స్థానిక ప్రజాప్రతినిధులు కల్పించుకొని న్యాయం చేయాలని కోరారు. నాయకులు పీతన భాస్కరరావు, ఉమ్మడి అప్పారావు, సోంబాబు, అప్పలరెడ్డి, వెంకటేష్, చిన్న, సన్యాసిరావు, తదితరులు పాల్గొన్నారు.

ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశం

గోపాలపట్నం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రంలో ఆస్పత్రి అభివృద్ధి కమిటీతో ఎమ్మెల్యే పి.గణబాబు బుధవారం సమావేశమయ్యారు. ఆస్పత్రిలో వసతులు, అభివృద్ధికి చేపట్టాల్సిన అంశాలపై అధికారులతో చర్చించారు. ఐసీడీసీ విభాగం, ఆర్‌వో తాగునీటి ప్లాంట్ ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. రోగులకు మెరుగైన సేవలు అందించాలని వైద్య బృందానికి ఎమ్మెల్యే సూచించారు. డీసీహెచ్ డాక్టర్ శంకర ప్రసాద్, సూపరింటెండెంట్ డాక్టర్ సుజాత, జడ్పీ శంకరరావు, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ డైరెక్టర్‌లు మజ్జారి శ్రీనివాస్, కవిత తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ఎన్.ఎ.డి.జంక్షన్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 52వ వార్డులో రూ.90 లక్షలతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు మాజీ డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ బుధవారం శంకుస్థాపన చేశారు. కరాసలోని జీవీఎంసీ పాఠశాల అదనపు భవనం, న్యూకరాస రజకకాలనీలో సామాజిక భవనానికి అదనపు అంతస్తు నిర్మిస్తారు. వైసీపీ నాయకులు జియ్యాని మారుతి, వి.శ్రీను, పాల్గొన్నారు.